నవంబర్
2021

187

సంపుటి : 16 సంచిక : 6 వెల రు. 10/-

ఈ సంచికలో........

75 సంవత్సరాల స్వాతంత్ర్యం: పరిణామాలు
ఆగ్జిలరీ గ్రూపుల ఏర్పాటు, నిర్వహణ: తెలంగాణా రాష్ట్ర అనుభవాలు
ఎయిర్ ఇండియా అమ్మకంతో విమానయానంలో గుత్తాధిపత్యం
ఎర్రజెండా ఎజెండా
వృద్ధి కిందికి దిగడం లేదని తేల్చిన కుటుంబ సర్వేలు
'దేశ ద్రోహి' నామ సంవత్సరం
అస్సాంలో విభజించి పాలిస్తున్న బిజెపి
అభివృద్ధి పన్నుకు వ్యతిరేకంగా పంజాబ్ రైతాంగ పోరాటం

# అభివృద్ధి పన్నుకు వ్యతిరేకంగా పంజాబ్ రైతాంగ పోరాటం

అభివృద్ధి పన్ను (బెటర్‌మెంట్ లెవి)కి వ్యతిరేకంగా 1959లో పంజాబ్ రైతాంగం వీరోచితమైన పోరాటం చేసింది. ఇది భారత రైతాంగ ఉద్యమంలో మరో కలికితురాయి. స్వతంత్ర భారతదేశంలో తెలంగాణ సాయుధ పోరాటం తరువాత విస్తృతంగా రైతాంగాన్ని ఐక్య పరచింది. రైతాంగం, వ్యవసాయ కార్మికులతో పాటు రాజకీయ అనుబంధాలతో సంబంధం లేకుండా అన్ని తరగతుల ప్రజానీకం మద్దతు పొందిన అతి పెద్ద పోరాటం ఇది.

పంజాబ్ రైతాంగం చేసిన ఈ శాంతియుత ఉద్యమం రైతులు, వ్యవసాయ కార్మికులలో పేరుకుపోయిన అసంతృప్తికి వ్యక్తీకరణ. ప్రభుత్వం అనుసరించిన ప్రజావ్యతిరేక విధానాలు, పెరుగుతున్న ఆర్థిక సంక్షోభానికి రైతాంగం, ప్రజల వ్యతిరేకతకు చిహ్నం ఈ ఉద్యమం. అభివృద్ధి పన్ను వ్యతిరేక పోరాట రూపంలో రైతాంగ అసంతృప్తి బయటపడినా, స్వతంత్రం వచ్చిన నాటి నుండి వరుసగా అమలవుతూ వస్తున్న ప్రజావ్యతిరేక విధానాలే ఆ పోరాటానికి మౌలికమైన కారణం.



అభివృద్ధి పన్నుకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ప్రముఖ పాత్ర వహించిన భగత్ సింగ్ ఝగ్గియాన్స్

స్వతంత్రం వచ్చిన తరువాత పంజాబ్ ప్రజలపై పన్ను భారం ఒకేసారి రూ. 14 నుండి రూ. 25 కి పెరిగింది. అప్పుల పెరుగుదల వేగవంతమైంది. దీనికి తోడు సాగుచేసుకుంటున్న భూముల నుండి లక్షలాది మంది రైతులను తరిమేయడంతో వారు వ్యవసాయ కార్మికులుగా మారారు. పెద్దసంఖ్యలో పనులు కోల్పోవటంతో నిరుద్యోగం విపరీతంగా పెరిగింది. మార్కెట్ శక్తులు కూడా పంజాబ్ రైతాంగాన్ని దోచేశాయి.

1952లో భాక్రా కెనాల్ వ్యవస్థను పూర్తి చేయక ముందే ఆ ఖర్చునంతటిని ప్రజల వద్ద నుండి రాబట్టేందుకు పంజాబ్ ప్రభుత్వం అభివృద్ధి పన్ను పేరిట ఒక చట్టం చేసింది. కమ్యూనిస్టు పార్టీ, కిసాన్‌సభ ఈ చట్టాన్ని మొదట్లోనే వ్యతిరేకించాయి. ఈ పన్ను గనక వేస్తే వ్యవసాయంలో మదుపు పెట్టడానికి రైతాంగం దగ్గర సొమ్మేమీ మిగలదని, ఇక పేద రైతులకు పొలాలను అమ్ముకోవడం మినహా గత్యంతరం ఉండదని వారు వాదించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వాదనను వినేందుకు సిద్ధపడలేదు. పైగా 1959 జనవరిలో అభివృద్ధి పన్ను ముందస్తు చెల్లింపులకు ఆర్డినెన్సు జారీ చేసింది. ప్రభుత్వ ఈ రెచ్చగొట్టుడు చర్య అగ్నిలో ఆజ్యం పోసినట్టయింది.

1957 చివర, 1958 ప్రారంభంలో రాష్ట్రంలోని రైతులందరికీ పన్ను నోటీసులు ఇవ్వగానే రైతాంగం ఆగ్రహంతో ఊగిపోయింది. వారి ఆగ్రహాన్ని సామూహిక విజ్ఞప్తులు, సంతకాల సేకరణ, సదస్సులు, సభలు, ప్రదర్శనలు తదితర రూపాలలో తెలియచేశారు. ఈ నోటీసులకు వ్యతిరేకంగా 11,000 ల మందికి పైగా రైతులు వ్యక్తిగతంగా కోర్టులలో కేసులు వేశారు. 1958 ఫిబ్రవరి నెలలో కమ్యూనిస్టు పార్టీ, కిసాన్‌సభ ప్రభుత్వానికి విజ్ఞాపన పత్రాలను సమర్పించాయి. చండీఘర్‌లో అన్ని రాజకీయ పార్టీలతో సదస్సు నిర్వహించి, ఒక ఐక్య కమిటీని ఏర్పాటు చేశారు. ఇది రాష్ట్ర ప్రభుత్వానికి ఒక విజ్ఞాపన పత్రాన్ని సమర్పించింది. 1958 సెప్టెంబర్‌లో రాష్ట్రవ్యాప్తంగా సామూహిక నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఇందులో లక్షకు పైగా రైతులు పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రతి వాదననూ కిసాన్ సభ ఖండించింది. ఈ వాదనలతో ఉద్యమం రాష్ట్రంలోని ప్రజాతంత్రవాదుల మద్దతు సంపాదించింది.

కిసాన్ సభ వివిధ స్థాయిలలో కార్యాచరణ కమిటీలను ఏర్పాటు చేసింది. సత్యాగ్రహం చేయడానికి సిద్ధపడిన వాలంటీర్ల పేర్లను నమోదు చేసింది. లక్ష్యాన్ని చేరేందుకు ఏ త్యాగానికైనా సిద్ధపడిన 10,000 మంది వలంటీర్ల పేర్లు జనవరి మూడో వారానికల్లా నమోదయ్యాయి.

రాష్ట్ర స్థాయిలో కార్యాచరణ కమిటీ ఏర్పడి, రహస్యంగా పనిచేయడం మొదలుపెట్టింది.

1959 జనవరిలో పంజాబ్‌లో ఆహార కొరత తీవ్రరూపం దాల్చింది. 1958లో రైతులు క్వింటాల్ గోధుమలను రూ. 34 కు అమ్మాల్సివచ్చింది. కానీ ఆరేడు నెలలు తిరగకుండానే వ్యవసాయ కూలీలు, రైతులు అవే గోధుమలను రెట్టింపు ధరకు కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఆహార ధాన్యాల నిల్వలకు గానీ, వాటి పంపకానికి గానీ చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వం

(మిగతా 34వ పేజీలో)

## ఈ సంచికలో...

1. అభివృద్ధి పన్నుకు వ్యతిరేకంగా పంజాబ్ రైతాంగ పోరాటం ..... 2

2. 75 సంవత్సరాల స్వాతంత్ర్యం: పరిణామాలు
సీతారామ్ ఏచూరి ......... 4

3. ఆగ్జిలరీ గ్రూపుల ఏర్పాటు, నిర్వహణ: తెలంగాణా రాష్ట్ర అనుభవాలు
పోతినేని సుదర్శనరావు .......... 12

4. ఎయిర్ ఇండియా అమ్మకంతో విమానయానంలో గుత్తాధిపత్యం
వి శ్రీధర్ ........ 15

5. ఎర్రజెండా ఎజెండా
ఎస్ వీరయ్య .......... 19

7. వృద్ధి కిందికి దిగడం లేదని తేల్చిన కుటుంబ సర్వేలు
టికె రాజలక్ష్మి.......... 22

28. 'దేశద్రోహి' నామ సంవత్సరం
దివ్య త్రివేది ........... 26

9. అస్సాంలో విభజించి పాలిస్తున్న బిజెపి
తీస్తా సెతల్వాద్ ........... 29



సంపాదకుడు:
**ఎస్. వెంకట్రావు**

సంపాదక వర్గం:
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరఫున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ఫోన్: ఎడిటర్ : 9490099333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 9490098977**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com


# చరిత్ర వక్రీకరణ

చరిత్ర మనకు అనుకూలంగా లేనప్పుడు చరిత్రనే మనకు అనుకూలంగా మార్చి రాసేసుకోవాలన్న సూత్రాన్ని ఆర్ఎస్ఎస్-బిజెపి హిందూత్వ పరివారం నూటికి నూరుపాళ్లు అమలు జరుపుతోంది. పుక్కిటి పురాణాలను చరిత్రగా నమ్మబలకడం, వాస్తవ చరిత్రను తన సిద్ధాంతానికి అనుగుణంగా వక్రీకరించడం హిందూత్వ ఎజెండాలో భాగం. ఆర్ఎస్ఎస్ సిద్ధాంత వేత్త వి.డి. సావర్కర్ చేసిన దేశద్రోహానికి గాంధీజీ ఆమోద ముద్ర ఉందని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన వ్యాఖ్యలు కూడా ఈ హిందూత్వ ఎజెండాలో భాగమే. ఇప్పటి వరకు శతాబ్దాల క్రితం నాటి ప్రాచీన భారత చరిత్రనే వాళ్లు వక్రీకరిస్తూ వచ్చారు. ఇప్పుడు మన కళ్ల ముందు కనిపిస్తున్న ఆధునిక భారత దేశ చరిత్రను కూడా తమకు అనుకూలమైన రీతిలో వక్రీకరించే సాహసానికి పూనుకుంటున్నారని రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యలు చెబుతున్నాయి.

బ్రిటిష్ వారికి క్షమాభిక్ష అర్జీలు పెట్టుకోమని గాంధీజీయే సావర్కర్‌కు సలహా ఇచ్చారనీ, సావర్కర్‌ను జైలు నుండి విడుదల చేయాలని ఆయన బ్రిటిష్ వారిని కోరారనీ రాజ్‌నాథ్ సింగ్ చేసిన ప్రకటన ఇటీవల ఒక ప్రముఖ పత్రికలో వచ్చింది. ఈ రెండూ అంటే సావర్కర్‌కు గాంధీ సలహా చెప్పిడం, ఆయన విడుదలకు సిఫార్సు చేయడం పూర్తిగా అవాస్తవాలని రికార్డులు చెబుతున్నాయి. గాంధీజీ భారత దేశానికి వచ్చి, స్వాతంత్రోద్యమ పగ్గాలు చేపట్టడానికి ముందే, 1911 నుండే సావర్కర్ బ్రిటిష్ వారి క్షమాభిక్ష కోసం అర్జీల మీద అర్జీలు పెట్టుకుని దయనీయంగా అర్థించుకున్న విషయాన్ని బ్రిటిష్ వారికి ఆయన రాసిన లేఖలే చెబుతున్నాయి. "ప్రభుత్వం వారు తమ ప్రయోజనాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని దయతో నన్ను విడుదల చేస్తే, రాజ్యాంగ పురోగతికీ, ఆంగ్లేయుల ప్రభుత్వానికీ విధేయుడిగా వుండగలనని గట్టిగా చెబుతున్నాను" అని 1913లో ఆయన క్షమాభిక్ష పిటిషన్ రాసి ఇచ్చాడు. బ్రిటిష్ వారికి ఆయన అటువంటి అనేక క్షమాభిక్ష పిటిషన్లు పెట్టుకున్నాడు.

మహాత్మా గాంధీని గాడ్సే హత్య చేశాడు. ఆ హత్య వెనుక ప్రధాన సూత్రధారి సావర్కర్. కేవలం చిన్న సాంకేతిక లోపంతో ఆయన ఈ హత్య కేసునుండి తప్పించుకున్నాడు. గాంధీజీ హత్యేకాదు ఇంకా అనేక హత్యల వెనుక ఆయన పాత్ర ఉన్నది. సావర్కర్ హిందూత్వ తీవ్రవాది. హత్యలకు పథక రచనలు చేయడం వాటిని తన చేతికి మట్టి అంటకుండా అమలుచేయడం, ఎక్క డయినా దొరికేటట్టు ఉంటే ఎన్ని అబద్ధాలు చెప్పాయినా, ఏ దారిలో అయినా తప్పించుకోవడం ఆయనకలవాటు. దేశభక్తికి పేటెంట్ తీసుకున్నామని చెప్పుకుంటున్న తమ పరివారంలో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలుకు వెళ్లిన ఏకైక 'నాయకుడు' దేశద్రోహపూరిత నేరానికి పాల్పడ్డాడన్న వాస్తవాన్ని సంఘ్ పరివార్ నాయకులు జీర్ణించుకో లేకపోతున్నారు. దీన్నుండి బయటపడడం కోసం సంఘ్ పరివార్ చేస్తున్న ప్రయత్నంలో భాగమే రాజ్‌నాథ్ సింగ్ వక్రీకరణలు. క్షమాభిక్ష అర్జీలు పెట్టుకోవాలని గాంధీజీనే సావర్కర్‌కు సలహా ఇచ్చారని చెప్పడం ద్వారా వారు ఒక దేశ ద్రోహిని దేశభక్తునిగా మార్చడానికి ప్రయత్నిస్తున్నారు.

నిజానికి భారత దేశ స్వాతంత్ర్యోద్యమంలో ఆర్ఎస్ఎస్, దాని పూర్వరూపమైన హిందూ మహాసభ ఏనాడూ పాల్గొనలేదు సరికదా అవకాశం వచ్చినప్పుడల్లా బ్రిటిష్ వారికి సహకరించడానికే ప్రయత్నించాయి. దానికి భిన్నంగా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న కమ్యూనిస్టు యోధుల పాత్ర చరిత్రలో నమోదైవున్నది. సిపిఐ(ఎం) మొదటి పొలిట్‌బ్యూరో సభ్యులు తొమ్మిది మందీ బ్రిటిష్ పాలనలో, తర్వాత కాంగ్రెస్ పాలనలోనూ అనేక సంవత్సరాలు జైళ్లలో గడిపారు. అండమాన్‌లోని సెల్యూలార్ జైలులో మార్బుల్స్‌పై లిఖించిన పేర్లలో అత్యధికం కమ్యూనిస్టులు, విప్లవకారుల గ్రూపులలో పనిచేసిన వారివే ఉన్నాయి. ఆర్ఎస్ఎస్‌కు చెందిన ఒక్కరి పేరు కూడా వాటిలో లేదు. వారు మతపరమైన ఉద్రిక్తతలు, ఘర్షణలు రెచ్చగొట్టే పథకాలను రచిస్తూ జాతీయోద్యమానికి దూరంగా ఉన్నారు.

అటువంటి దేశద్రోహ శక్తులు ఈనాడు భారత దేశ పరిపాలనా పగ్గాలు చేపట్టి దేశభక్తులను దేశద్రోహ నేరం కింద అరెస్టులు చేయడం విషాదకర పరిణామం. సంఘ్ పరివార్ శక్తుల చరిత్ర వక్రీకరణలను ఎప్పటి కప్పుడు ఎండగట్టడం లౌకిక, పురోగామి శక్తుల ముందున్న పెద్ద కర్తవ్యం.

**ఈ మాసం ముఖ్యాంశం**

# 75 సంవత్సరాల స్వాతంత్ర్యం: పరిణామాలు



సీతారామ్ ఏచూరి

**భా**రత దేశం 75వ స్వాతంత్ర్య వార్షికోత్సవం జరుపుకొంటున్న సమయంలో మన లౌకిక, ప్రజాస్వామ్య, రాజ్యాంగబద్ధమైన రిపబ్లిక్‌ను ఫాసిస్టు ''హిందురాష్ట్ర''గా మార్చటానికి కార్యక్రమం రూపొందించారు. చారిత్రాత్మకమైన భారతదేశ స్వాతంత్ర్య పోరాట లక్ష్యానికి, రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన భారత రాజ్యానికి ఇది పూర్తిగా వ్యతిరేకమైనది. 1947, ఆగస్టు 15న మనం స్వాతంత్ర్యం సంపాదించుకొన్నప్పటికీ, మన రాజ్యాంగంలోని ఆర్టికల్ 370, 35ఎ లను, జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్రహోదాను రద్దు చేసిన 2019, ఆగస్టు 5న, అయోధ్యలో రామాలయ నిర్మాణాన్ని లాంఛనంగా ప్రారంభించిన 2020, ఆగస్టు 5న మాత్రమే మనకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని ప్రచారం చేస్తున్నారు.

చరిత్రలోని అనేక సంఘటనలను వక్రీకరించటం, చరిత్రకు విరుద్ధమైన, అశాస్త్రీయమైన పునాదిపై ఈ వివరణలు ఆధారపడి ఉన్నాయి. అనేక ఇతర అంశాలతో పాటు ఒక దేశంగా భారతదేశం ఆవిర్భవించటం, జాతీయవాదం, జాతీయోద్యమంలో ఆర్ఎస్ఎస్ పాత్ర తదితరాలు వీటిలో ఉన్నాయి. ఈ అంశాలను సక్రమంగా విశ్లేషణ చేయటం ద్వారానే ఈ సవాలును ఎదుర్కొని, ఓడించగలం.

### దృక్పథాల మధ్య పోరాటం

ఈ నూతన దృక్పథం రాత్రికిరాత్రే ఉద్భవించలేదు. జాతీయోద్యమం సందర్భంగా ఆవిర్భవించిన భిన్నమైన రాజకీయ, సైద్ధాంతిక దృక్పథాలున్న శక్తుల మధ్య శతాబ్దానికి పైగా జరిగిన పోరాట ఫలితంగా ఆవిర్భవించిన దృక్పథం అది. అందువలన ఈ మథనంలో ఉద్భవించిన అనేక భావాలను పునర్మూల్యాంకనం చేయటం అవసరం. 'చౌరిచౌరా సంఘటన' తర్వాత 1921లో ప్రారంభించిన సహాయ నిరాకరణ ఉద్యమాన్ని గాంధిగారు ఉపసంహరించటం, 1921లో భారత కమ్యూనిస్టు పార్టీ, 1925లో ఆర్ఎస్ఎస్ ఏర్పాటు కావటంతో స్వాతంత్ర్యానంతరం భారతదేశ భవిష్యత్, దేశ స్వరూపం ఎలా ఉండాలన్న దానిపై వివిధ దృక్పథాల మధ్య తీవ్రమైన సంఘర్షణ ప్రారంభమైంది.

స్వతంత్ర భారతదేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక స్వభావం ఎలా ఉండాలనే దానిపై ఈ మూడు దృక్పథాల మధ్య నిరంతర పోరాటం జరిగింది. భారతదేశ సహజ లక్షణాలైన బహుళత్వం, వైవిధ్యాలను కాంగ్రెస్, కమ్యూనిస్టుపార్టీలు గుర్తించాయి. సంపద్వంతమైన ఈ భిన్నత్వంలోని ఏకత్వాన్ని బలపరచటం, ఈ భిన్నత్వంలోని–భాష, జాతి, మతం, సంస్కృతి తదితరాల– వైవిధ్యాన్ని గౌరవించటం, సమానంగా చూడటం ద్వారానే ఒకదేశంగా ఐక్యం కావటంతో పాటు భారత ప్రజల మధ్య ఐక్యత కూడా బలపడుతుందని వీరు భావించారు. ఈ భిన్నత్వంపై ఏ విధమైన ఏకీకరణవాదాన్ని రుద్దాలని ప్రయత్నం చేసినా అది సామాజిక నిర్మాణం కుప్పకూలిపోవటానికి దారితీస్తుందని కూడా వారు గుర్తించారు. ఈ అవగాహనతోనే స్వతంత్ర భారతదేశం లౌకిక, ప్రజాస్వామిక రిపబ్లిక్‌గా ఉండాలని కాంగ్రెస్‌లోని ప్రధాన స్రవంతి ఆకాంక్షించింది. ఈ లక్ష్యంతో ఏకీభవిస్తూనే లౌకిక, ప్రజాస్వామిక భారతదేశాన్ని మరింత బలపరచుకోవటం కోసం సోషలిజంలో మాత్రమే సాధ్యమయే ఆర్థిక, సామాజిక స్వాతంత్ర్యం ప్రతివ్యక్తికి లభించే విధంగా దేశ రాజకీయ స్వాతంత్ర్యాన్ని విస్తృతం చేయాలని కమ్యూనిస్టులు భావించారు.

ఈ రెండు దృక్పథాలకు పూర్తి వ్యతిరేకంగా ప్రజల మతం ప్రాతిపదికగా స్వతంత్ర భారత దేశ స్వభావాన్ని నిర్ణయించాలని మూడవ దృక్పథం కలిగిన వారు వాదించారు. ఈ దృక్పథం కలిగిన వారు రెండు వాదనలు చేశారు. ఇస్లామిక్ రాజ్యం కావాలని ముస్లీంలీగ్, హిందురాష్ట్ర కావాలని ఆర్ఎస్ఎస్ వాదించాయి. బ్రిటిష్ వలస పాలకులు విభజన పథకం రూపొందించి అమలుచేయటంతో దురదృష్టకరమైన దేశ విభజన జరిగింది. ఇస్లామిక్ రాజ్యం కావాలన్న వాదనకు ప్రాతినిధ్యం వహించిన వారి లక్ష్యం సాకార మైంది. దాని ఫలితంగా తలెత్తిన దుష్పరిణామాలు, ఉద్రిక్తతలను ఈ రోజుకూ అనుభవిస్తూనేవున్నాం. స్వాతంత్ర్యం సాధించినపుడు తమ లక్ష్యాన్ని సాధించటంలో విఫలమైన హిందు మతోన్మాదులు ఆధునిక భారతదేశాన్ని తమ లక్ష్యమైన విద్వేషంతో కూడిన ఫాసిస్టు హిందూరాష్ట్రగా మార్చటానికి ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. మరోవిధంగా చెప్పుకోవాలంటే సమకాలీన భారతదేశంలో జరుగుతున్న సైద్ధాంతిక పోరాటాలు, రాజకీయ విభేదాలు ఈ మూడు దృక్పథాల మధ్య జరుగుతున్న పోరాటాల వ్యక్తీకరణే. "నిజమైన భారతదేశం" మార్గాన్ని, సారాంశాన్ని ఈ పోరాటం నిర్ణయిస్తుందని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. (మనం ఈ అంశానికి తర్వాత తిరిగి వద్దాం).

### పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గం

సామ్రాజ్యవాద దాస్యం నుండి స్వతంత్ర భారతదేశం స్వేచ్ఛను సాధించి, భూస్వామ్య వ్యవస్థ అవశేషాలను తుడిచిపెట్టినప్పుడు మాత్రమే ప్రధాన స్రవంతిగా ఉన్న కాంగ్రెస్ దృక్పథం అయిన లౌకిక, ప్రజాస్వామిక రిపబ్లిక్ పునాదులను బలపరచుకోవటం సాధ్యమౌతుందని కమ్యూనిస్టులు భావించారు. స్వతంత్ర భారతదేశంలో పాలకవర్గాలు –భూస్వాములతో మైత్రి నెరపుతున్న బూర్జువాలు, వారికి నాయకత్వం వహిస్తున్న బడా పెట్టుబడిదారులు

–పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గంలో ముందుకు సాగుతుంటే, వారి ప్రయోజనాలను నెరవేర్చటానికి కాంగ్రెస్ పార్టీ పూనుకున్నది. స్వాతంత్ర్య పోరాటాన్ని తమ లక్ష్యసాధన వరకు తీసుకెళ్ళటంలో ఆ పార్టీ అసమర్థతను ఇది వెల్లడిస్తున్నది. ఈ విధానం దేశ లౌకిక, ప్రజాస్వామ్య పునాదులను బలహీనపర్చింది.

ఇది ఏ విధంగా జరిగింది? మొదటిది, స్వాతంత్ర్య పోరాట సందర్భంగా ప్రజల మధ్య రూపుదిద్దుకున్న సామ్రాజ్యవాద వ్యతిరేక సామాజిక చైతన్యాన్ని వెనక్కునెట్టి కుల, మతభావాలతో కూడిన భావజాలం పెరగటానికి, బలపడటానికి దారితీసింది. రెండవది, సమ్మిళిత భారతదేశ భావనను బలపరచటానికి మారుగా దోపిడీకి గురవుతున్న ప్రజల సంఖ్య పెరుగుతుండగా, వారిని అభివృద్ధిలో భాగస్వాములను చేయకుండా దూరంగా ఉంచారు. స్వాతంత్ర్యం సాధించిన మొదటి ఆరు దశాబ్దాలలో ఇది పూర్తిగా వాస్తవం అని మన అనుభవం రుజువు చేస్తున్నది. పాలకవర్గాలు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తిని వినియోగించుకొని, తాము బలపడటానికి మూడవ దృక్పథంతో ఉన్న వారికి ఇది మంచి అవకాశం కల్పించింది. దేశ లౌకిక, ప్రజాస్వామిక విధానాలను రక్షించుకుంటామని చెప్పటం, దానిని పునరుద్ధాటించటం ఈ రోజు లౌకిక, ప్రజాస్వామిక భారతదేశాన్ని కాపాడుకోవటం, బలపరచుకోవటంలో పరిమితమైన ప్రభావాన్నే కలిగిస్తున్నాయి.

**కొనసాగుతున్న పెట్టుబడిదారీ పూర్వ సామాజిక భావజాలం**

పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గాన్ని అనుసరిస్తున్న పాలకవర్గాలు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి, ఫ్యూడల్ భూస్వాములతో మరింతగా కుమ్మక్కు అవటం భారతదేశ భావన సాకారం కాకుండా నిరోధించటంలో అంతే ప్రాధాన్యత కల మరొక అంశం. కాబట్టి ఫ్యూడల్ అవశేషాలపై అభివృద్ధి చెందిన సాంప్రదాయక పెట్టుబడిదారీ విధానాన్ని నిర్మించిన విధానానికి మారుగా ఫ్యూడలిజంతో రాజీ పడటం ద్వారా భారతదేశంలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి అవుతున్నది. ఫ్యూడల్ అవశేషాలను అంతం చేయలేకపోవటంతో ఫ్యూడలిజం, పెట్టుబడిదారీ పూర్వ సమాజాలలోని సామాజిక భావజాలం ఉపరితలంలో కొనసాగటానికి దారితీస్తున్నది. పెట్టుబడిదారీ పూర్వ సమాజాలలోని ప్రజల సామాజిక భావజాలంలో ప్రధానంగా ఉన్న కుల, మత భావాలు ఈనాటి సామాజిక జీవితంలోనూ శక్తివంతంగానే ఉన్నాయి. ఫ్యూడల్ అవశేషాలపై పెట్టుబడిదారీ విధానాన్ని నిర్మించే ప్రయత్నం చేయటం వలన ఫ్యూడల్ సమాజంలోని వెనుకబడిన భావజాలం ప్రపంచీకరించిన పెట్టుబడిదారీ విధానంలోని క్షీణ వినియోగ సంస్కృతితో కలిసిపోతున్నది.

> **❝ భారతదేశంలో పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమంలో కులపరంగా చీలిపోయిన సమాజంలో వర్గాలు ఏర్పడటం జరుగుతున్నది. పెట్టుబడిదారీ పూర్వ సామాజిక సంబంధాలను ధ్వంసం చేయటం ద్వారా కాక, వాటితో రాజీ పడటం ద్వారా ఇది జరుగుతున్నది. ఫలితంగా దోపిడీకి గురవుతున్న వర్గాలు, అణచివేతకు గురవుతున్న కులాలు ఒకదానిపై ఒకటి పరుచుకుపోవటానికి దారితీసింది. ❞**

భారతదేశంలో పెట్టుబడిదారీ విధానం ఈ విధంగా అభివృద్ధి చెందుతుండటం వలన చారిత్రక వారసత్వంగా వచ్చిన, నిర్మాణరీత్యా కులపరంగా చీలిపోయిన సమాజంలో వర్గాలు ఏర్పడటం జరుగుతున్నది. పెట్టుబడిదారీ పూర్వ సామాజిక సంబంధాలను విధ్వంసం చేయటం ద్వారా కాక, వాటితో రాజీ పడటం ద్వారా ఇది జరుగుతున్నది. ఫలితంగా సమకాలీన భారతదేశంలో దోపిడీకి గురవుతున్న వర్గాలు, అణచివేతకు గురవుతున్న కులాలు ఒకదానిపై ఒకటి పరుచుకుపోవటానికి దారితీసింది. కాబట్టి ఆర్థికదోపిడి, కుల అణచివేతకు వ్యతిరేకంగా ఏకకాలంలో పోరాటాలు చేయటం ద్వారా మాత్రమే భారతదేశంలో వర్గ పోరాటాలు ముందుకుపోతాయి.

ఆ విధంగా ఉపరితలంలో ఫ్యూడల్ వ్యవస్థ క్షీణత, పెట్టుబడిదారీ విధాన దిగజారుడుతో కుల, మతభావాలు కలిసిసాగుతూ, మరింతగా పెరుగుతూ సమాజాన్ని నేరపూరితం చేస్తున్నాయి. "భారతదేశ భావన"ను వాస్తవం చేయటం కోసం అటువంటి భావాలను దూరం చేయటానికి మారుగా తమ రాజకీయ, ఎన్నికల ప్రయోజనాల కోసం హిందూత్వ శక్తులు వీటిని ముందుకు తీసుకువస్తున్నాయి. భారతదేశ రాజకీయాలలో ప్రస్తుతం జరుగుతున్న మితవాదం వైపు మరలటం మరింత సులభం కావటానికి, "భారతదేశ భావన"ను విచ్ఛిన్నం చేయటానికి, ఫాసిస్టు హిందురాష్ట్ర ఏర్పాటును ముందుకు తీసుకుపోవటానికి ఇటువంటి పరిస్థితులు దోహదం చేస్తాయి.

**భారతదేశ భావన: జాతీయవాదం**

జాతీయవాదం, జాతి–రాజ్యాలు ఉనికిలోకి రావటం మానవ నాగరికత ఫ్యూడలిజం నుండి పెట్టుబడిదారీ విధానానికి పరివర్తన చెందటంతో ముడిపడి ఉంది. చర్చి నుండి ప్రభుత్వాన్ని విడదీయాలని ఈ కాలంలోనే యూరప్‌లో పోరాటాలు జరిగాయి. ఫ్యూడలిజం ఉచ్ఛస్థాయిలో ఉన్నపుడు రాజులు, చక్రవర్తులు దైవదత్తమైన అధికారంతో పాలిస్తున్నారని చెప్పిన కట్టుకథలు ఫ్యూడలిజంపై పెట్టుబడిదారీ విధానం విజయం సాధించటంతో పేలిపోయాయి. చర్చి నుండి రాజకీయాధికారం వేరు పడింది. చివరకు 1648లో జరిగిన వెస్ట్‌ఫాలియా ఒప్పందాలు జాతి–రాజ్యాల సార్వభౌమత్వానికి, జాతిరాజ్యాల సార్వభౌమత్వం ప్రాతిపదికగా అంతర్జాతీయ చట్టాలు రూపొందించటానికి దారితీసింది. రాజ్యాల మధ్య సమానత్వ సూత్రం, ఒకదేశ అంతర్గత వ్యవహారాలలో మరొక దేశం జోక్యం చేసుకోకూడదనేది వెస్ట్‌ఫాలియా చర్చలలో ప్రధానమైన అంశం. 1644–48లో ప్రధానమైన యూరప్ దేశాల మధ్య వెస్ట్‌ఫాలియా శాంతి చర్చలు జరిగాయి.

రెండవ ప్రపంచయుద్ధంలో ఫాసిజం ఓడిపోవటం ఫలితంగా వలస విధానం నుండి విముక్తి కోసం ప్రజలు చేసిన పోరాటాలు తీవ్రవైనాయి. గత జాతీయవాదంలోని అంశాలకు భిన్నంగా, స్వతంత్రదేశాలలో రాజ్యం స్వభావాన్ని గురించిన నూతన అంశాలను ముందుకుతెచ్చాయి. వలసవాదానికి వ్యతిరేకంగా భారతదేశంతో పాటు ఆయా దేశాలలో జరిగిన సుదీర్ఘ పోరాటాల ఫలితంగానే అటువంటి భావనలు ముందుకొచ్చాయి.

**భారతదేశ భావన: భారత జాతీయత**

బ్రిటీష్ వలస పాలన నుండి భారతదేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన చారిత్రాత్మకమైన పోరాటం నుండి ''భారతదేశ భావన'' ఉద్భవించింది. ఈ భారతదేశ భావన అంటే ఏమిటి? సాధారణంగా చెప్పుకోవాలంటే అనేక విధాలుగా క్లిష్టమైన అంశాలను గురించి చైతన్యంతో ఉంటూనే, దేశంలో ఉన్న లెక్కలేనన్ని

> **“ ఆధునిక లౌకిక, ప్రజాస్వామ్య భారతదేశం స్థానంలో ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి లక్ష్యమైన హిందురాష్ట్రను ఏర్పాటు చేయటం మెజారిటీ హిందువులు మైనారిటీలను (ముఖ్యంగా అంతర్గంగా బాహ్య శతృవులైన ముస్లీలంను) లోబరచుకోవటం, భారత జాతీయవాదం స్థానంలో హిందు జాతీయవాదాన్ని రుద్దటం వెస్ట్‌ఫాలియన్ తరహా జాతీయవాదానికి తిరిగి వెళ్ళటం అవుతుంది. ఇది స్వాతంత్ర్య పోరాటానికి ముందుకాలం నాటి జాతి భావ జాలాన్ని భారతప్రజలలో తిరిగి ప్రవేశపెట్టటం అవుతుంది. ”**

వైవిధ్యతలను అధిగమిస్తూ, దేశప్రజల మధ్య సమ్మిశ్రిత ఐక్యతను నిర్మించే దిశగా సాగుతున్నదే భారతదేశ భావన. భారతదేశంలో రాజకీయాలు, రాజకీయ అర్థశాస్త్రానికి మధ్య ఉన్న సంబంధాన్ని వివరిస్తూ కొలంబియా యూనివర్సిటీలోని హేమెన్ సెంటర్ ఫర్ హ్యూమనిటీస్‌లో 2010లో జరిగిన సెమినార్‌లో చేసిన ఉపన్యాసాలను పుస్తకంగా ముద్రించినపుడు దానికి రాసిన ముందుమాటలో భారతదేశ భావనపై తన పరిశీలనలను అఖిల్ బిల్‌గ్రామి ఈ విధంగా వివరించాడు: ‘వెస్ట్‌ఫాలియన్ శాంతి ఒప్పందం తర్వాత యూరప్‌లో జరిగిన మొత్తం క్రమాన్ని ఈ జాతీయ భావన తిరస్కరిస్తున్నది. నిరంకుశ రాజులు పాలిస్తున్న పాత భావాలతో కూడిన దైవదత్తమైన అధికారం పేరుతో కాకుండా, ఒక నూతనమైన రాజ్యానికి చట్టబద్ధత కల్పించటం తప్పనిసరైంది. నూతనమైన రాజకీయ భావజాలంలో, నూతన తరగతి పౌరులు, నూతనంగా ఉద్భవించిన జాతి భావనపై అది ఆధారపడి ఉంది. ఒక బాహ్య శత్రువును అంతర్గత శతృవుగా చూపించటం ద్వారా యూరప్‌లో జాతి భావనను కలిగించారు. తమ మధ్యలో ఉన్నవారిని బయటి వారిగా, ఇతరులుగా (ఐరిష్, యూదు తదితరులు) చూపించి, వారిపై వ్యతిరేకతను కలిగించి, తమకు లోబడివుండేలా చేసుకున్నారు. ఈ విధంగా ఏర్పాటు చేసిన జాతులను తర్వాతి కాలంలో మైనారిటీ జాతులుగా పిలిచారు. ఈ విధంగా జాతులను ఏర్పాటు చేసిన విధానాన్ని మెజారిటీ వాదంగా పేర్కొన్నారు.(సోషల్ సైంటిస్ట్, జనవరి–ఫిబ్రవరి,2011).

ఆధునిక లౌకిక, ప్రజాస్వామ్య భారతదేశం స్థానంలో ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి లక్ష్యమైన హిందురాష్ట్రను ఏర్పాటు చేయటం మెజారిటీ హిందువులు మైనారిటీలను (ముఖ్యంగా అంతర్గంగా బాహ్య శతృవులైన ముస్లీలంను) లోబరచుకోవటం, భారత జాతీయవాదం స్థానంలో హిందు జాతీయవాదాన్ని రుద్దటం వెస్ట్‌ఫాలియన్ తరహా జాతీయవాదానికి తిరిగి వెళ్ళటం అవుతుంది. ఇది స్వాతంత్ర్య పోరాటానికి ముందుకాలం నాటి జాతి భావజాలాన్ని భారతప్రజలలో తిరిగి ప్రవేశపెట్టటం అవుతుంది. మెజారిటీ ప్రజల మతభావనలపై ఆధారపడిన అటువంటి రాజ్యం–విద్వేషంపై ఆధారపడిన ఫాసిస్టు హిందురాష్ట్ర–‘భారతదేశ భావన’తో రూపుదిద్దుకున్న భారత జాతీయత చైతన్యాన్ని తిరస్కరించి, దానిస్థానంలో ‘నూతన తరహా రాజకీయ భావజాలాన్ని’ ప్రవేశపెడుతుంది.

భారతదేశ భావన కేవలం ఊహాజనితమైనది మాత్రమేనని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతవేత్తలు కొట్టిపారేస్తూ, భారత జాతీయత అంటే హిందు జాతీయతేనని బల్లగుద్దుతుంటారు. బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య పోరాటం నుండి ఉద్భవించిన భారత జాతీయతా (భారతదేశ భావన) చైతన్యానికి వ్యతిరేకంగా హిందు జాతీయవాదాన్ని ముందుకు తీసుకు వచ్చే ప్రతీఘాతుక ప్రయత్నాలకు ఈ రోజు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు నాయకత్వం వహిస్తున్నాయి. అఖిల్ బిల్‌గ్రామి దీనిని నొక్కిచెప్పాడు: ‘ప్రత్యామ్నాయ, సమ్మిశ్రిత భావజాలంతో ఉత్తేజపరచకపోతే జాతీయోద్యమంలో కీలకమైన చివరి మూడు దశాబ్దాలలో భారీస్థాయిలో, స్థిరంగా ప్రజలను సమీకరించటం సాధ్యమయేది కాదు’.(సోషల్ సైంటిస్ట్, వాల్యూం 39, నవంబరు 1–2 2011).

భారతదేశ వైవిధ్యం–భాష, మతం, జాతి, సంస్కృతి తదితరాలు– ప్రపంచంలోని ఏ దేశంతో పోల్చినా చాలా విస్తారమైనవి. కనీసం 1,618 భాషలు, 6,400 కులాలు, భారతదేశంలోనే ఆవిర్భవించిన నాలుగు మతాలతో కలిసి 6 ప్రధాన మతాలు, శారీరక నిర్మాణం, సంస్కృతి రీత్యా భిన్నమైన 6 మానవ జాతులు దేశంలో ఉన్నాయని గతంలో అధికారికంగా నమోదు చేశారు. వీటన్నింటినీ ఒకదేశంగా కలిపి, రాజకీయంగా పరిపాలన సాగిస్తున్నారు. ఇంతటి వైవిధ్యం ఉండటం వలననే దేశంలో మత–సాంస్కృతిక పరమైన 29 ప్రధాన పండుగలు జరుపుకొంటున్నాం. బహుశా ప్రపంచంలోని ఏ దేశం కన్నా ఎక్కువ మత పరమైన సెలవు దినాలు మనదేశంలోనే ఉన్నాయి. పోరాటాలను తీవ్రం చేయటానికి వామపక్షాలు ప్రయత్నం చేస్తున్నాయి.

**భాషప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు:** రెండవది, స్వతంత్ర భారతదేశంలో భాష ప్రాతిపదికన రాష్ట్రాలను పునర్వవస్థీకరించాలని జరిగిన పోరాటాలకు కమ్యూనిస్టులు నాయకత్వం వహించారు. ఆ విధంగా తార్కికంగా, ప్రజాస్వామికంగా ఈనాటి భారతదేశ రాజకీయ పటాన్ని రూపొందించటంలో ఇతరులతో కలిసి వారు బాధ్యత నిర్వహించారు. తర్వాతికాలంలో కమ్యూనిస్టు అగ్ర నాయకులుగా అభివృద్ధి అయినవారు విశాలాంధ్ర, ఐక్య కేరళ, సంయుక్త మహారాష్ట్ర కోసం జరిగిన పోరాటాలకు నాయకత్వం వహించారు. ‘భారతదేశ భావన’ను వాస్తవం చేసేక్రమంలో భారతదేశంలో నివసిస్తున్న అనేక భాషలు మాట్లాడే ప్రజలను సమానత్వం ప్రాతిపదికగా కలుపుకెళ్ళటానికి ఇది మార్గం సుగమం చేసింది. ఆ విధంగా భాష ప్రాతిపదికగా రాష్ట్రాలను పునర్వ్యవస్థీకరించిన తర్వాత కూడా అనేక సమస్యలు, అటువంటి రాష్ట్రాల కోసం డిమాండ్లు, ముఖ్యంగా ఈశాన్యప్రాంతం నుండి రావటం దేశంలోని వివిధ జాతులు, భాషలు మాట్లాడే ప్రజల మధ్య సమానత్వం లేకపోవటాన్ని సూచిస్తున్నది. దేశంలో నివసిస్తున్న వివిధ జాతులు, భాషలు మాట్లాడే ప్రజలను సమానంగా చూడటం, ఈ ప్రాంతాల ఆర్థిక వెనుకబాటుతనాన్ని అధిగమించటానికి అవసరమైన నిర్దిష్ట ప్రణాళికలు రూపొందించటం, అవకాశాలను అందరూ సమానంగా వినియోగించుకొనే విధానాలను అనుసరించటం ద్వారానే వీటిని పరిష్కరించటం సాధ్యమౌతుంది. ఈ సమస్యలను నిజాయితీతో పరిష్కరించి, భారతదేశ ఐక్యత, సమగ్రతలను పరిరక్షించే శక్తి వామపక్షాలకు మాత్రమే ఉంది.

**లౌకికవాదం:** మూడవది, భారతదేశంలోని వాస్తవిక పరిస్థితులను గమనించిన కమ్యూనిస్టులు లౌకికవాదానికి దృఢంగా కట్టుబడి ఉన్నారు. ప్రజల మధ్య సమానత్వ భావాలను పెంపొందించి, దేశంలో విస్తారంగా ఉన్న వైవిధ్యాన్ని కాపాడుకోవటం ద్వారానే

❝ మతోన్మాదానికి వ్యతిరేకంగా విస్తారమైన ప్రజల ఐక్యతను నిర్మిస్తూ, మతపరమైన మైనారిటీల రక్షణ కోసం పోరాటాలు చేస్తున్న వామపక్షాలు మాత్రమే ఈనాడున్న పరిస్థితులలో లౌకికతత్వాన్ని దృఢంగా బలపరచే శక్తులుగా ఉన్నాయి. వారి రక్షణ, గుర్తింపు, సమానహక్కులు కలిగిన పౌరులుగా వారి హక్కుల రక్షణ కోసం కృషి చేస్తున్నాయి. ❞

భారతదేశ ఐక్యతను పరిరక్షించుకోగలమని, ఈనాడు మతోన్మాదశక్తులు చేస్తున్నట్లుగా ఈ వైవిధ్యంపై ఏకీకరణ వాదాన్ని రుద్దటం ద్వారా అది సాధ్యం కాదని వారు భావించారు. భారతదేశంలోని సామాజిక జీవితంలోని అన్ని రంగాలకు ఇది వర్తించినప్పటికీ మతానికి సంబంధించి ఇది అత్యధిక ప్రాధాన్యత కలిగివున్నది. భారతదేశ విభజన, అనంతరం జరిగిన భయానకమైన మత మారణహోమం తర్వాత 'భారతదేశ భావన'ను వాస్తవం చేయటంలో లౌకికవాదం విడదీయరాని భాగంగా ఉన్నది. లౌకికవాదం అంటే మతాన్ని, రాజకీయాలను వేరు చేయటమనే కమ్యూనిస్టుల లక్ష్యంలో భారత పాలకవర్గాలు సగం మాత్రమే పూర్తిచేశాయి. తమకు నచ్చిన మతాన్ని అనుసరించటానికి వ్యక్తులకున్న స్వేచ్ఛను పరిరక్షిస్తూనే ఏ ఒక్క మతాన్ని బోధించటానికి, అనుసరించటానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వకూడదు. కాని ఆచరణలో అన్ని మతాలను సమానంగా చూడటంగా భారత పాలకవర్గాలు దీనిని దిగజార్చాయి. మెజారిటీ ప్రజల మతం పట్ల పక్షపాతంతో వ్యవహరించటం దీనిలో అంతర్గతంగా ఉన్నది. మతోన్మాదులు, మతమౌఢ్యాన్ని పెంచే శక్తులకు ఈ విధానాలు బలాన్ని చేకూరుస్తున్నాయి.

మతోన్మాదానికి వ్యతిరేకంగా విస్తారమైన ప్రజల ఐక్యతను నిర్మిస్తూ, మతపరమైన మైనారిటీల రక్షణ కోసం పోరాటాలు చేస్తున్న వామపక్షాలు మాత్రమే ఈనాడున్న పరిస్థితులలో లౌకికతత్వాన్ని దృఢంగా బలపరచే శక్తులుగా ఉన్నాయి. వారి రక్షణ, గుర్తింపు, సమానహక్కులు కలిగిన పౌరులుగా వారి హక్కుల రక్షణ కోసం కృషి చేస్తున్నాయి.

గ్రామీణప్రాంతాలలో దోపిడీకి గురవుతున్న మెజారిటీ ప్రజానీకాన్ని సమీకరించటం, సామాజికంగా అణచివేతకు గురౌతున్న, ప్రత్యేకంగా కులం పేరుతో అణచివేత, అత్యాచారాలకు గురవుతున్న వారిని, వివిధ భాషలు మాట్లాడే ప్రజలను, వివిధ మతాలకు చెందిన భారత ప్రజలను, సమ్మిశ్రిత ఆర్థిక, సామాజిక న్యాయం కోసం భారతీయులందరినీ సమీకరించటం 'భారతదేశ భావన'లో ప్రధానమైనది. దీనిని ఇప్పటికీ సాధించలేకపోయాం. మిగిలిపోయిన కర్తవ్యాలను సాధించటం కోసం పోరాటం చేయటమే సిపిఐ(ఎం), ఇతర వామపక్షాల ప్రధానమైన లక్ష్యంగా ఉన్నది. కాబట్టి 'భారతదేశ భావన'ను వాస్తవం చేయటం కోసం జరిగే పోరాటాలలో వారు నాయకత్వ పాత్ర నిర్వహిస్తారు.

### ఆర్‌ఎస్‌ఎస్ దృక్పథం ఏమిటి?

ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పడటానికి రెండు సంవత్సరాల ముందు 1923లో ' హిందుత్వ ముఖ్యాంశాలు' పేరుతో వి డి సావర్కర్ ఒక సైద్ధాంతిక కరపత్రం ప్రచురించాడు. ఆ తర్వాత పునర్ముద్రించినపుడు 'హిందుత్వ: హిందువు అంటే ఎవరు?" అని పేరు మార్చారు. ఆ సైద్ధాంతిక కరపత్రం సారాంశం ఈ విధంగా ఉంది: 'వారి విశ్వాసాలు ఏవైనప్పటికీ భారతదేశాన్ని తమ మాతృభూమి, పితృభూమి, పుణ్యభూమిగా ఎవరైతే భావిస్తారో వారంతా హిందుత్వ పరిధిలోకి వస్తారు. భారతదేశంలోనే నివసిస్తూ తమ పుణ్యభూమి ఇతరచోట్ల ఉన్న ముస్లింలు (మక్కా, మదీనాలు), క్రైస్తవులు (ప్రస్తుతం ధ్వంసమైపోయిన పాలస్తీనాలోని జెరుసలెం, బెత్లెహాం) హిందుత్వ పరిధికి వెలుపల ఉంటారు'.

హిందుత్వ రాజకీయ కార్యక్రమమని, హిందుమతంతో దానికి పెద్దగా సంబంధం లేదని సావర్కర్ పేర్కొన్నాడు. హిందు రాజ్యాన్ని నెలకొల్పటం కోసం విషపూరితమైన విద్వేషం, హింస, భయానకతలను పెంపొందిస్తున్న ప్రస్తుత హిందుత్వ ప్రచారకులకు ఉత్తేజమిస్తున్న" సైన్యాన్ని హైందవీకరించండి, హిందువులను సైనికీకరించండి" అన్న నినాదాన్నిచ్చాడు. తాను చెబుతున్న 'హిందురాష్ట్ర' స్థాపనను సైద్ధాంతికంగా సమర్థించుకోవటానికి ఉద్దేశించినది ఆర్‌ఎస్‌ఎస్ చెబుతున్న జాతీయవాదం.(ఒక మతంగా అది హిందుమతానికి అత్యంత దూరంగా ఉంటుంది. దానిని హిందురాష్ట్రగా పిలుస్తారు). మొదటి సారిగా 1939లో ప్రచురించిన 'మనము, మన జాతీయత'లో మొదట ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘ్‌చాలక్ లేక అత్యున్నత నాయకుడు ఈ అంశాన్ని చెప్పాడు. ఆర్‌ఎస్‌ఎస్ భావాలు, సూత్రాలకు సంబంధించిన సైద్ధాంతిక దృక్పథం మాత్రమే కాక, ఫాసిస్టు హిందురాష్ట్రను సాధించటానికి అవసరమైన నిర్మాణాన్ని ఏర్పరచుకోవటానికి ఇది తోడ్పడింది.

'విదేశీయులు దాడిచేయటానికి ఎనిమిది, పది వేల సంవత్సరాలకు ముందు నుండి హిందువులు వివాదరహితంగా, నిరాటంకంగా ఈ భూమిపై ఆధిపత్యం కలిగివున్నారు. అందువలననే ఈ భూమిని హిందుస్థాన్, హిందువుల భూమి అని పిలుస్తున్నారు'.(ఎం ఎస్ గోల్వాల్కర్ 1939 పేజి 6). చారిత్రక వాస్తవాలను వారే మాత్రం లక్ష్యపెట్టరు. సింధునదికి ఇవతల ఉన్న భూమిని గురించి చెప్పటానికి అరబ్బులు హిందుస్థాన్ అనే పదం ఉపయోగించారు. ఈ భూముల్లో నివసించేవారిని హిందువులు అని పిలిచారు. (అరబిక్‌లో ఎస్‌కు బదులు హెచ్ పలుకుతుంది).

ఆ విధంగా హిందువులు ఎప్పటి నుండో ఒకజాతిగా ఉన్నారని చెబుతున్నారు. ఇతరులకు వ్యతిరేకంగా, హిందుజాతి కోసమంటూ అశాస్త్రీయమైన, అచారిత్రకమైన విశ్లేషణలతో మతోన్మాదపూరితమైన ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు: 'పురాతనమైన హిందుజాతి మాత్రమే హిందుస్థాన్‌లో ఉండాలి. ఇతరులు ఉండకూడదు. జాతి, మతం, సంస్కృతి, భాషపరంగా ఈ జాతికి చెందని వారంతా నిజమైన హిందు జాతికి బయట ఉండిపోతారు. అందువలన హిందుదేశాన్ని పునరుద్ధరించటానికి, పున: శక్తివంతం చేయటానికి, ప్రస్తుత స్థితి నుండి విముక్తి చేయటానికి చేసే ప్రయత్నాలే విలువైనవి. హిందుజాతిని, దేశాన్ని పొగడటానికి, తమ లక్ష్యాన్ని సాధించటానికి కార్యసాధనకు దిగిన వారు మాత్రమే దేశభక్తులు. మిగతా వారంతా శత్రువులు, దేశద్రోహులు, సున్నితంగా చెప్పుకోవాలంటే వెధవలు'.(గోల్వాల్కర్ 1939 పేజి 43-44)

స్వాతంత్ర్యపోరాటంలో ఆశించిన 'భారతదేశ భావన'కు ఇది పూర్తి విరుద్ధమైనది. 'భారతదేశం పురాతనమైన రాతప్రతి, దానిలో ఒక వరుస పైన మరో వరుస రాసి ఉంటుంది. కాని ప్రతి వరుస అంతకుముందు రాసిన వరుసలను తుడిపివేయటం లేదా పూర్తిగా కప్పివేయటం

> **"స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న కమ్యూనిస్టు యోధుల పాత్ర చరిత్రలో నమోదైవున్నది. సిపిఐ(ఎం) మొదటి పొలిట్‌బ్యూరో సభ్యులు తొమ్మిది మంది బ్రిటిష్ పాలనలో, తర్వాత కాంగ్రెస్ పాలనలోనూ అనేక సంవత్సరాలు జైళ్ళలో గడిపారు. దీనికి భిన్నంగా ఆర్ఎస్ఎస్‌కు చెందిన ఒక్కరి పేరు కూడా వాటిలో లేదు. జాతీయోద్యమంతో సంబంధం ఉందని చెప్పుకోవటానికి వి డి సావర్కర్ పేరు మాత్రమే వారికి ఉంది. ఇది కూడా కల్పితమైనదే."**

చేయలేదు' అని డిస్కవరి ఆఫ్ ఇండియాలో జవహర్‌లాల్ నెహ్రూ రాశాడు. రవీంద్రనాథ్ ఠాగూర్ ఈ విధంగా చెప్పాడు: 'ఆర్యులు, ఆర్యులు కానివారు, ద్రవిడులు, చైనీయులు, సిథియన్లు, హన్‌లు, పఠాన్‌లు, మంగోలులు అందరూ కలిసిపోయి, తమ అస్తిత్వాన్ని కోల్పోయి ఒకే శరీరంగా రూపొందారు. ఆ శరీరమే భారతదేశం'.

సమ్మిళిత జాతీయవాదం అయిన'భారతదేశ భావన'ను సాకారం చేయటం నుండి తిరోగమించటమే ఆర్ఎస్ఎస్ కార్యక్రమంలోని ప్రధానాంశం. ఫాసిస్టు హిందురాష్ట్రను ఏర్పాటు చేయటం కోసం హిందుత్వ జాతీయవాదాన్ని ముందుకుతెస్తున్నారు.

**జాతీయోద్యమం: ఆర్ఎస్ఎస్**

స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న కమ్యూనిస్టు యోధుల పాత్ర చరిత్రలో నమోదైవున్నది. సిపిఐ(ఎం) మొదటి పొలిట్‌బ్యూరో సభ్యులు తొమ్మిది మంది బ్రిటిష్ పాలనలో, తర్వాత కాంగ్రెస్ పాలనలోనూ అనేక సంవత్సరాలు జైళ్ళలో గడిపారు. బ్రిటిష్ వారు తనను నిర్బంధించిన వెల్లూరు జైలులో కా. ఎకె గోపాలన్ 1947, ఆగస్టు 15న జాతీయ పతాకాన్ని ఎగురవేశాడు. విద్యార్థిగా ఉండగా జాతీయ పతాకాన్ని ఎగురవేసినందుకు హరికిషన్ సింగ్ సూర్జిత్‌ను అరెస్టు చేశారు. అండమాన్ లోని సెల్యూలర్ జైలులో మార్బుల్స్‌పై లిఖించిన పేర్లలో అత్యధికం కమ్యూనిస్టులు, విప్లవకారుల గ్రూపులలో పనిచేసిన వారివే ఉన్నాయి.

దీనికి భిన్నంగా ఆర్ఎస్ఎస్‌కు చెందిన ఒక్కరి పేరు కూడా వాటిలో లేదు. వారు మతపరమైన ఉద్రిక్తతలు, ఘర్షణలు రెచ్చగొట్టే పథకాలను రచిస్తూ జాతీయోద్యమానికి దూరంగా ఉన్నారు. జాతీయోద్యమంతో సంబంధం ఉందని చెప్పుకోవటానికి విడి సావర్కర్ పేరు మాత్రమే వారికి ఉంది. ఇది కూడా కల్పితమైనదే. 1913, నవంబరు 14న సెల్యూలర్ జైలు నుండి తనను విడుదల చేయాని కోరుతూ సావర్కర్ బ్రిటిష్ ప్రభుత్వానికి లేఖ రాసినట్లు ప్రముఖ జాతీయోద్యమ చరిత్రకారుడు, ఆర్ఎస్ఎస్ పట్ల సానుభూతితో వ్యవహరించిన ఆర్ సి మజుందార్ పేర్కొన్నాడు. ఈ విధంగా లొంగిపోవటంతో విభజించి పాలించే బ్రిటిష్ ప్రభుత్వానికి మిత్రునిగా మారాడు. తన పిటీషన్‌లో బ్రిటిష్ వారికి ఈ విధంగా హామి ఇచ్చాడు: 'భారతదేశానికి, మానవజాతికి మేలు చేయాలనుకొనే వారు 1906-07లోని పరిస్థితులలోకి గుడ్డిగా వెళ్ళాలని భావించటం లేదు. దేశంలో అప్పటి పరిస్థితులు మమ్మల్ని దారితప్పించి శాంతి, అభివృద్ధి బాటను వీడేలా చేశాయి. కాబట్టి ప్రభుత్వం దయతో క్షమాభిక్ష ప్రసాదించి నన్ను విడుదల చేస్తే, రాజ్యాంగబద్ధంగా అభివృద్ధి సాధించటానికి, బ్రిటిష్ ప్రభుత్వానికి విధేయంగా ఉంటానని విన్నవిస్తున్నాను(ఆర్ సి మజుందార్, పినల్ సెటిల్‌మెంట్ ఇన్ అండమాన్స్, పేజి 211-213).

బ్రిటిష్ అధికారులకు రాసిన మరొక లేఖలో ఈ విధంగా పేర్కొన్నాడు: 'నాపై విచారణ సక్రమంగా జరిగిందని, నాకు విధించిన శిక్ష సరైనదేనని భావిస్తున్నాను. గతంలో నేను అనుసరించిన హింసాత్మక విధానాలను విడనాడతానని, చట్టానికి, రాజ్యాంగానికి కట్టుబడి ఉంటానని, ఇప్పటివరకు ఉన్న విధంగానే భవిష్యత్‌లో కూడా బ్రిటిష్ ప్రభుత్వానికి విధేయంగా ఉంటానని తెలియజేస్తున్నాను' (1995,ఏప్రిల్ 7 ఫ్రంట్‌లైన్ 94వ పేజిలో ఈ లేఖ ఫోటోస్టాట్ కాపిని ప్రచురించారు).

బ్రిటిష్ వారితో రాజీ చేసుకున్న తర్వాత బ్రిటిష్ వారి కన్నా కాంగ్రెస్, వామపక్షాలను వ్యతిరేకించటమే ఆయన జీవితం, రాజకీయాలలో ప్రధానంగా ఉన్నాయి. హిందు మహాసభ నాయకునిగా 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో హిందు మహాసభ లేక సంఘటనిస్టుల భాగస్వామ్యం లేకుండా చూశాడు. ఈ ఉద్యమానికి ఎటువంటి మద్దతు ఇవ్వవద్దని హిందువులకు బహిరంగ విజ్ఞప్తి చేశాడు (అంబాప్రసాద్, ది ఇండియన్ రివోల్ట్ ఆఫ్ 1942).

'ప్రభుత్వ సర్వీసులలో వివిధ స్థాయి అధికారులుగా లేదా బాధ్యతలలో ఉన్నవారు ఆ బాధ్యతలకు కట్టుబడి ఉండాలని, వారి విధులను సక్రమంగా నిర్వహించాలని హిందు సంఘటనిస్టులందరికీ స్పష్టమైన ఆదేశాలు జారి చేస్తున్నాను'(1995, డిసెంబరు 1 ఫ్రంట్‌లైన్‌లో ఎ జి నూరాని ఉదహరించాడు).

1942 క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా బొంబాయి హోం డిపార్ట్‌మెంట్ పరిశీలన ఈ విధంగా ఉంది. 'సంఘ్ చట్టపరిధికి లోబడే వ్యవహరిస్తున్నది. ప్రత్యేకంగా 1942లో బద్దలైన అల్లర్లలో పాల్గొనకుండా దూరంగా ఉంది' (అండర్సన్ అండ్ దామ్లే, శ్రీధర్ డి, ది బ్రదర్ హుడ్ ఇన్ శాఫ్రాన్: ది రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అండ్ హిందు రివైవలిజం, విస్తార్ పబ్లికేషన్స్, న్యూఢిల్లీ, 1987). ఒక సంఘంగా ఆర్ఎస్ఎస్ ఎందుకని విముక్తి పోరాటంలో భాగస్వామి కాలేదు అన్న ప్రశ్నను ఆర్ఎస్ఎస్ అగ్ర నాయకులలో ఒకడైన నానాజి దేశ్‌ముఖ్ లేవనెత్తాడు. జాతీయోద్యమం సాగినంత కాలం జాతీయోద్యమాన్ని దృఢంగా వ్యతిరేకించిన సంస్థానాధీశులతో ఆర్ఎస్ఎస్ కుమ్మక్కైంది. వారి సన్నిహిత మిత్రులలో ఒకడైన కాశ్మీర్ రాజు హరిసింగ్ కాశ్మీర్‌ను భారతదేశంలో భాగంగా చేయటాన్ని వ్యతిరేకించాడు.

ఈ వాస్తవాలను కప్పిపెట్టి ప్రజలను మోసం చేయటం కోసం కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో వామపక్షాల పాత్రను గురించి ఇప్పటికే విస్తారంగా రాసివున్న అంశాలలోకి మళ్ళీ పోనవసరం లేదు. భారతదేశం50 వ స్వాతంత్ర్య వార్షికోత్సవం జరుపుకొంటున్న సందర్భంగా అప్పటి రాష్ట్రపతి శంకర్‌దయాళ్‌శర్మ ఆగస్టు 9-10 తేదీల అర్ధరాత్రి జరిగిన పార్లమెంటు సమావేశాన్ని ఉద్దేశించి చేసిన ప్రసంగంలోని అంశాలను పేర్కొంటే సరిపోతుంది: 'కాన్పూర్, జెంషెడ్‌పూర్, అహమ్మదాబాద్‌లలోని మిల్లులలో భారీస్థాయిలో సమ్మెలు జరిగిన తర్వాత 1942, సెప్టెంబరు 5వ తేదీన ఢిల్లీ నుండి లండన్‌లోని స్టేట్ సెక్రెటరీకి పంపిన నివేదికలో భారత కమ్యూనిస్టు పార్టీని గురించి ఈ విధంగా రాశారు: ''ఎల్లప్పుడూ స్పష్టమౌతున్నట్లే ఆ పార్టీ సభ్యులలో అత్యధికుల ప్రవర్తన అది బ్రిటిష్ వ్యతిరేక విప్లవకారులతో నిండివున్నదని స్పష్టం చేస్తున్నది".

### విభజన నాటి భయానక పరిస్థితులు

ఇప్పటి నుండి ఆగస్టు 14వ తేదీన విభజన గాయాలను గుర్తు చేసుకొనే దినంగా పాటించాలని ఈ మధ్యనే ప్రధాని మోడి ప్రకటించాడు. దేశ విభజన సందర్భంలో ఉపఖండంలో ఎప్పుడూ లేని విధంగా వలస పోయారు. ఎంతమంది వలసపోయారన్నది ఖచ్చితంగా అంచనా వేయటం సాధ్యం కావప్పటికీ 1.5 కోట్లమంది ప్రజలు సరిహద్దులు దాటారని స్పష్టమౌతున్నది (భారతదేశం నుండి 72,95,870 మంది, పాకిస్తాన్ నుండి 72,26,600 మంది సరిహద్దు దాటారు). మతఘర్షణలలో 12 లక్షల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఆ గాయాలు ఈనాటికీ రేగుతూ బాధాకరమైన రోజులను గుర్తుకు తెస్తుంటాయి. ఆ ఘటనలలో హిందువులు, ముస్లీంలు, సిక్కులు అందరూ బాధలు అనుభవించారు. పాకిస్తాన్ ఆవిర్భావ దినాన్ని పుస్కరించుకొని మోడి మతోన్మాదాన్ని పెంచటం కోసం ఈ సందేశాన్నిచ్చాడు. ప్రస్తుత తరం ఆ భయానక పరిస్థితులను గుర్తు చేసుకోవాలని కాక, ఆ భయానక పరిస్థితులను తిరిగి సృష్టించాలనే కోరికతోనే ఆ సందేశం ఇచ్చాడు. కానట్లైతే బ్రిటిష్ వైస్రాయ్ లార్డ్ మౌంట్‌బాటన్ దేశ విభజనను ప్రకటించిన జూన్ 3వ తేదీని అందుకు ఎంచుకొని వుండేవాడు. మతపరమైన సమీకరణలను మరింత తీవ్రం చేసి, లౌకిక, ప్రజాస్వామిక భారతదేశాన్ని విద్వేషం, మతమౌఢ్యంతో కూడిన ఫాసిస్టు హిందూరాష్ట్రగా మార్చటం లక్ష్యంగానే ఈ ప్రకటన చేశాడు.

### రెండు జాతుల సిద్ధాంతం

'రెండుజాతుల సిద్ధాంతం' దేశ విభజనకు పునాది వేసింది. రెండు జాతుల సిద్ధాంతాన్ని మొదటగా విశదీకరించినది వి డి సావర్కర్. 1937లో అహ్మదాబాద్‌లోని కర్ణావతిలో జరిగిన హిందు మహాసభలో అధ్యక్షోపన్యాసం చేస్తూ, 'భారతదేశం ఈ రోజు ఒకేజాతితో కూడిన దేశంగా లేదు. హిందువులు, ముస్లీంలు రెండు ప్రధానమైన జాతులుగా ఉన్నారు'. (సమగ్ర సావర్కర్ వాడ్‌మె, వాల్యూం 6, మహారాష్ట్ర ప్రాంతిక్ హిందుసభ పబ్లికేషన్,1963-65, పేజి 296). రెండు సంవత్సరాల తర్వాత 1939లో జరిగిన హిందు మహాసభలో అధ్యక్షోపన్యాసం చేస్తూ సావర్కర్ ఈ విధంగా ప్రకటించాడు: 'మనం హిందువులం మనంగా ఒకజాతి. ఎప్పటి నుండో హిందువులం ఒకజాతిగా ఉంటున్నాం' (ఇండియన్ యాన్యువల్ రిజిష్టర్, 1939, వాల్యూం 2).

> **" 2011లో జరిగిన భారత చరిత్ర కాంగ్రెస్ లో ప్రముఖ చరిత్రకారిణి మృదులా ముఖర్జి ఈ విధంగా చెప్పారు: '1947 ఆగస్టు 15న రెండు జాతి రాజ్యాలు ఉనికిలో కొచ్చాయి. వాటిలో ఒకటైన పాకిస్తాన్ సావర్కర్ జాతికి ఇచ్చిన విశ్లేషణను బలపర్చింది. ఆయన భాగస్వామిగా ఉన్న భారత దేశం దీనిని దృఢంగా తిరస్కరించింది. మహాత్మగాంధి అందుకు ఆటం కంగా కనిపించాడు. ఆయన బతికివుండగా హిందురాష్ట్రగానీ, అఖండ భారత్‌గానీ సాకారం కాదని భావించి ఆయనను తొలగించాలనుకున్నారు."**

ఆ తర్వాత 1940, మార్చి 22న లాహోర్‌లో జరిగిన ఆల్ ఇండియా ముస్లీంలీగ్ మహాసభలో ప్రారంభోపన్యాసం చేస్తూ మహమ్మదాలి జిన్నా ఈ విధంగా చెప్పాడు. 'మైనారిటీగా ఉన్న ఒకజాతిని, మెజారిటీగా ఉన్న మరొకజాతిని కలిపి ఒకే దేశంలో ఉంచటం అసంతృప్తి పెరగటానికి, దేశంలో చేసిన నిర్మాణ కృషి కుప్పకూలటానికి దారితీస్తుంది'. ఆ తర్వాత జిన్నాను బలపరుస్తూ సావర్కర్ ఈ విధంగా చెప్పాడు 'జిన్నా రెండు జాతుల సిద్ధాంతంతో నాకేమీ విబేధం లేదు. హిందువులం మనం ఒకజాతిగా ఉన్నాం. హిందువులు, ముస్లీంలు రెండు వేర్వేరు జాతులనేది చారిత్రక వాస్తవం' (ఇండియన్ యాన్యువల్ రిజిష్టర్, 1943, వాల్యూం 2). సంఘ్ పరివార్, మోడికి తిరుగులేని నాయకుడైన సావర్కర్ జిన్నా కన్నా ముందే రెండు జాతుల సిద్ధాంతాన్ని ప్రవచించాడు. బ్రిటిష్ వారు దానిని బాగా వినియోగించుకొన్నారు. అది దేశ విభజనకు కారణమైంది.

### గాంధి హత్య

2011లో పశ్చిమబెంగాల్‌లోని మాల్దాలో జరిగిన భారత చరిత్ర కాంగ్రెస్ మహాసభలో అధ్యక్షోపన్యాసం చేస్తూ ప్రముఖ చరిత్రకారిణి మృదులా ముఖర్జి ఈ విధంగా చెప్పారు: '1947 ఆగస్టు 15న రెండు జాతి రాజ్యాలు ఉనికిలోకొచ్చాయి. వాటిలో ఒకటైన పాకిస్తాన్ సావర్కర్ జాతికి ఇచ్చిన విశ్లేషణను బలపర్చింది. ఆయన భాగస్వామిగా ఉన్న భారతదేశం దీనిని దృఢంగా తిరస్కరించింది. మహాత్మగాంధి అందుకు ప్రధానమైన ఆటంకంగా కనిపించాడు. ఆయన బతికివుండగా హిందురాష్ట్ర గాని, అఖండ భారత్ గాని సాకారం కాదని భావించి, ఆయనను తొలగించాలనుకున్నారు.

సావర్కర్ నాయకత్వంలో ఉన్న హిందు మహాసభ తీవ్రవాద విభాగం గాంధీజీ హత్య వెనుక ఉన్నదనే అంశంపై ఏకాభిప్రాయం ఉన్నది. 1948 జనవరిలో గాంధీజీ హత్య జరిగినపుడు ఈ కుట్ర వెనుక ఉన్న ప్రధాన సూత్రధారి సావర్కర్‌ను అరెస్టు చేశారు. గాంధి హత్యకేసు విచారణలో అప్రూవర్‌గా మారిన వారు ఇచ్చిన వాంగ్మూలాన్ని బలపరచే సాక్ష్యం లేకపోవటంతో-క్రిమినల్ చట్టంలో సాంకేతిక అంశం-ఆయన విడదలయ్యాడు. ప్రతిభ గల క్రిమినల్ లాయర్ అయిన సర్దార్ పటేల్ సావర్కర్ నేరస్తుడని వ్యక్తిగతంగా నిర్ధారించుకొన్నాడు. కాకపోయినట్లైతే ఆయనను విచారించటానికి అంగీకారం తెలిపేవాడు కాదు. ఆయన జవహర్‌లాల్ నెహ్రూతో ఈ విధంగా చెప్పాడు.' సావర్కర్ నేతృత్వంలోని హిందు మహాసభకు చెందిన ఉన్మాదపూరిత విభాగం ఈ కుట్రను రూపొందించి, అమలుచేసింది'.

1965లో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జీవన్‌లాల్ కపూర్ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. కమిషన్ రిపోర్టులో ఈ విధంగా పేర్కొంది. 'సావర్కర్, ఆయన గ్రూపు మినహా వేరేవారు ఈ హత్యకు కుట్ర చేశారన్న వాదనను విచారణలో వెల్లడైన వాస్తవాలు తిరస్కరిస్తున్నాయి'.

### ఆర్ఎస్ఎస్‌పై నిషేధం

ఈరోజు మోడి ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్‌లు తమ చట్రంలోకి తీసుకోవాలని ప్రయత్నం చేస్తున్న సర్దార్ పటేల్ గాంధి హత్య జరిగిన తర్వాత ఆర్ఎస్ఎస్‌ను నిషేధించాడు. ఆర్ఎస్ఎస్‌ను నిషేధిస్తూ సర్దార్ పటేల్ రూపొందించి, 1948, ఫిబ్రవరి 14న విడుదల చేసిన ప్రకటనలో ఈ విధంగా పేర్కొన్నాడు: 'అభ్యంతరకరమైన, అవాంఛనీయమైన సంఘ్ కార్యక్రమాలు నిరాటంకంగా సాగుతున్నాయి. సంఘ్ ప్రోత్సహిస్తున్న హింసాత్మక కార్యకలాపాలకు అనేకమంది బలైపోయారు. తాజాగా బలైన, అత్యంత విలువైన వ్యక్తి గాంధీజీ'.

మహాత్మాగాంధీ వ్యక్తిగత కార్యదర్శి ప్యారేలాల్ రాసిన 'మహాత్మాగాంధీ' పుస్తకంలో ఈ విధంగా

> “ రాజ్యాధికారాన్ని, భారత ప్రభుత్వంలోని ప్రధానమైన వ్యవస్థలను, రాజ్యాంగబద్ధ సంస్థలను అదుపుచేస్తున్న బిజెపి ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయ విభాగం మినహా వేరు కారు. దేశంలోని లౌకిక, ప్రజాస్వామ్య, రాజ్యాంగబద్ధ ప్రభుత్వాన్ని ధ్వంసం చేసి, ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమైన విద్వేషం, మతోన్మాదంతో కూడిన ఫాసిస్టు హిందురాష్ట్రను సాకారం చేయటానికి అది ఇపుడు ప్రయత్నిస్తున్నది. మోడి చెబుతున్న 75 సంవత్సరాల నూతన భారతం అర్థం ఇదే. ”

చెప్పాడు: ‘హత్య జరిగిన తర్వాత ఒక యువకుడి నుండి సర్దార్ పటేల్ ఒక లేఖ అందుకున్నాడు. మొదట తాను ఆర్‌ఎస్‌ఎస్‌లోకి ఆకర్షితుడనయ్యానని, తర్వాత తనకు భ్రమలు తొలగిపోయాయని ఆ లేఖలో రాశాడు. దురదృష్టకరమైన ఆ శుక్రవారం నాడు శుభవార్త వినటం కోసం తమ రేడియోలను పెట్టి ఉంచాలని కొన్ని ప్రాంతాలలో ఉన్న తమ కార్యకర్తలకు ఆర్‌ఎస్‌ఎస్ వారు ముందుగానే వర్తమానం పంపారు. హత్య వార్త వినగానే ఢిల్లీతో పాటు అనేక ప్రాంతాలలో మిఠాయిలు పంచారు’ (పేజి 756).

ఆర్‌ఎస్‌ఎస్‌పై విధించిన నిషేధం 1948, ఫిబ్రవరి 4వ తేదీ నుండి 1949, జులై 10వ తేదీ వరకు అమలులో ఉంది. తమపై ఉన్న నిషేధాన్ని త్వరగా రద్దుచేయించాలనే లక్ష్యంతో ఆర్ఎన్ఎస్ ప్రభుత్వంతో మోసపూరిత ఒప్పందం చేసుకుంది. తాము రాజకీయాలలో జోక్యం చేసుకోమని, సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితమై ఉంటామని సర్దార్ పటేల్‌తో ఒప్పందం చేసుకున్నారు. అందువలన తన రాజకీయ లక్ష్యాలను సాధించటానికి తన అదుపులో పనిచేసే రాజకీయ పార్టీ అవసరమైంది. హిందుకోడ్ బిల్లుకు సవరణలను వ్యతిరేకిస్తూ నెహ్రూ మంత్రివర్గం నుండి రాజీనామా చేసిన తర్వాత శ్యామప్రసాద్ ముఖర్జి రాజకీయ పార్టీ ఏర్పాటుకు ప్రయత్నం చేశాడు. భారతీయ జనసంఘ్‌ను ఏర్పాటు చేయటంలో శ్యామప్రసాద్ ముఖర్జికి సహాయపడటం కోసం 1952లో ఆర్‌ఎస్‌ఎస్ కొందరు కార్యకర్తలను పంపింది. దాని నేటి అవతారమే భారతీయ జనతా పార్టీ (బసు, తపన్ దత్తా, ప్రదీప్ సర్కార్, సుమిత్ సర్కార్, తనికా సెన్, సంభుద. ఖాకి షర్ట్స్: శాఫ్రాన్ ఫ్లాగ్స్, ట్రాక్ట్స్ ఫర్ ది టైమ్స్ 1 ఒరియంట్ లాంగ్‌మన్, న్యూఢిల్లీ,1993).

రాజ్యాధికారాన్ని, భారత ప్రభుత్వంలోని ప్రధానమైన వ్యవస్థలను, రాజ్యాంగబద్ధ సంస్థలను అదుపుచేస్తున్న బిజెపి ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయ విభాగం మినహా వేరు కారు. దేశంలోని లౌకిక, ప్రజాస్వామ్య, రాజ్యాంగబద్ధ ప్రభుత్వాన్ని ధ్వంసం చేసి, ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమైన విద్వేషం, మతోన్మాదంతో కూడిన ఫాసిస్టు హిందురాష్ట్రను సాకారం చేయటానికి అది ఇపుడు ప్రయత్నిస్తున్నది. మోడి చెబుతున్న 75 సంవత్సరాల నూతన భారతం అర్థం ఇదే.

### భారత రాజ్యాంగ విధ్వంసం

ప్రస్తుత భారత రాజ్యాంగాన్ని నాశనం చేయటం ఆర్‌ఎస్‌ఎస్ ప్రణాళికను విజయవంతం చేయటంలో కీలకమైనది. భారత రాజ్యాంగం నాలుగు మౌలికాంశాలపై ఆధారపడి ఉంది. అవి లౌకిక ప్రజాస్వామ్యం, సమాఖ్య విధానం, సామాజిక న్యాయం, ఆర్థిక సార్వభౌమత్వం. 2014 నుండి వీటిలో ప్రతి ఒక్కటీ తీవ్రమైన దాడులకు గురవుతున్నాయి. 2019 తర్వాత ఈ దాడులు మరింత పెరిగాయి.

2014 నుండి రూపుదిద్దుకున్న కార్పొరేట్, మతోన్మాద కూటమి భారత రాజ్యాంగాన్ని దిగజార్చే చర్యలు తీసుకుంటున్నది. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం వికృతరూపంలో ముందుకురావటంతో ఈ కూటమి అవధులు లేని నయా ఉదారవాద సంస్కరణలను అమలు చేస్తున్నది. జాతీయ సంపదను లూఠీ చేయటం, ఆర్థికదోపిడీ, సామాజిక అణచివేతను తీవ్రం చేస్తున్నది. ఫాసిస్టు హిందురాష్ట్ర ఏర్పాటును జయప్రదం చేయటంలో ప్రధానాంశమైన ఏకీకృత రాజ్య నిర్మాణానికి ప్రయత్నం చేస్తున్నారు.

### రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన స్వతంత్ర వ్యవస్థల ధ్వంసం

వ్యవస్థను సక్రమంగా పనిచేయించటం కోసం రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన పార్లమెంటు, న్యాయవ్యవస్థ, ఎన్నికల కమిషన్, సిబిఐ, ఇడి, ఇతర వ్యవస్థలు, సంస్థలను పథకం ప్రకారం దిగజారుస్తున్నారు. ప్రజల జీవితాలను, జీవనాధారాలను ధ్వంసం చేయటాన్ని గురించి ప్రస్తావించటంతో పాటు ఈ పరిణామాలను గురించి సిపిఐ(ఎం) నిరంతరం విశ్లేషణ చేస్తున్నది. లౌకికవాదం, రాజ్యాంగం గ్యారంటీ చేసిన ప్రజాస్వామిక హక్కులు, పౌరహక్కులపై దాడులు పెరుగుతున్నాయి. కోవిడ్ మహమ్మరిని అదుపుచేయటంలో విఫలం కావటం, వ్యాక్సిన్ కొరత, నాసిరకంగా ఉన్న ప్రజారోగ్య సదుపాయాలు ప్రజల ప్రాణాలను హరిస్తున్నాయి. ఈ పరిణామాలను ఏ మాత్రం పట్టించుకోని ప్రభుత్వం తన ఫాసిస్టు విధానాలను ముందుకు తీసుకుపోవటానికి ‘నూతన భారతం’ పేరుతో ప్రచారం చేస్తున్నది. ఈ లక్ష్యాన్ని సాధించటానికి అవసరమైన విధానాలను అనుసరిస్తున్నది. ప్రజల జీవితాలపై అదుపు సాధించటం దీనిలో ప్రధానమైనది.

### గూఢచర్యం నెరపుతున్న ప్రభుత్వం

భారత రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించటం, వ్యక్తిగత గోప్యతకు విరుద్ధంగా పౌరులపై ప్రభుత్వనిఘా గత ఏడు సంవత్సరాలలో తీవ్రమైంది. ఆధార్, సార్వత్రిక ఆరోగ్య గుర్తింపు కార్డుల ద్వారా వ్యక్తుల అంగీకారం లేకుండా బలవంతంగా వారి బయోమెట్రిక్ వివరాలు సేకరిస్తున్నారు. ప్రజలపై ప్రభుత్వ నిఘాను తీవ్రం చేయటం కోసం సేకరిస్తున్న ఈ సమాచారం ప్రజల గోప్యతా హక్కుపై దాడి చేయటమే.

వ్యక్తుల గోప్యతా వివరాలను సేకరించటం కోసం ఇజ్రాయిల్‌కు చెందిన, దురాగతాలకు పేరుపడ్డ పెగాసస్ మిలిటరి గూఢచార్య పరికరాలను వినియోగించటం మోడి ప్రభుత్వ ఫాసిస్టు ధోరణిని తెలియజేస్తున్నది. ఇది కేవలం వ్యక్తిగత గోప్యతను ఉల్లంఘించటం మాత్రమే కాక భారత ప్రజాస్వామ్యంపై కూడా దాడిచేయటమే. రాజకీయ నాయకులు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, న్యాయ విభాగానికి చెందిన ఉన్నతాధికారులు, ఎన్నికల కమిషన్ మాజీ అధికారి, సిబిఐ మాజీ డైరెక్టర్, ప్రజలకు ధైర్యంతో వాస్తవాలు వెల్లడిస్తున్న మీడియాకు చెందిన కొందరు వ్యక్తులు, మొత్తంగా మన ప్రజాస్వామ్యంలో స్వతంత్ర వ్యవస్థలకు చెందిన వ్యక్తుల మొబైల్ ఫోన్‌లపై నిఘా పెట్టారు. నిఘా పెట్టిన సమయం 2019 ఎన్నికలకు ముందు కావటం మరింత ప్రమాదకరమైనది.

### హేతు విరుద్ధతను ప్రోత్సహిస్తూ తార్కికతను ధ్వంసం చేస్తున్నారు

తిరోగమనంతో కూడిన ‘ హిందురాష్ట్ర’ లక్ష్యాన్ని జయప్రదం చేయటంలో ప్రజల

> **"రోజువారీ జీవితంలో పెరుగుతున్న దోపిడి, అణచివేతలకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటాల నుండి దృష్టి మళ్ళించటానికి, భావోద్వేగాలతో కూడిన అంశాలతో ఉండే కల్పిత ప్రపంచంలో జీవించే విధంగా ప్రజలపై మానసికంగా వత్తిడి తెస్తున్నారు. ఈరోజు ఆర్ఎస్ఎస్, బిజెపి పాలనలో ఇటువంటి హేతు విరుద్ధత భారతదేశ ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక జీవితంలోని అన్ని రంగాలలోకి విస్తరించింది. ఒక్కమాటలో చెప్పుకోవాలంటే ఇది తర్కానికి వ్యతిరేకమైనది."**

సామాజిక చైతన్యాన్ని ప్రభావితం చేయటం, తమ అదుపులోకి తెచ్చుకోవటం ఆర్ఎస్ఎస్, బిజెపిలకు కీలకమైనది. ఇందుకోసం హేతు విరుద్ధత, అశాస్త్రీయతను ప్రోత్సహించటం, చరిత్ర స్థానంలో హిందు పురాణాలను, తత్వశాస్త్రం స్థానంలో హిందుమత భావాలను పెంపొందించటం అవసరం. కాబట్టి ఉన్నత విద్యాసంస్థలలో వివిధస్థాయిలలో హిందుత్వ భావజాలంతో ఉన్న వారిని నియమించటం, తార్కికత, శాస్త్రీయ భావాలను పెంపొందిస్తున్న విశ్వవిద్యాలయాలపై దాడులు చేయటం, వాటిని తటస్థీకరించటం, విద్యార్థులు, యువకులకు బోధిస్తున్న పాఠ్యాంశాలను పథకం ప్రకారం తిరగరాయించటం చేస్తున్నారు.

ఈ పథకాన్ని జయప్రదం చేయటం కోసం తాత్వికరంగంలో హేతు విరుద్ధతను పునరుజ్జీవింపజేయటానికి ప్రయత్నిస్తున్నారు. తత్వశాస్త్రంలో హేతు విరుద్ధతను విమర్శించటం కోసం జార్జి లూకాక్స్ ప్రఖ్యాత రచన 'హేతువును ధ్వంసం చేయటం' ను ఈనాటి భారతదేశ పరిస్థితులలో గుర్తు చేసుకోవటం అవసరం. తత్వశాస్త్ర రంగంలో హిట్లర్‌కు జర్మనిలో మార్గం ఎలా సుగమం అయిందో లూకాక్స్ వివరించాడు. 19వ శతాబ్దంలో ప్రపంచానికి ఆధునిక, హేతుబద్ధమైన తత్వశాస్త్రాన్ని జర్మనీ అందించిన విషయాన్ని ప్రస్తావించాడు. హెగెల్ గతితర్కం, 'తలపై నిలబడిన హెగెల్‌ను తిరిగి కాళ్ళపై నిలబెట్టటానికి' కార్ల్‌మార్క్స్ చేసిన కృషి జర్మన్ ప్రజల తత్వశాస్త్ర వారసత్వం. అటువంటి వారు హేతువిరుద్ధమైన నాజీ తత్వశాస్త్రాన్ని ఎలా అంగీకరించారు? 'సామ్రాజ్యవాద ప్రపంచం హేతు విరుద్ధతను అంతర్జాతీయ దృక్పథంగా ప్రచారం చేస్తున్నదని' ఆయన బలంగా అభిప్రాయపడ్డాడు.

హేతు విరుద్ధత దాని పేరుకు తగినట్లే తర్క విరుద్ధమైనది. యూరప్‌లో మధ్యయుగాల తర్వాత శాస్త్రీయ విజ్ఞానాన్వేషణ (ఎన్‌లైటెన్‌మెంట్) ప్రారంభమైన నాటి నుండి నేటి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ వరకు మానవ కార్యకలాపాలలో తార్కికతను, వాస్తవాలను గురించిన జ్ఞానాన్ని అందించే హేతుబద్ధతను సవాలు చేయటమే దాని ప్రధాన లక్ష్యం. ఏ కాలంలోనైనా జ్ఞానం వాస్తవాలను పూర్తిగా వివరించలేదు. అయినప్పటికీ తర్క విరుద్ధత వాస్తవానికి, జ్ఞానానికి మధ్య గతితార్కిక సంబంధం లేకుండా చేస్తుంది. జార్జి లూకాక్స్ చెప్పినట్లు దాని గురించిన మన జ్ఞానం కన్నా భౌతిక వాస్తవం చాలా సంవద్వంతమైనది. గతితార్కిక పద్ధతి ద్వారా ఈ దూరాన్ని అధిగమించి, శాస్త్రీయ పద్ధతులలో వాస్తవాన్ని తెలుసుకోవటానికి మారుగా 'వాస్తవాన్ని గురించిన నిజమైన జ్ఞానాన్ని ఏ ఒక్కరూ తెలుసుకోలేరని' హేతు విరుద్ధత చెబుతుంది. 'విశ్వాసం', 'జ్ఞానానికి అతీతమైన 'భావాల' ద్వారా మాత్రమే' వాస్తవాలన్నింటినీ తెలుసుకోగలమంటుంది. నయా–ఉదారవాద విధానాలను మరింత ముందుకు తీసుకుపోవటం, దేశాన్ని మతోన్మాదంతో కూడిన ఫాసిస్టు హిందురాష్ట్రంగా మార్చటం అనే తన రెండు లక్ష్యాలను సాధించటం కోసం ప్రజలను మూఢ విశ్వాసాలలో ఉంచడానికి హిందుత్వ జాతీయవాదం ప్రయత్నం చేస్తున్నది.

హిందుత్వ జాతీయవాద 'భ్రమాత్మక చైతన్యం' బలపడి పట్టుసాధించటం కోసం ప్రజల అభిప్రాయాలను రూపుదిద్దటంలో భౌతిక వాస్తవాలను తక్కువ చేస్తూ, భావోద్వేగాలను రెచ్చగొట్టే, వ్యక్తిగత నమ్మకాలను పెంచే విధానాలను ఆర్ఎస్ఎస్, బిజెపి, మోడీలు అనుసరిస్తున్నారు. మీడియా, సోషల్ మీడియాలపై అదుపు సాధించి వ్యక్తిపూజ, భావోద్వేగాలను రెచ్చగొడుతున్నారు. ఇప్పటి వరకు చూడని విధంగా భారతదేశం అభివృద్ధి చెందుతున్నదని, ప్రపంచంలోని ఏ దేశం సాధించని అభివృద్ధి సాధించటానికి ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులు ఆటంకంగా ఉన్నారని ప్రచారం చేస్తున్నారు.

రోజువారీ జీవితంలో పెరుగుతున్న దోపిడి, అణచివేతలకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటాల నుండి దృష్టి మళ్ళించటానికి, భావోద్వేగాలతో కూడిన అంశాలతో ఉండే కల్పిత ప్రపంచంలో జీవించే విధంగా ప్రజలపై మానసికంగా వత్తిడి తెస్తున్నారు. ఈరోజు ఆర్ఎస్ఎస్, బిజెపి పాలనలో ఇటువంటి హేతు విరుద్ధత భారతదేశ ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక జీవితంలోని అన్ని రంగాలలోకి విస్తరించింది. ఒక్కమాటలో చెప్పుకోవాలంటే ఇది తర్కానికి వ్యతిరేకమైనది.

### ముగింపు

'భారతదేశ భావన'ను, భారత రాజ్యాంగాన్ని, స్వాతంత్ర్యానంతర రిపబ్లిక్‌ను ధ్వంసం చేస్తున్న విధానం ఇది. లౌకిక, ప్రజాస్వామిక భారత దేశాన్ని నాశనం చేయటం కోసం ఎంత తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారో దానిని రక్షించుకోవటం కోసం కూడా అంతే తీవ్రస్థాయిలో పోరాటాలు జరగాలి. ఫాసిస్టు హిందుత్వ వేగంగా అధిపత్యం సాధించే ప్రయత్నాలకు వ్యతిరేకంగా అన్ని రంగాలలోనూ–రాజకీయ, సైద్ధాంతిక, సామాజిక, సాంస్కృతిక– ఆధిపత్యం సాధించాలి.

పాలకవర్గాల భావజాలం ఆ కాలంలో అధికార భావజాలంగా ఎలా ఉంటుందో జర్మన్ సిద్ధాంతంలో మార్క్స్, ఎంగెల్స్‌లు వివరించారు. పాలకవర్గాల భావజాలాన్ని కేవలం రాజ్యం, దాని యొక్క వివిధ వ్యవస్థల ద్వారా మాత్రమే అమలుచేయరని గ్రామ్‌సి విశ్లేషణ చేసి, విశదీకరించాడు. రాజ్యం కేవలం బయటికి కనబడే నిర్మాణంగా మాత్రమే ఉంటుంది. దాని వెనుక భౌతిక రక్షణలు, విశాలంగా అల్లుకుపోయిన సాంస్కృతిక సంస్థలు, పాలకవర్గాలను, వారి అభిప్రాయాలను బలపరిచే విలువలు ఉంటాయి. సమాజంలో సాలెగూడులాగా అల్లుకుపోయిన సంబంధాలు, సామాజిక నిర్మాణాల ద్వారా ఈ సామాజిక ఆధిపత్యం కొనసాగుతుంది. కుటుంబం, కులం, మతం, ప్రార్థనా స్థలాలు, పండుగలు, థియేటర్లు, సినిమాలు, టెలివిజన్, సోషల్‌మీడియా తదితర సాంస్కృతిక కార్యక్రమాలు హిందుత్వ ఆధిపత్య 'భావాల'ను నిరంతరం పెంచి పోషించే కేంద్రాలుగా ఉన్నాయి. ఈ క్రమంలో 'ఉమ్మడి సంస్కృతి' అనే కట్టుకథను వారు సృష్టిస్తున్నారు. ఈ 'ఉమ్మడి సంస్కృతి' అంటే హిందుత్వకు చెందిన ఎంపికచేసిన భావాలు, విలువలను 'ఉమ్మడి చైతన్యం' గా ముద్ర వేయటం మినహా వేరుకాదు.

**(మిగతా 25వ పేజీలో)**

నిర్మాణం

# ఆగ్జిలరీ గ్రూపుల ఏర్పాటు, నిర్వహణ: తెలంగాణా రాష్ట్ర అనుభవాలు



రచయిత సిపిఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి

**పోతినేని సుదర్శనరావు**

ఒక విప్లవ పార్టీ తగ్గటానికి గానీ, పెరగటానికి గానీ ప్రధానంగా రెండు అంశాలు పని చేస్తాయి. 1) ఆ పార్టీ రూపొందించుకొన్న రాజకీయ విధానం. 2) ఆ విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్ళే నిర్మాణ యంత్రాంగం. ఒకసారి సరైన రాజకీయ విధానం నిర్ణయించబడ్డాక, ఇక దాని జయాపజయాలన్నీ నిర్మాణంపైనే ఆధారపడతాయి. నిర్మాణానికి అంతటి ప్రాధాన్యత ఉంటుంది. మన వాళ్ళందరూ దీనిని అంగీకరిస్తారు. కానీ ఆచరణలో నిర్మాణానికి ఇవ్వవలసిన ప్రాధాన్యత ఇవ్వరు. ఆ కర్తవ్యాన్ని యాధృచ్ఛికతకు (స్పాంటేనిటీకి) వదలేస్తారు. పార్టీ రూపొందించిన సరియైన సిద్ధాంత, రాజకీయ, ప్రజా విధానాలు వాటంతటవే క్రమంగా పార్టీ నిర్మాణాన్ని బాగుపరుస్తాయనే భ్రమలలో ఉంటారు. ఈ దృక్పథాన్నే స్టాలిన్ తీవ్రంగా విమర్శించారు.

“సరియైన విధానం రూపొందించి, దానిని ఇల్లెక్కి ప్రచారం చేస్తే, దానిని సాధారణ సిద్ధాంతం లేదా తీర్మానాల రూపంలో విశదీకరిస్తే, వాటిపై ఓటింగ్ తీసుకొని ఏకగ్రీవంగా ఆమోదిస్తే, విజయం దానంతటదే యాధృచ్ఛికంగా వస్తుందని కొంతమంది ఆలోచిస్తుంటారు. ఇది తప్పు, ఒట్టి భ్రమ. మారని నిరంకుశ అధికార దర్పం గలవారు, ఆలస్యానికి అలవాటు పడిన వారు మాత్రమే అలా ఆలోచిస్తారు. విజయం దానంతట అది ఎప్పుడూ రాదు. దానిని సాధించాలి. ఒక సాధారణ పంథాను గురించిన మంచి తీర్మానాలు, ప్రకటనలు తయారవుతాయి. అది విజయం సాధించాలనే కోరిక మాత్రమే. అదే విజయం కాదు. సరియైన విధానం రూపొందించిన తర్వాత, ఆ పనిని ఎలా నిర్వహిస్తున్నామనే దానిపైనే దాని విజయం ఆధారపడి ఉంటుంది. పార్టీ విధానం అమలు చేయడానికి జరిగే పోరాటం పైనా, అందుకు తగిన వ్యక్తులను ఎన్నుకోవడం పైనా, కమిటీల నిర్ణయాలను జయప్రదంగా అమలు చేసేందుకు పార్టీ నాయకత్వం చేసే అజమాయిషీ పద్ధతులపైన, ఆ విజయం ఆధారపడి ఉంటుంది. లేకుంటే సక్రమ పార్టీ విధానం, సక్రమ పరిష్కారం కూడా తీవ్రంగా భంగపడే ప్రమాదంలో పడతాయి” అంటారు స్టాలిన్.

ఇక్కడే మార్క్స్ చెప్పిన మరొక ముఖ్యమైన విషయాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాలి. ఏదైనా సిద్ధాంతం ప్రజలను ఆవరిస్తే అది భౌతికశక్తిగా మారుతుంది అంటారాయన. సిద్ధాంతం ప్రజలను ఆవరించాలి అంటే ఆ సిద్ధాంతం ముందు ప్రజలలోకి వెళ్ళాలి కదా! వెళ్ళాలంటే ఆ సిద్ధాంతాన్ని తీసుకువెళ్ళే వాళ్ళు కీలకం. అంటే...సిద్ధాంతం ప్రజలను ఆవరించాలని మార్క్స్ చెబితే, ఆ సిద్ధాంతం అమలు చేయడానికి జరిగే పోరాటంపైనా, దానికి తగిన వ్యక్తులను ఎన్నుకోవటం పైనా, అది ప్రజలలోకి వెళ్ళటం పైనా దాని విజయం ఆధారపడి ఉందని స్టాలిన్ చెప్పాడు.

ఈ సందర్భంలోనే మనం రాజకీయ విధానం అమలు చేసే నిర్మాణ యంత్రాంగం ప్రాధాన్యత గురించి లెనిన్ చెప్పిన విషయాలను మననం చేసుకోవాలి. “అధికారం కోసం సాగించే పోరాటంలో కార్మికవర్గానికి నిర్మాణానికి మించిన ఆయుధం మరొకటి లేదు. బూర్జువా ప్రపంచపు అరాచక పోటీపాలన ఫలితంగా అనైక్యతకు గురై, అతి హీనమైన జీవితపు అగాధాలలోకి నెట్టబడి, క్రూరము, నైచ్యమూ అయిన జీవితాన్ని అనుభవిస్తున్న కార్మికవర్గం పెట్టుబడిదారులకు ఊడిగం చేసే శక్తిగా తయారౌతుంది. ఇది అనివార్యం. మార్క్సిజం సూత్రాలపై ఆధారపడిన సైద్ధాంతిక ఐక్యత, లక్షలాది కష్టజీవులను కార్మికవర్గ సైన్యంగా సంఘటితం చేయగల నిర్మాణమనే భౌతిక ఐక్యతతో సంఘటితపడినప్పుడే కార్మికవర్గం అజేయమైన శక్తిగా నిరంతరం ప్రతిఘటించగలుగుతుంది.

ఇంత ప్రాధాన్యత కలిగినది కాబట్టే, మనపార్టీ ప్రతి మహాసభలో నిర్మాణం గురించి చర్చించటమేగాక, ప్రత్యేకంగా దీనికోసమే సాల్కియా, కలకత్తా ప్లీనాలు కూడా జరిపింది. ప్రత్యేక కేంద్రకమిటి సమావేశాలు జరిపింది. దానిలో నిర్మాణం గురించి పేర్కొన్న ప్రధానాంశాలు కొన్ని మనం చూద్దాం.

మనదేశం చాలా పెద్దది, మనపార్టీ చాలా చిన్నది. అందువల్ల వాస్తవంగా విస్తారమైన ప్రజాబాహుళ్యపు పునాది కలిగిన దేశవ్యాపిత విప్లవ పార్టీగా విస్తరించవల్సిన అవసరమూ, తక్షణావశ్యకతా ఉన్నదని మనం గుర్తించాలి. ఇదీ 1978లో సాల్కియా ప్లీనం నిర్దేశించిన ముఖ్యమైన నిర్మాణ కర్తవ్యం. జలంధర్‌లో జరిగిన పార్టీ 10వ మహాసభ, దేశంలో ప్రస్తుతం మనకు అనుకూల వాతావరణం ఉంది, అయినప్పటికీ, వామపక్ష ప్రజాతంత్ర శక్తులను సమీకరించి, వాటిని సామ్రాజ్యవాదానికి, ఫ్యూడలిజానికి, గుత్త పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో, శక్తివంతంగా నిలబెట్టడానికి పార్టీ చేసే నిర్మాణ కృషిలో తీవ్రమయిన

బలహీనతలున్నాయి. పార్టీ సభ్యత్వం పెరగకుండా స్థంభించి పోయింది. దీనిని అధిగమించవల్సిన ఆవశ్యకత ఉన్నదని తీర్మానించింది.

2002లో హైదరాబాద్‌లో జరిగిన 17వ మహాసభ, అలాగే కలకత్తా నిర్మాణ ప్లీనం, ఆగ్జిలరీ యూనిట్ల గురించి ఈ విధంగా పేర్కొన్నది. **"శాఖ/కమిటీల ఆధ్వర్యంలో ఆగ్జిలరీ బృందాలు ఏర్పాటు చేసి కొత్తగా చేరిన సభ్యులకు అవసరమైన రాజకీయ నిర్మాణ విద్యను అందించాలి. వారి కార్యక్రమాలను పర్యవేక్షించాలి. క్యాండిడేట్ సభ్యులను ఆగ్జిలరీ బృందం నుండే తీసుకోవాలి. ఆగ్జిలరీ శాఖల లోటుపాట్లు కొనసాగుతున్నాయంటే, అందుకు కారణం శాఖలతోపాటు పై కమిటీలలో కూడా లోపాలు ఉండటమే."**

ఈ నేపథ్యంలోనే కలకత్తా నిర్మాణ ప్లీనం కర్తవ్యాలను అమలు చేయడానికి తెలంగాణా పార్టీ పూనుకొన్నది. అందులో భాగంగా సభ్యత్వానికి సంబంధించి 5 కనీస కర్తవ్యాలు నిర్వర్తించని పార్టీ సభ్యుల సభ్యత్వం పునరుద్దరించకూడదని నిర్ణయించింది. దీని ఫలితంగా ఈ కాలంలో పటిష్టత లేని దాదాపు 10,000 (లూజ్) సభ్యత్వం తగ్గింది. తగ్గుతున్న సభ్యత్వంపై వివిధ సందర్భాలలో చర్చలు జరిగినా 2020లో ఈ అంశంపై తెలంగాణా రాష్ట్ర కమిటీలో సీరియస్‌గా చర్చ జరిగింది. గతం నుండీ ఆగ్జిలరీ రిక్రూట్‌మెంట్ జరుగుతున్న పద్ధతి ప్రకారం, ఆయా రంగాల ఫ్రాక్షన్‌ల ద్వారా ఆ గ్రూపుల ఏర్పాటుకు ఉన్న అవకాశాలు, శాఖల ద్వారా ఆగ్జిలరీ గ్రూపుల్లోకి సభ్యులుగా తీసుకొనే అవకాశాలు అన్నిటిపై చర్చలు జరిగాయి. పైన పేర్కొన్న తీర్మానాలు నిర్ణయాలపై కూడా చర్చ జరిగింది. చివరగా మొత్తం పార్టీ యంత్రాంగం అంతా అన్ని అవకాశాలను ఉపయోగించుకొని, మన ప్రమాణాల ప్రకారం ఉండి తీసుకోదగిన, నూతన సభ్యులను గుర్తించాలని నిర్ణయించాము. ఈ పరిశీలన రాష్ట్రం మొత్తం ఏకకాలంలో జరపాలనుకొన్నాము.

నవంబర్ నెలలో జరిగిన సార్వత్రిక సమ్మె, రైతు చట్టాలకు వ్యతిరేకంగా జరిగే ఆందోళనలు, గ్రామీణ బంద్ తదనంతరం డిసెంబర్ నుండి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగింది. ఇందులో మొదటి అంశంగా అమలు చెయ్యాలనుకొన్నది శాఖల సమావేశాలు, ఫ్రాక్షన్‌ల సమావేశాలు. పార్టీ రాష్ట్ర కార్యదర్శితో సహా, రాష్ట్ర, జిల్లా పార్టీ నాయకత్వాలు,

**"పార్టీ అంటే అపారమైన ప్రేమాభిమానాలు ఉన్నాయి. గ్రామ శాఖలు అవసరం కొరకు వీరిని ఉపయోగిస్తున్నాయి. కానీ నిర్మాణంలోకి తీసుకు రావటంపై శ్రద్ధ చూపడం లేదు. రాష్ట్ర కమిటీ చేసిన ఈ ప్రత్యేక ప్రయత్నం వల్ల, వీళ్ళందరూ గుర్తించబడి ఆగ్జిలరీ నిర్మాణంలోకి తీసుకు రాబడ్డారు."**

ప్రజారంగాల నాయకత్వాలు మొత్తం గ్రామాలబాట పట్టారు. నెలంతా గ్రామాలలోనే, ఈ కార్యక్రమం పైనే ఉండటం జరిగింది. దీనివలన ఆ నెలలో దాదాపు 100% శాఖలు పై కమిటి భాద్యుల సమక్షంలో జరిగాయి. ఒక్కొక్కరు 10నుండి 25 శాఖల వరకు హాజరయ్యారు. అక్కడ శాఖలలో చర్చించినపుడు నూతన సభ్యుల రిక్రూట్ మెంట్ కొరకు ప్రయత్నం చేస్తే అపారమైన అవకాశాలు ఉన్నట్లు వెల్లడైంది. **గ్రామాలు/వార్డులలో యువత, మహిళలలో పార్టీకి అవసరమైన అన్ని సందర్భాలలో చురుకుగా పాల్గొంటున్నవారు వేలాదిగా ఉన్నట్లు తేలింది. ప్రజా సంఘాల కార్యక్రమాలు, సభ్యత్వం చేర్పింపు, పార్టీ కార్యక్రమాలు, ఎన్నికలు, భూపోరాటాలు, పోడు పోరాటాలు, మహాసభలు, గ్రామాలలో శత్రుపార్టీలతో ఘర్షణలు, ఫండ్ క్యాంపెయిన్, గ్రామ సమస్యలు, గ్రామంలో జరిగే పంచాయతీలు, సోషల్ మీడియాలో పార్టీ కార్యకలాపాలు ప్రచారం, మన సంఘాల ద్వారా క్రీడల నిర్వహణ, పండుగలలో పార్టీగా గ్రామాలలో జోక్యం చేసుకోవటం ఇత్యాది కార్యకలాపాలో వీరు పాల్గొంటున్నారు.** పార్టీ అంటే అపారమైన ప్రేమాభిమానాలు ఉన్నాయి. గ్రామ శాఖలు అవసరం కొరకు వీరిని ఉపయోగిస్తున్నాయి. కానీ నిర్మాణంలోకి తీసుకు రావటంపై శ్రద్ధ చూపడం లేదు. రాష్ట్ర కమిటీ చేసిన ఈ ప్రత్యేక ప్రయత్నం వల్ల, వీళ్ళందరూ గుర్తించబడి ఆగ్జిలరీ నిర్మాణంలోకి తీసుకు రాబడ్డారు.

**2021 జనవరి నాటికి రాష్ట్రంలో అలా గుర్తించి ఏర్పాటు చేసిన ఆగ్జిలరీ గ్రూపులు 2816. ఆ గ్రూపులలోని సభ్యుల సంఖ్య 25,189.** అయితే ఈ గ్రూపుల ఏర్పాటు సందర్భంలోనే ఒక కీలకమైన విషయాన్ని కూడా గుర్తించడం జరిగింది. అదేమిటంటే ఈ గ్రూపుల నిర్వహణ ఆయా శాఖలకే వదిలివేస్తే అవి ముందుకు సాగవు. అసలు ఆ శాఖల ఫంక్షనింగే సక్రమంగా లేదు. అందుకే ఆ గ్రూపుల నిర్వహణా భాద్యత కూడా రాష్ట్ర కమిటీతో సహా పై కమిటీలే తీసుకోవాలి. ఆ సభ్యులను కార్యకలాపాలలో భాగస్వాములను చేసి తర్ఫీదు చేసుకోవాలి. ప్రతినెలా ఆయా గ్రూపుల సమావేశాలకు పై కమిటీలే భాద్యత వహించి నిర్వహించాలి. ఆ సమావేశాలలో ప్రతి సభ్యుని పనితీరును పరిశీలించాలి. అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలి. ఎదుగుదలకు అవసరమైన సహాయం చేయాలి. ఇలా చేయడం ద్వారా వారిని అభివృద్ధి చేయడానికి పై కమిటీలే భాద్యత తీసుకోవాలి అని నిర్ణయించడం జరిగింది. ఇది రోజువారీ జరిగే కార్యకలాపాలలాంటిది కాదు. కాబట్టి ప్రత్యేక శ్రద్ధతో చూడాలని అనుకోవటం జరిగింది. దీనికొరకు 3 దొంతరలతో యంత్రాంగం పని చేయాలని, కాలానుగుణంగా ఫలితాలను పరిశీలించుకొని ముందుకు సాగాలని నిర్ణయం తీసుకొన్నాము.

అలా ఈ గ్రూపులను నిరంతరాయంగా నడిపించడానికి 696 మంది పూర్తికాలం కార్యకర్తలు భాద్యత తీసుకొన్నారు. పనిని పర్యవేక్షించడానికి 37మంది రాష్ట్ర భాద్యులను నిర్ణయించడం జరిగింది. సహజంగా ఆగ్జిలరీ సభ్యులను 6మాసాలు పరిశీలించి ప్రమోట్ చేసే అవకాశం ఉన్నది. ఈ ప్రత్యేక కేంద్రీకరణ పద్ధతిలో 9మాసాలు పరిశీలించాలని అనుకొన్నాము. 2021 జనవరిలో మొదలైన ఈ ఆగ్జిలరీ గ్రూపుల కృషి అక్టోబర్‌కు 10మాసాలు అవుతుంది. జనవరి మాసంలో ఈ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవటం, నిర్దిష్టంగా వ్యక్తుల వారీగా భాద్యతలు నిర్ణయించుకొన్నాము. అందువల్ల అక్టోబర్ 2021ని దీనికి చివరి మాసంగా తీసుకొన్నాము. అందుకే ఈ అక్టోబర్-నవంబర్ నెలల్లో వీరికొరకు ప్రత్యేకంగా రాజకీయ శిక్షణా తరగతులు

> **“ ప్రతినెలా జరిపే ఆగ్జిలరీ గ్రూపు సమావేశానికి, ఆ గ్రూపునకు భాద్యునిగా కేటాయించిన ఎజివొ అంటే ఆగ్జలరీ గ్రూపు ఆర్గనైజర్ హాజరు కావాలి. ఆ కామ్రేడ్ సభ్యులను ఇలా కేటగిరి చేస్తారు. పనిని స్థూలంగా 3 అంశాలుగా రూపొందించడం జరిగింది. 1) సమావేశానికి హాజరు కావటం 2) రాజకీయ అధ్యయనం, రాజకీయ చర్చా కార్యక్రమాల్లో ఉండటం 3) ఆ నెలలో ప్రజా సమస్యలపై జరిగిన కార్యక్రమాలలో గానీ, సేవా కార్యక్రమాలలో గానీ పాల్గొనడం. ”**

నిర్వహిస్తున్నాము. అర్హత ఉండి హాజరయిన వారిని అక్కడే క్యాండిడేట్ సభ్యులుగా ప్రమాణం చేయించి ప్రమోట్ చేయడం జరుగుతుంది. క్లాసులకు హాజరయిన వారిని మాత్రమే సియం లుగా తీసుకోవాలనేది నిర్ణయం.

**క్యాండిడేట్ సభ్యులుగా ఎవరు ప్రమోట్ అవుతారు?**

9 మాసాల సరాసరి చూస్తే 68% శాఖల సమావేశాలు క్రమం తప్పకుండా జరుగుతున్నాయి. ఈ కాలంలో సక్రమంగా సమావేశాలు జరపని, పని చేయని 123 ఆగ్జిలరీ యూనిట్లను రద్దు చేయడం జరిగింది. 1752 మంది సభ్యులు తగ్గారు. ప్రస్తుతం 2,693 గ్రూపుల్లో 23,437 మంది ఉన్నారు. ఇందులో 13,294 మంది అంటే 56% మంది సభ్యులు సగటున సమావేశాలకు హాజరవుతున్నారు. 12,565 మంది, అంటే సుమారు 53 శాతం మంది ప్రజాసమస్యలపై నిర్వహించే ఆందోళనలు, పోరాటాలలో భాగస్వాములవుతున్నారు. పై కమిటీల పిలుపులు, స్థానిక సమస్యలు, వర్గపోరాటాలు, సేవాకార్యక్రమాలు మొదలైన వాటిల్లో వీరి భాగస్వామ్యం ఉంటున్నది. ఇందులో సగటున 7,055 మంది దిన పత్రికలు చదవటం, సైద్ధాంతిక పత్రిక మార్క్సిస్టు అధ్యయనం చేయడం, స్టడీ సర్కిల్స్‌లో పాల్గొనడం, రాజకీయ చర్చలో పాల్గొనడం వంటి వాటన్నిటిల్లో కానీ, వాటిలో ఏదోఒక దానిలో గానీ ప్రతినెలా ఉంటున్నారు. వీరిని కేటగిరీలు చేసినప్పుడు ఈ 7055 మంది 'ఎ' కేటగిరీలో, 5515 మంది 'బి' కేటగిరీలో ఉన్నారు. మిగిలిన 11,189 మంది 'సి' 'డి' కేటగిరీల్లో ఉన్నారు. ఎ, బి కేటగిరీలలో ఉన్న 12,565 మందికి అక్టోబర్, నవంబర్ నెలల్లో రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించి, ఆ క్లాసులకు వచ్చిన వారిని మాత్రమే క్యాండిడేట్ సభ్యులుగా ప్రమాణం చేయించి ప్రమోట్ చేస్తారు.

**సభ్యులను కేటగిరీ చేసే పద్ధతి**

ప్రతినెలా జరిపే ఆగ్జిలరీ గ్రూపు సమావేశానికి, ఆ గ్రూపునకు భాద్యునిగా కేటాయించిన ఎజివొ అంటే ఆగ్జలరీ గ్రూపు ఆర్గనైజర్ హాజరు కావాలి. ఆ కామ్రేడ్ సభ్యులను ఇలా కేటగిరి చేస్తారు. పనిని స్థూలంగా 3 అంశాలుగా రూపొందించడం జరిగింది. **1) సమావేశానికి హాజరు కావటం 2) రాజకీయ అధ్యయనం, రాజకీయ చర్చా కార్యక్రమాల్లో ఉండటం 3) ఆ నెలలో ప్రజా సమస్యలపై జరిగిన కార్యక్రమాలలో గానీ, సేవా కార్యక్రమాలలో గానీ పాల్గొనడం.** సాధారణంగా పార్టీ సభ్యులు నిర్వర్తించాల్సిన కనీస కర్తవ్యాలు 5 ఈ మూడింటిలోనే ఉంటాయి. పై మూడింటిలో ఉన్న వారిని 'ఎ' కేటగిరి సభ్యులుగా గుర్తిస్తారు. రెండింటిలో ఉంటే 'బి' కేటగిరీ సభ్యులుగా గుర్తిస్తారు. ఒక్క దానిలో ఉంటే 'సి' కేటగిరీగా గుర్తిస్తారు. ఏ అంశంలోనూ లేకపోతే 'డి' కేటగిరీగా గుర్తిస్తారు.

అలా గుర్తించిన 'ఎ', 'బి' కేటగిరీ వారే పైన పేర్కొన్న 12,565 మంది. వీరిలో కూడా అక్టోబర్, నవంబర్ నెలల్లో మండలాలు, జిల్లాల వారీగా నిర్వహించే క్లాసులకు హాజరైన వారిని మాత్రమే క్యాండిడేట్స్‌గా ప్రమోట్ చేయడం జరుగుతుంది. తరువాత 'సి' కేటగిరీలలో ఉన్న వారిపై కేంద్రీకరించడం జరుగుతుంది. వారిని కూడా క్రమేపీ ఓపికగా చైతన్య పరుస్తూ, అభివృద్ధి చేయడానికి కృషి జరుగుతుంది. అలా పని-చైతన్యం మెరుగుపడి ముందుకొచ్చిన వారిని ప్రమోట్ చేస్తారు. రాని వారిని కొంతకాలం పరిశీలించి వారిని కూడా 'డి' కేటగిరీ బ్యాచ్‌గానే పరిగణించి వదలి వేస్తారు. నూతన బ్యాచ్‌కోసం అన్వేషణ జరుగుతుంది.

**దీనివలన జరిగిన ఇతర ప్రయోజనాలు**

ఈ గ్రూపు సమావేశాలకు హాజరయ్యే పూర్తికాలం కార్యకర్తలు (ఎజివొలు) 696 మందికి ప్రతినెలా ఆన్‌లైన్‌లో ఒక సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ, ఆర్థిక పరిణామాలు వివరిస్తారు. ఒక రాతపూర్వక నోట్‌ను కూడా పంపుతున్నారు. తరువాత దశలో 37 మంది స్టేట్ ఆర్గనైజర్లు వారి వారి గ్రూపులలో ఉన్న ఎజివొలను ఆగ్జిలరీ గ్రూపు సమావేశాల నిర్వహణ, కార్యకలాపాల నిర్వహణ జరిపేట్లుగా వారిని పనిలోకి దింపే ప్రయత్నం చేస్తారు. ఈ ఎజివొలు ఆగ్జిలరీ గ్రూపుల సమావేశాలకు హాజరయినప్పుడు, ప్రతి సమావేశంలో 30 నిమిషాలకు తగ్గకుండా రాజకీయ రిపోర్టు ఇవ్వాలి అని నిర్ణయించడం జరిగింది.


ఈ నిర్ణయం వలన మన కార్యకర్తలు ప్రతినెలా కొన్ని రోజులు గ్రామాలకు వెళు తున్నారు. అక్కడ ఆగ్జిలరీ గ్రూపులలో పై కమిటీల పిలుపులతో పాటు స్థానిక సమస్యలపై చర్చిస్తున్నారు. స్థానిక అంశాలపై కేడర్‌కు అవగాహన కలుగుతున్నది. రాజకీయ, ఆర్థిక విషయాలు సభ్యులకు అవగతమవుతున్నాయి. అలా తెలియచేయడానికి ఎజివొలు (పూర్తికాలం కార్యకర్తలు) అందరు ఆ అవసరం రీత్యా తప్పని సరిగా అధ్యయనం చేయవల్సి వస్తున్నది. ఆ అధ్యయనం వీరు చేయడంతో పాటు, ఆగ్జిలరీ గ్రూపు సభ్యులతో కూడా చేయించే ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగానే ఈ కాలంలో తెలంగాణా రాష్ట్రంలో **"మార్క్సిస్టు పత్రికలు 5,650 పెరిగాయి. గత 8మాసాల నుండి ఈ పత్రికల సంఖ్య నెల నెలా ఎంతో కొంత పెరుగుతున్నది."**

సహజంగా ఇప్పటిదాకా మనం చేసే ఆందోళనలు, ధర్నాలు, ప్రదర్శనలు, పికెటింగ్‌లు, బంద్ లాంటి రూపాల పోరాటాలు రాష్ట్ర, జిల్లా, మండల కేంద్రాలలో మాత్రమే జరుగుతున్నాయి. అక్కడి ఈ కార్యక్రమాలను ప్రజలు పట్టించుకొనే పరిస్థితి లేదు. వారికి ఇవి రొటీన్‌గా ఉంటున్నది. ప్రస్థుత కాలంలో మీడియా కూడా వీటికి తగిన ప్రాధాన్యత ఇవ్వటం లేదు. అందుకే కార్యక్షేత్రాన్ని గ్రామాలకు, వార్డులకు మార్చాలని నిర్ణయించడం జరిగింది. ఇప్పుడు ప్రజాసమస్యలపై క్షేత్రస్థాయిలో ఆందోళన పోరాటాలు జరుగుతున్నాయి. ప్రజాభాగస్వామ్యం పెరుగుతున్నది. వాటి గురించి ప్రజలలో చర్చ మొదలవుతున్నది. ఉదాహరణకు, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు ఎవరు కారణమని, రైతు చట్టాలు ఎవరి కోసమని ఈ ఆందోళనలు జరిగిన

(మిగతా 25వ పేజీలో)

ఆర్థిక రంగం

# ఎయిర్ ఇండియా అమ్మకంతో విమానయానంలో గుత్తాధిపత్యం


రచయిత ప్రముఖ పాత్రికేయుడు

**వి శ్రీధర్**

ఎయిర్ ఇండియా అమ్మకాన్ని కార్పొరేట్ సంస్థల అధిపతులు, మీడియా సంతోషంగా స్వాగతించాయి. 2014లో నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ప్రైవేటీకరణకు చేసిన అతిపెద్ద ప్రయత్నంగా దీనిని చెప్పవచ్చు. మోడీ పాలనలో ప్రభుత్వ సంస్థలను అమ్మడానికి రూపొందించిన జాబితాలో ఇది తొలిదే అయినా, ప్రభుత్వ సంస్థలను ప్రైవేటువారికి కట్టబెట్టిన 2001లోని అటల్ బిహారీ వాజ్‌పాయ్ నేతృత్వంలోని నేషనల్ డెమొక్రాటిక్ అలయెన్స్ ప్రభుత్వ విధానానికి కొనసాగింపే ఇది.

టాటాల సామ్రాజ్యంలో భాగమైన టలాస్ ప్రైవేట్ లిమిటెడ్ అక్టోబర్ 8 న భారత పురాతన విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాను స్వాధీనం చేసుకున్నది. ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్ ప్రెస్ తక్కువ ధరతో అంతర్జాతీయ ప్రయాణాలు నిర్వహించే సంస్థ. గ్రౌండ్ హ్యాండ్లింగ్ కార్యకలాపాలు నిర్వహించే సింగపూర్ ఎయిర్ లైన్స్‌తో సమాన భాగస్వామి అయిన ఎయిర్ ఇండియా ఎఐఎస్ఎటిఎస్‌లు ఈ ఒప్పందంలో భాగంగా టాటాల పరమవుతాయి.

ఎయిర్ ఇండియాపై పూర్తి నియంత్రణ సాధించడానికి టాటాలు 18,000 కోట్ల రూపాయలు చెల్లించాలి. మొత్తం 61,562 కోట్ల అప్పులో 15,300 కోట్లను పాక్షికంగా పరిష్కరిస్తుంది. ఈ అమ్మకం ఫలితంగా ప్రభుత్వానికి 2,700 కోట్లు మాత్రమే నగదుగా వస్తాయి. ఇందుకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎయిర్ ఇండియా ఎసెట్స్ హెూల్డింగ్ లిమిటెడ్ (ఎఐఎహెచ్ఎల్)కు మిగిలిన 46,252 కోట్ల అప్పు బదిలీ అవుతుంది. నగదు మినహా భవనాలతో సహా మిగిలిన 14,718 కోట్ల ఆస్తులు ఎఐఎహెచ్ఎల్‌కు బదిలీ చేస్తారు. ఆస్తుల విలువపై ఈ అంచనాకు ఏవిధంగా వచ్చారో తెలియదు. ఆసక్తికరమైన అంశమేమంటే ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ సబ్‌కమిటీ (సిసిఈఏ) ఈ బిడ్‌ను అక్టోబరు 4న ఆమోదిస్తే నాలుగురోజుల తరువాత ప్రకటించారు.

ఉద్యోగుల ప్రయోజనాలను "జాగ్రత్తగా చూసుకుంటామని" ప్రభుత్వం గూఢంగా ప్రకటించినప్పటికీ, ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్ ప్రెస్‌లో 14,000 మందికి పైగా ఉద్యోగుల పరిస్థితి గురించి స్పష్టత లేదు. ఒప్పందంలోని నిబంధనలు ఒక సంవత్సరానికి మాత్రమే రక్షణ కల్పిస్తాయి. ఆ తరువాత విఆర్ఎస్ (స్వచ్ఛంద పదవీ విరమణ పథకం) అమలులోకి వస్తుంది. ఈ పరిశ్రమలో శిక్షణ పొందిన ఉద్యోగులకు నిబంధనలు ప్రతికూలంగా మారే అవకాశం ఉంది.

విమానయాన సంస్థ రోజువారీ కార్యకలాపాల నిర్వహణ నిమిత్తం రోజుకు 20 కోట్ల రూపాయల చొప్పున ప్రభుత్వం సమకూరుస్తుందని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్ మెంట్ (దీపం) కార్యదర్శి తుహికాంత్ పాండే చెప్పారు. డిసెంబరులో ఒప్పందం ఖరారయ్యే వరకు ఇది అమల్లో ఉంటుంది. డిసెంబరులోపుగా ఏవైనా అదనపు బాధ్యతలు తలెత్తితే వాటిని ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సంస్థ చూస్తుందని ఆయన స్పష్టం చేశారు. అంటే నష్టాల బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. ఈ భారం ప్రజలపై పడుతుంది. ఈమేరకు అక్టోబరు 12న ప్రభుత్వ వాటా 100 శాతం టాటాలకు విక్రయిస్తూ లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్ఒఐ) జారీ చేసింది.

**రుణభారం పెంచే అమ్మకం**

ఎయిర్ ఇండియా రుణాన్ని బదలాయించటం చాలా ముఖ్యమైనది అమ్మకపు ప్రకటన వచ్చిననాటి నుంచి మీడియాలో దీనిని తక్కువ చేసి చూపుతున్నారు. మొదట 15,300 కోట్ల అప్పు బదిలీ వల్ల ప్రభుత్వం హామీని ఉపసంహరించుకున్నప్పటికీ, రుణంపై చెల్లించే వడ్డీలపై టాటాలు గణనీయంగా పన్ను రాయితీలు పొందుతారు. ఎయిర్ ఇండియా బిడ్‌లో భాగంగా 15,300 కోట్ల రుణం చెల్లింపుపై అతి త్వరలో సంబంధిత బ్యాంకులతో చర్చించే అవకాశం ఉంటుంది. వాస్తవానికి దానిలో కొంత భాగాన్ని ప్రభుత్వరంగ బ్యాంకులు రద్దుచేసే అవకాశం ఉంది.

అందువల్ల టాటాలు కేవలం ఒక విమానయాన సంస్థపై నియంత్రణ పొందడమే కాక పౌర విమానయాన రంగంలో తన మార్కెట్ వాటాను గణనీయంగా విస్తరించే వీలున్నది. 85 శాతం చెల్లింపులపై పన్ను రాయితీలు ఉంటాయి. ఏదైనా పన్ను "రాయితీ" ప్రభుత్వ ఖజానాకు సంబంధించినది కనుక దీని వలన ఎవరు నష్టపోతారో స్పష్టమే. ఉదాహరణకు అప్పుపై టాటాలు 1,570 కోట్ల వడ్డీ చెల్లిస్తే (రుణంపై 10 శాతం చొప్పున) సగటు కార్పొరేట్ పన్ను రేటు 30 శాతం కాబట్టి, పన్ను మినహాయింపుగా 471 కోట్లు లభిస్తుంది. ఖజానాపై 'భారం' అని ఎయిర్ ఇండియా విక్రయాన్ని ప్రభుత్వం సమర్థించుకుంటున్నది. కాని తర్వాత రుణం చెల్లించే విధంగా ప్రైవేటీకరణ ఒప్పందాలు చేసుకుంటే ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని ఇది స్పష్టం చేస్తున్నది.

**ఎయిర్ ఇండియాపై భారం మోపిన నాలుగు అంశాలు**

సంస్థ తీవ్రమైన నష్టాల బారిన పడిందని

> **పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఎయిర్ ఇండియాపై భారీగా ఒత్తిడి తెచ్చిందని కాగ్ తేల్చింది. ముఖ్యంగా సుదూర విమానాల కొనుగోలు ఆర్డర్ ప్రారంభంలో 10 నుండి చివరకు 50కి పెరిగింది, ఫలితంగా బడ్జెట్ వ్యయం 110 కోట్ల డాలర్ల నుండి 615కోట్ల డాలర్లకు పెరిగింది. సాంప్రదాయకంగా నష్టపోతున్న మార్గాల్లో (ఉదాహరణకు యుఎస్ లోని గమ్య స్థానాలకు నాన్-స్టాప్ విమానాలు) విమానాలు నడపటం సమస్యలతో కూడినదని చెప్పింది.**

చిత్రీకరించడం ఎయిర్ ఇండియా అమ్మకం విజయమని మీడియాలో కథనాలు రావటానికి కారణం. నష్టాలపాలు కావడం కంటే అమ్మడం మేలనే అభిప్రాయాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. యాజమాని అయిన ప్రభుత్వం గత రెండు దశాబ్దాలుగా అమలు చేసిన ప్రతికూల విధానాల ఫలితంగా ఎయిర్ ఇండియా నష్టాల పాలయింది. శక్తివంతమైన ప్రైవేటు సంస్థలకు ప్రయోజనం కలిగించటం కోసం ప్రజాప్రయోజనాలను విస్మరించింది.

భారత ప్రభుత్వం అనుసరించిన నాలుగు విధానాల కారణంగా ఎయిర్ ఇండియా రుణభారంలో కూరుకుపోయింది. మొదటిది 2005-06లో ఎయిర్ ఇండియా, ఇండియన్ ఎయిర్‌లైన్స్‌లు 111 విమానాలను కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మండీలో బంగాళాదుంపలు, ఉల్లిపాయలు కొన్న విధంగా ఈ భారీ కొనుగోలు ఆర్డర్ ఇవ్వడానికి నిర్ణయం చేసిన పద్ధతి ఉన్నదని ఒక పైలట్ ఆ సమయంలో ఈ విలేకరికి తెలియజేశాడు. అనంతరం 2009లో సంతకాలు చేసిన భారత్-యుఎస్ అణు ఒప్పందానికి విమానాల కొనుగోలు క్విడ్ కో ప్రోగా ఉన్నది.

27 మీడియం-కెపాసిటీ లాంగ్-రేంజ్ డ్రీమ్ లైనర్లతో సహా 50 బోయింగ్ విమానాల కోసం (జిఇ ఇంజన్లతో) ఎయిర్ ఇండియా ఆర్డర్ ఇచ్చింది. ఎయిర్ ఇండియా చార్టర్స్, దాని అనుబంధ సంస్థ, సిఎఫ్ఎం ఇంజన్లతో అమర్చిన 18 విమానాల కోసం బోయింగ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది (సిఎఫ్ఎం అనేది జిఈ, ఫ్రెంచ్ కంపెనీ సఫ్రాన్‌ల జాయింట్ వెంచర్). రెండు ఆర్డర్ల సంయుక్త విలువ 38,149 కోట్లు (అప్పటికి డాలర్ మార్పిడి రేటు 44 రూపాయలు). 2005 డిసెంబర్ 30న ఈ ఒప్పందంపై సంతకం చేశారు. 2006, ఫిబ్రవరిలో ఇండియన్ ఎయిర్‌లైన్స్ 8,400 కోట్ల రూపాయల విలువైన 43 ఎయిర్ బస్ విమానాల కోసం ఆర్డరు చేసింది. ఈ రెండు విమానయాన సంస్థల ఆర్డర్ల విలువ 46,549 కోట్లరూపాయలు.

తదనంతరం కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్), పార్లమెంటరీ కమిటీలు రెండు విమానయాన సంస్థలు నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించాయని పేర్కొన్నాయి. 1996-2002 మధ్య భారత సివిల్ ఏవియేషన్ మార్కెట్ వేగంగా విస్తరిస్తున్నప్పుడు, ప్రైవేట్ విమానయాన సంస్థలు అప్పటికే చొరబడుతున్నప్పుడు, రెండు ప్రభుత్వ రంగ విమానయాన సంస్థలు తమ విమానాలను విస్తరించడానికి ప్రభుత్వాలు సకాలంలో అనుమతివ్వలేదు. తరువాత భారీగా విమానాల కొనుగోలుకు ఆర్డర్లు ఇచ్చి వాటి వెన్ను విరిచాయి.

పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఎయిర్ ఇండియాపై భారీగా ఒత్తిడి తెచ్చిందని కాగ్ తేల్చింది. ముఖ్యంగా సుదూర విమానాల కొనుగోలు ఆర్డర్ ప్రారంభంలో 10 నుండి చివరకు 50కి పెరిగింది, ఫలితంగా బడ్జెట్ వ్యయం 110 కోట్ల డాలర్ల నుండి 615కోట్ల డాలర్లకు పెరిగింది. సాంప్రదాయకంగా నష్టపోతున్న మార్గాల్లో (ఉదాహరణకు యుఎస్ లోని గమ్యస్థానాలకు నాన్-స్టాప్ విమానాలు) విమానాలు నడపటం సమస్యలతో కూడినదని చెప్పింది.

ఒప్పందాన్ని ఖరారు చేయడానికి అనుసరించిన ప్రక్రియలో జాతీయ ఆడిటర్ తీవ్రమైన వ్యత్యాసాలను కనుగొన్నారు. దేశీయంగా మార్కెట్ పెరుగుతున్నప్పుడు ఇండియన్ ఎయిర్ లైన్స్ తన విమానాల సంఖ్యను పెంచడానికి ప్రయత్నాలు చేసింది. 1996-1999 మధ్య 15 బోయింగ్, ఎయిర్ బస్ విమానాలను కొనుగోలే ప్రయత్నాలను ప్రారంభించింది. అప్పటికే విమానయాన సంస్థను విక్రయించాలని నిర్ణయించటంతో వాజ్ పేయి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం దీనిని తోసిపుచ్చింది. చివరికి వైమానిక సంస్థ 43 విమానాలను ఆర్డర్ చేసినప్పుడు కాగ్ ఒక చిన్న ఆర్డర్‌గానే పరిగణించింది. అది అనంతరకాలంలో విమానయాన సంస్థకు మరింత ప్రయోజనకరంగా ఉంటుందని భావించింది. మార్చి 2005 మార్చి 2009 మధ్య నాలుగు సంవత్సరాలలో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాల సంఖ్య 67 నుండి 97కి పెరిగినప్పటికీ, దాని మార్కెట్ వాటా 37 నుండి 17 శాతానికి పడిపోయింది. ఈ రెండు విమానయాన సంస్థలకు విమానాల కొనుగోలు పెను విపత్తుగా మారింది.

ఎయిర్ ఇండియా, ఇండియన్ ఎయిర్‌లైన్స్‌లను ఒకే సంస్థగా మారిస్తే ఎదురయే పరిణామాలపై సరైన అంచనా లేకుండానే ప్రభుత్వం బలవంతంగా రెండింటినీ కలిపింది. రెండు విమానయాన సంస్థల విలీనానికి కారణాలపై పౌర విమానయాన శాఖ కాగ్‌కు సరైన వివరణ ఇవ్వలేకపోయింది. విలీనం జరుగుతున్న దశలోనే విమానాలను కొనుగోలు చేయాలని పౌరవిమానయాన శాఖ ఒత్తిడి చేసింది. విలీనం తరువాత ఉమ్మడి సంస్థ అవసరాలను బట్టి విమానాలను కొనుగోలు చేయాలని ఇంగితజ్ఞానం నిర్దేశిస్తుంది. 2007 ఆగస్టులో హడావిడిగా విలీనం చేసినప్పటికీ ఉమ్మడిగా టికెట్లు ఇచ్చే వ్యవస్థను ఏర్పరచుకోవడానికి మరో నాలుగు సంవత్సరాలు పట్టింది! ఫలితంగా ఎయిర్ ఇండియా స్టార్ అలయన్స్‌లోకి ప్రవేశించడం గణనీయంగా ఆలస్యం అయింది. ఆ కాలంలో అది మార్కెట్ వాటాను కోల్పోతూనే ఉంది.

**జాతీయ రవాణా సంస్థలను అణచివేయడం**

మూడవ అంశం భారతదేశంలో వరుస ప్రభుత్వాలు దూకుడుగా అనుసరించిన "ఓపెన్ స్కైస్" విధానం. ఇతర దేశాల ప్రభుత్వాలతో పరస్పర అంగీకార విధానం పాటించలేదు. ఉదాహరణకు 2003-04 వరకు విదేశీ విమానాలు భారతదేశంలోని ప్రధాన విమానాశ్రయాల నుండి మాత్రమే ప్రయాణించేందుకు అనుమతించారు. అనంతరం వారు నేరుగా ఇతర ప్రదేశాలకు వెళ్లేందుకు అనుమతించడంతో వాటి సామర్థ్యం పెరిగింది.

ఉదాహరణకు పశ్చిమాసియాకు లాభదాయకమైన మార్గాల్లో దుబాయ్ విమానయాన సంస్థల సీట్ల సామర్థ్యం 2003-04, 2008-09 మధ్య దాదాపు

ఐదు రెట్లు పెరిగింది. 2008–09లో విదేశీ విమానాలు దాదాపు 99 శాతం సామర్థ్యంతో పనిచేస్తుండగా, భారతీయ విమానాలు 50 శాతం కన్నా తక్కువ సామర్థ్యంతో పనిచేశాయి. విదేశీ విమానాలు సామర్థ్యం పెంచుకోవడానికి ప్రయాణీకులను ఒక కేంద్రం నుండి మరో కేంద్రానికి చేరవేయడం ద్వారా మాత్రమే కాకుండా, వారి స్వదేశాల నుండి ట్రాఫిక్‌ను తీసుకువెళ్ళేందుకు 6 వ స్వేచ్ఛా ప్రయోజనాన్ని వినియోగించుకున్నారు. గత రెండు దశాబ్దాలుగా విమానయాన సంస్థలకు ఈ ప్రయోజనం చాలా ప్రాముఖ్యత గల అంశంగా మారింది. దీనివల్ల రెండు గమ్యాలకు మధ్యలో తమ స్వంత దేశంలోని ప్రాంతాల్లో ఆగేందుకు వీలు కల్పిస్తుంది. ఇతెహాద్ / అబుదాబి, ఎమిరేట్స్ / దుబాయ్, ఖతార్ ఎయిర్ వేస్ / ఖతార్, కాథే పసిఫిక్ / హాంకాంగ్, సింగపూర్ ఎయిర్ లైన్స్ / సింగపూర్ ఈ భాగస్వామ్యాలకు కొన్ని ఉదాహరణలు, ఇందులో విమానాశ్రయ అధికారులు, విమానయాన సంస్థలు జాతీయ కేంద్రాలను పెంచుతాయి. కానీ నయా ఉదారవాద విధానాలలో కూరుకుపోయిన భారత విమానయాన విధానం ఆ విధంగా వ్యవహరించటానికి నిరాకరించింది.

కార్యకలాపాలకు సరిపడా విమానాలు లేకపోవడం వల్ల ఎయిర్ ఇండియా దెబ్బతిన్నది. అంతేకాక ఎమిరేట్స్ వంటి విదేశీ విమానాలు కోజికోడ్ వంటి చిన్న పట్టణాల నుండి కూడా పనిచేయడానికి అనుమతించటం వలన కూడా తీవ్రంగా దెబ్బతింది. భారతదేశం నుంచి 2009–10 సంవత్సరంలో వచ్చివెళ్లిన 6వ ఫ్రీడం ట్రాఫిక్ వివరాలపై కాగ్ విశ్లేషణను (2011) పరిశీలిస్తే వాస్తవాలు తెలుస్తాయి. భారతదేశానికి వచ్చి వెళ్లిన వాటిలో ఖతార్ ఎయిర్ వేస్, గల్ఫ్ ఎయిర్ (బహ్రెయిన్) ఇతెహాద్‌ల వాటా 75 శాతం. అదే సంవత్సరంలో లుఫ్తాన్సా 87 శాతం, బ్రిటిష్ ఎయిర్ వేస్ 61 శాతం ఎయిర్ ఫ్రాన్స్ 73 శాతం (యూరోపియన్ క్యారియర్‌ల మొత్తం నిష్పత్తి 74 శాతం). విదేశీ విమానయాన సంస్థలు ఆగ్నేయ ఆసియాకు తీసుకువెళుతున్న ప్యాసింజర్‌ల వాటా, ప్రత్యేకించి క్యాథే పసిఫిక్ విషయంలో సగానికి పైగా ఉంటుంది.

నాల్గవ అంశం భారతీయ ప్రభుత్వ రంగ విమానయాన సంస్థలను దీర్ఘకాలికంగా, ఉద్దేశ్యపూర్వకంగా నిర్లక్ష్యం చేయటం, ప్రైవేట్ సంస్థలను మెప్పించడానికి రెండు సంస్థల ప్రయోజనాలను దెబ్బతీసిన విధానం. చెన్నై, – కౌలాలంపూర్ మార్గంలో క్రమం తప్పకుండా ప్రయాణించే భారతీయ ఎయిర్ లైన్స్‌లో పనిచేస్తున్న చెన్నైకి చెందిన మాజీ పైలట్ ఈ రచయితతో మాట్లాడుతూ ఇప్పుడు పనిచేయని జెట్ ఎయిర్ వేస్ విమానాలను రెండు వైపుల నుండి భారత ఎయిర్ లైన్స్ విమానం బయలుదేరే కొద్ది నిముషాల ముందు బయలుదేరడానికి అనుమతించారు. “ఇది ప్రపంచంలో ఎక్కడా ఊహించలేము, కానీ ఇక్కడ చాలా మార్గాల్లో ఇది జరిగింది.”

> ❝ కార్యకలాపాలకు సరిపడా విమానాలు లేకపోవడం వల్ల ఎయిర్ ఇండియా దెబ్బతిన్నది. అంతేకాక ఎమిరేట్స్ వంటి విదేశీ విమానాలు కోజికోడ్ వంటి చిన్న పట్టణాల నుండి కూడా పనిచేయడానికి అనుమతించటం వలన కూడా తీవ్రంగా దెబ్బతింది. భారతదేశం నుంచి 2009-10 సంవత్సరంలో వచ్చివెళ్లిన 6వ ఫ్రీడం ట్రాఫిక్ వివరాలపై కాగ్ విశ్లేషణను (2011) పరిశీలిస్తే వాస్తవాలు తెలుస్తాయి. ❞



ఎయిర్ ఇండియా ప్రయివేటీకరణతో టాటాలు 141 విమానాలతో బాటు ఒక విమానయాన సంస్థను, బాగా శిక్షణ పొందిన శ్రామిక శక్తిని సొంతం చేసుకున్నారు

రెండు జాతీయ విమానయాన సంస్థల కోసం ఏర్పాటైన సదుపాయాలు ప్రైవేటు విమానయాన సంస్థల పరమయ్యాయి. భారత విమానాశ్రయాల్లో ప్రయాణీకుల సౌకర్యం కోసం ఏర్పాటైన సదుపాయాలు, టికెట్ కౌంటర్లు, లాంజ్‌లు, ప్రధాన స్లాట్‌లు, ఇతర సౌకర్యాలను అవి ఆక్రమించాయి. భారత ప్రభుత్వానికి చెందిన రెండు జాతీయ విమానయాన సంస్థలు ఇతర దేశాలతో ద్వైపాక్షిక వాయు సేవా ఒప్పందాలు కలిగి ఉన్నప్పటికీ ఆ స్లాట్లు ఖాళీ చేసి, అంతర్జాతీయ వాయు మార్గాల్లో ప్రయాణిస్తున్న జెట్, కింగ్ ఫిషర్ వంటి సంస్థలకు అప్పగించారు.

విమానాలను విచక్షణారహితంగా కొనుగోలు చేయడం, ఎయిర్ ఇండియా, ఇండియన్ ఎయిర్ లైన్స్‌లను బలవంతంగా ఏకం చేయడం, వాటి విభిన్న విమాన అవసరాలను పరిగణనలోకి తీసుకోకపోవడంతో 2011–2020 మధ్య కాలంలో ఎయిర్ ఇండియా అప్పులు భారీగా పెరిగాయి. వైమానిక సంస్థ మొత్తం నష్టాలు దాదాపు 65,000 కోట్ల రూపాయలు. ఈ మొత్తం రుణభారంలో ఈ 10 సంవత్సరాల కాలంలో సంచిత వడ్డీ చెల్లింపులు దాదాపు 35,000 కోట్ల రూపాయలు కాగా, తరుగుదల అదనంగా మరో 21,000 కోట్లు.

అదే కాలంలో వైమానిక సంస్థ కార్యకలాపాల వల్ల కలిగిన నష్టాలు కేవలం

**"టాటాలు దాని విమానాలతో పాటు ఒక విమానయాన సంస్థను, బాగా శిక్షణ పొందిన శ్రామిక శక్తిని సొంతం చేసుకున్నారు. భారతీయ విమానాశ్రయాలలో 4,400 దేశీయంగా 1,800 అంతర్జాతీయ స్లాట్లను, విదేశాల్లో 900 స్లాట్లను సంపాదించుకున్నారు. ఇది భారతదేశంలోని పురాతన బడా కార్పొరేట్ సంస్థకు అత్యధికంగా లాభాలు అందించే ఒప్పందం."**

1.5 శాతం, అంటే 917 కోట్లు. దీని అర్థం మొత్తం నష్టాలలో 1.5 శాతం కన్నా తక్కువ కార్యకలాపాల వలన వచ్చింది. కాగా 87 శాతం నష్టాలు దాని సంరక్షకుడైన పౌర విమానయాన మంత్రిత్వ శాఖ చేసిన జంట పాపాల వల్ల సంభవించాయి. వాస్తవానికి 2019-20 నాటికి దానిని విక్రయించాలని మోడీ ప్రభుత్వం నిర్ణయం చేసింది. అయినప్పటికీ ఎయిర్ ఇండియా నిర్వహణ ద్వారా 1,787 కోట్లు లాభం గడించగా, వడ్డీ చెల్లింపుల భారం (4,419 కోట్లు) తరుగుదల వల్ల (4,795.30 కోట్లు) దాని మొత్తం బ్యాలెన్స్ షీట్ 7,427 కోట్ల నష్టాన్ని చూయించింది.

**గుత్తాధిపత్యానికే ప్రైవేటీకరణ**

ఎయిర్ ఇండియా, విస్తారా, ఎయిర్ ఆసియా అనే మూడు విమానయాన సంస్థల సంయుక్త ఆదాయాలు 2020లో 40,500 కోట్లు కాగా, పరిశ్రమ మొత్తం ఆదాయం 95,700 కోట్లు. ఈ మూడు కంపెనీల సంయుక్త వాటా 42.32 శాతం. ఇండిగో 35,800 కోట్ల ఆదాయంతో జాతీయ మార్కెట్‌లో 37.41 శాతం, ఎక్కువ వాటాను కలిగివున్నది. ఇండిగో తక్కువ ఛార్జీలతో ప్రయాణీకులను తీసుకెళ్ళే సంస్థ కావడం వల్ల ఆదాయంలో తక్కువ వాటాతో ఉంది. ఎయిర్ ఇండియా, విస్తారాలు అధిక ధరల వసూలు చేస్తూ పూర్తిస్థాయి కార్యకలాపాలను అందిస్తున్నాయి. ఆదాయాల పరంగా రెండు పెద్ద సంస్థల సంయుక్త మార్కెట్ వాటా భారత మార్కెట్లో దాదాపు ఐదింట నాలుగు వంతులుంటుంది. ఎయిర్ ఇండియాను ప్రైవేటీకరించడం వల్ల భారతదేశంలో కేంద్రీకృత మార్కెట్ ఏర్పడుతుంది. ఇండిగో, టాటా నియంత్రిత విమానయాన సంస్థలు ఇప్పుడు దాదాపు 80 శాతం దేశీయ మార్కెట్ వాటాను కలిగి ఉన్నాయి.

**దేశీయ ఎయిర్ ట్రాఫిక్ షేర్లు (జనవరి- జూలై 2021)**

ఎయిర్ ఇండియాకు 18,000 కోట్ల రూపాయల ధర సరసమైనదేనా అన్నది క్లిష్టమైనది. ఒక సంస్థ పనిచేయని స్థితిలో ఉన్నప్పుడు అనేక కారణాల వల్ల ధరను గురించిన అంచనాలు సక్రమంగా ఉండవు. దీర్ఘకాలంలో దాని సంపాదన సామర్థ్యంపై ఆధారపడి మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో ఒక సంస్థ విలువ ఉంటుంది. కానీ ఒక విషయం స్పష్టంగా అర్థమవుతోంది. ఈ సంస్థ టాటాల పరం కావడం వల్ల వారికి మార్కెట్‌లో అధికవాటా లభిస్తుంది. ముఖ్యంగా దేశీయ మార్కెట్లో ఈ గ్రూపు కార్టెల్ తరహాలో ఆధిపత్యం సంపాదిస్తుంది. టాటా, ఇండిగోలు ధరలపై అవగాహనకు వస్తే ఇతరులు చేయగలిగేదేమీ ఉండదు.

అంతర్జాతీయ ప్రయాణ మార్కెట్‌లో పరిణామాలు భిన్నంగా ఉంటాయి. టాటాలు వాటిని నియంత్రించేంత పెద్దవారు కాకపోవచ్చు. కానీ ఎయిర్ ఇండియాకు ప్రస్తుతం ఉన్న ఖాతాదారులు, విదేశీ విమానాశ్రయాలలో స్లాట్లు వంటి మౌలిక సదుపాయాలు పట్టు సాధించటానికి అవకాశం ఇస్తాయి. విస్తారా దాని ఎయిర్ ఆసియా కార్యకలాపాలతో పాటు, లాభదాయకమైన తక్కువధరతో ప్రయాణీకులను తీసుకు వెళ్ళే ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ వలన బహుళ మార్కెట్ విభాగాలలో టాటాలకు ఎక్కువ అవకాశాలు లభిస్తాయి.

ఎయిర్ ఇండియా అమ్మకం జరిగిన సమయం ఏ మాత్రం సరైనది కాదు. ప్రపంచ విమానయాన చరిత్రలో ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద తిరోగమనం మధ్యలో ఒక వైమానిక సంస్థను ఎవరు విక్రయిస్తారు? ఈ నిర్ణయాన్ని బాధ్యతారాహిత్యం అంటారు. 2017 ప్రారంభంలో ఎయిర్ ఇండియాను విక్రయించాలన్న నిర్ణయానికి స్పందన రాలేదు. 2020 జనవరిలో ఈ ప్రక్రియ తిరిగి ప్రారంభమైంది. మహమ్మారి కారణంగా మొత్తం ప్రపంచంలో కార్యకలాపాలు స్తంభించాయి. 2020 అక్టోబర్‌లో మరింత ఆకర్షణీయంగా ఉండేలా నిబంధనలు సవరించారు. ప్రత్యేకించి కొనుగోలుదారుడు ఎంత రుణాన్ని స్వీకరిస్తాడన్నది అంచనా వేశారు. ఈ "లావాదేవీ తీవ్రమైన పోటీని చూసింది" అని ఆర్థిక మంత్రిత్వశాఖ పేర్కొన్నప్పటికీ వాస్తవాలు వాటిని ప్రతిబింబించవు. ఏడు సంస్థలు మాత్రమే స్పందించినప్పటికీ ప్రమాణాలకు అనుగుణంగా లేకపోవటంతో ఐదు అర్హత సాధించలేదు. మిగిలిన రెండు బిడ్లలో ఒకటి స్పైస్ జెట్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ సింగ్ నేతృత్వంలోని కన్సార్టియం ద్వారా వేశారు. కానీ అది క్రమంగా కరగిపోయే దశలో ఉంది. అతని బిడ్ విలువ 15,100 కోట్లు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస ధర 12,906 కోట్లు.

ఎయిర్ ఇండియాను టాటాలకు బహుమతిగా అందించారు. కొనుగోలుదారుకు ఎక్కువ లాభాలు సంపాదించటానికి అవకాశాలు కల్పించటమే కాకుండా దాని స్వంత ఆస్తుల వల్ల కూడా అది లాభదాయకంగా ఉంటుంది. ఎయిర్ ఇండియా ప్రస్తుతం 141 విమానాలను కలిగి ఉంది. వాటిలో 118 ప్రయాణానికి యోగ్యమైన స్థితిలో ఉన్నాయి. అంతేకాకుండా దాని ఎయిర్‌బస్‌లలో గణనీయమైన భాగం, అలాగే ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ నడుపుతున్న బోయింగ్ 737లో చాలా కొత్తవి. టాటాలు దాని విమానాలతో పాటు ఒక విమానయాన సంస్థను, బాగా శిక్షణ పొందిన శ్రామిక శక్తిని సొంతం చేసుకున్నారు. భారతీయ విమానాశ్రయాలలో 4,400 దేశీయంగా 1,800 అంతర్జాతీయ స్లాట్లను, విదేశాల్లో 900 స్లాట్లను సంపాదించుకున్నారు. ఇది భారతదేశంలోని పురాతన బడా కార్పొరేట్ సంస్థకు అత్యధికంగా లాభాలు అందించే ఒప్పందం.

**(అనువాదం: జి ఆంజనేయులు)**

# ఎర్రజెండా ఎజెండా

ఎస్ వీరయ్య


రచయిత సిపిఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు

ఉభయ కమ్యూనిస్టు పార్టీల మహాసభల కాలమిది, ఏమి చర్చించాలి?

కమ్యూనిస్టు ఉద్యమం బలహీనపడింది. బెంగాల్‌లో ఒక్క సీటు కూడా రాలేదు. ఓట్లు బాగా తగ్గాయి. భవిష్యత్తు ఏమిటి?

ఒకప్పుడు వామపక్షాల చుట్టూ తిరిగిన బూర్జువా పార్టీలే ఇప్పుడు పెద్దగా లెక్క చేయటంలేదు. కారణం?

ఎన్నికల పొత్తు లేకపోతే సీట్లు రావు. సీట్లు లేకపోతే ఉద్యమాలకు గుర్తింపు రావటం లేదు కదా!

ఔను... ఇప్పుడు కమ్యూనిస్టు శ్రేణుల లోనూ, శ్రేయోభిలాషులలోనూ ఇలాంటి అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇవేవీ కొట్టిపారేయవలసిన విషయాలు కాదు. సమాధానాలు వెతకవల్సిన ప్రశ్నలే! మహాసభల సందర్భం ఇందుకు తగిన సమయం. కమ్యూనిస్టు ఉద్యమంలో మహాసభలు కేవలం ఒక తంతు కాదు. అంతర్మథన సందర్భం. అంతర్గత ప్రజాస్వామ్య ప్రక్రియ.

ఒకప్పుడు ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న బూర్జువాపార్టీల నాయకులు కమ్యూనిస్టు పార్టీల కార్యాలయాలకే వచ్చి మద్దతుకోరిన సందర్భాలున్నాయి. హుజూరాబాద్ ఉప ఎన్నికలో మద్దతు అడగడానికే టిఆర్ఎస్ నాయకత్వం విముఖత ప్రదర్శించింది. వారే ఓట్లు వేస్తారులే అనే ధోరణి ప్రదర్శించింది. దుబ్బాక ఉప ఎన్నికలో వామపక్షాల సహకారం తీసుకుని ఉంటే బీజేపీని ఓడించగలిగేదే. ఆ అనుభవం తర్వాత కూడా అదే ధోరణి ప్రదర్శించింది. వామపక్షాలతో కలిసి పని చేద్దామని ప్రకటిస్తున్న కాంగ్రెస్ నాయకత్వం తెలంగాణలో గిరిజన పోడు భూముల పోరాటంలో అంటీముట్టనట్టున్నది. ప్రధాన నాయకత్వం ముఖం చాటేసింది. కమ్యూనిస్టు ఉద్యమానికి బూర్జువా పార్టీలతో సీట్ల సర్దుబాటు అనుభవాలు కూడా తక్కువేమీ కాదు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ కాలంలో అనేక ఒడిదుడుకులు చూసింది. ఆయా సందర్భాలలో రాజకీయంగా కొన్ని సానుకూల ఫలితాలు వచ్చిన మాట నిజం. అంతిమంగా ఎర్రజెండా ప్రజాపునాది కరిగిన మాట కూడా నిజం. ఉమ్మడి రాష్ట్ర అనుభవం కూడా ఇదే! తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలతో ఎన్నికల సర్దుబాట్లు కొన్ని సీట్లు గెలవడానికి తోడ్పడ్డాయి. కొన్ని సందర్భాలలో ఎన్నికలలో ఓడించాలనుకున్న శక్తులు ఓడిపోయాయి కూడా. అదే సమయంలో మన ప్రతిష్టా, ప్రజాపునాది కూడా కరుగుతూ వచ్చాయి. అనుకూల, ప్రతికూల అంశాలను బేరీజు వేసుకోవల్సిన సందర్భం ఇది.

పాలకవర్గ పార్టీలతో ఎన్నికల సర్దుబాట్లు సీట్లతో పాటు కొన్ని అవలక్షణాలను కూడా అంటించాయి. ఇది సహజం కూడా. సరళీకృత ఆర్థిక విధానాల ప్రభావాలు కూడా ఉండనే ఉన్నాయి. సౌకర్యాల కోసం ఆరాటం, ఆడంబరాలు, అట్టహాసం వంటి ధోరణులు పెరుగుతున్నాయి. వీటికి తోడు ఎన్నికల సర్దుబాట్ల పేరుతో సుదీర్ఘకాలం బూర్జువా పార్టీలతో సావాసం ప్రభావాలున్నాయి. ఎన్నికల్లో పోటీ చేయాలన్న తహతహ, పదవీదాహం, ప్రజల ముందు దర్పం ప్రదర్శించటం పెరిగింది. ఖర్చు పెట్టుకోగల్గితే పోటీకి అవకాశం వస్తుందని డబ్బు కూడబెట్టటం, టిక్కెట్‌కోసం పైరవీలు చూస్తున్నాం. అవినీతి ప్రభావం కూడా చూసాం. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ జిల్లాలలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల మీద చర్యలు కూడా తీసుకోవాల్సి వచ్చింది. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. వీటన్నింటి ఫలితంగా ప్రజలతో సంబంధాలు బలహీనపడ్డాయి. భవనాలు భారాలవుతున్నాయి. పోరాటాలు, ప్రజాసేవా కార్యక్రమాలు, ప్రజలతో సంబంధాలు పెరిగితే అవి పోరాట కేంద్రాలుగా, సేవా కేంద్రాలుగా విలసిల్లుతాయి. అవి తగ్గితే భారాలవుతాయి కదా! ఎన్నికలు, ఎన్నికల సర్దుబాట్లు పెరిగినపుడు అంటుకునే పెడధోరణులు వర్గపోరాటాలు, ప్రజా ఉద్యమాలు పెరిగినపుడు కొట్టుకుపోవటం సహజం. ప్రజలూ, ప్రజాపోరాటాలే వీటికి పరిష్కార మార్గాలు. నీటి ప్రవాహంలో చెత్తా చెదారం కొట్టుకుపోయినట్టే ప్రజా పోరాటాలతో అన్యవర్గ ధోరణులూ కొట్టుకుపోతాయి. శాంతియుత కాలంలో చొచ్చుకొచ్చే అవలక్షణాలు పోరాట కాలంలో వెన్నుచూపటం అనివార్యం. ఇప్పుడు అంటుకున్న ధోరణుల లక్షణం అది.

బూర్జువాపార్టీల పట్ల భవిష్యత్తులో ఎలాంటి వైఖరి కలిగి ఉండాలన్నదే ఇప్పుడు కీలకమైన ప్రశ్న. విశాఖలో జరిగిన పార్టీ 21వ అఖిలభారత మహాసభ ఈ విషయాలు లోతుగా చర్చించింది. 25 సంవత్సరాల ఎన్నికల ఎత్తుగడలూ, అనుభవాలను పరిశీలించింది. సరళీకృత ఆర్థిక విధానాల పట్ల రాజీలేని పోరాటం చేయాలని అంతిమంగా నిర్ణయించింది. మతోన్మాదం మీద ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ రంగాలలో పోరాడాలని పిలుపునిచ్చింది. భారత కమ్యూనిస్టు ఉద్యమం ముందున్న కీలకమైన కర్తవ్యాలు ఇవే. వర్గపోరాటాలు ఉధృతం చేస్తూ, మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకికశక్తులతో కలిసి పెద్దయెత్తున ప్రజాసమీకరణ చేసే క్రమంలోనే మతోన్మాదం బలహీనపడటం, కమ్యూనిస్టుల ప్రజాపునాది బలపడటం జరుగుతుంది. ఈ నేపథ్యంలోనే ఎన్నికల ఎత్తుగడలూ రూపొందించుకోవాల్సి వస్తుంది. కమ్యూనిస్టుల ప్రజాపునాది ఏ మేరకు బలపడితే, ఆ మేరకు ఎన్నికలలో మతోన్మాదానికి వ్యతిరేకంగా జోక్యం చేసుకోగల శక్తి పెరుగుతుంది. శక్తి మేరకు వామపక్షాలు మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడవచ్చు. శక్తి చాలనపుడు ఓడించగల లౌకిక శక్తులకు సహకరించవచ్చు.

ఈ పూర్వరంగంలోనే ప్రస్తుత పరిస్థితులను కూడా పరిశీలించాలి. కోవిడ్ మహమ్మారి

> **కార్మికుల, రైతుల పోరాటాలకు మద్దతునిచ్చేందుకు కాంగ్రెస్ సిద్ధంగా లేదు. రైతాంగ పోరాటం 11 మాసాలుగా సాగుతున్నప్పటికీ సంఘీభావంగా నిలవడానికి కాంగ్రెస్ నాయకత్వం అంతగా ఉత్సాహం చూపడం లేదు. పార్లమెంటులో కార్మికచట్టాల రద్దును సమర్థించారు. టీఆర్ఎస్, వైసీపీ, టీడీపి తదితర ప్రాంతీయ పార్టీలు కూడా పార్లమెంటులో కార్మికచట్టాల రద్దునూ, రైతు వ్యతిరేక చట్టాలను వ్యతిరేకించలేదు. ఇవన్నీ బూర్జువా పార్టీల స్వభావాన్ని వ్యక్తం చేస్తున్నాయి.**

దేశంలో ప్రవేశించడానికి ముందే ఆర్థికవ్యవస్థ మందగించింది. మోడీ ప్రభుత్వం అనుసరించిన తప్పుడు విధానాల ఫలితం అది. 2020 లో కరోనా ప్రవేశం మన ఆర్థికవ్యవస్థకు దెబ్బమీద దెబ్బ. కానీ బడా పారిశ్రామికవేత్తలకు మాత్రం ఇది వడ్డించిన విస్తరి. కరోనా కాలంలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం గానీ, రాష్ట్రాలలో కాంగ్రెస్, ఇతర ప్రాంతీయపార్టీల ప్రభుత్వాలుగానీ అనుసరించిన విధానాలే అందుకు కారణం. ప్రజలు ప్రత్యక్ష పోరాటాలలో పాల్గొనడానికి పరిమితులేర్పడిన పరిస్థితులను అవకాశంగా తీసుకుని సరళీకృత ఆర్థిక విధానాలు వేగంగా అమలుజరిపాయి. కేంద్రప్రభుత్వం కీలకమైన ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ ప్రైవేటీకరించే ప్రక్రియ వేగవంతం చేసింది. కరోనా కాలంలో ప్రజలను ఆదుకునే ప్యాకేజీ పేరుతో కూడా భూమిమీద, భూగర్భంలో, అంతరిక్షంలో ఏదీ వదలకుండా బడాబాబులకు ధారాదత్తం చేసేందుకు మార్గం సుగమం చేసింది. పెట్టుబడిదారుల దోపిడీ వేగవంతం చేసేందుకు వీలుగా కార్మిక చట్టాలు రద్దు చేసింది. వాటి కోరలు పీకి, కోడ్స్ రూపంలో ముందుకు తెచ్చింది. కార్మికుల హక్కులు హరించింది. పెట్టుబడిదారుల దోపిడీకి ఉన్న కొద్దిపాటి ఆటంకాలు కూడా తొలగించింది. కార్పొరేట్ శక్తులకు అనేక రాయితీలు ఇచ్చింది. వీటన్నింటి ఫలితంగా అంబానీ, ఆదానీలతో బాటు దేశంలోని శతకోటీశ్వరుల సంపద పెరిగింది. ప్రజల బతుకులు చితికిన కాలంలో... దేశ ఆర్థిక వ్యవస్థ బక్కచిక్కిన కాలంలో... బడాబాబులు మాత్రం బలిసిపోయారు. కరోనా కాలంలో కూడా పచ్చగా కనబడ్డది వ్యవసాయ రంగం. దానిమీద బడా పెట్టుబడిదారుల కన్ను పడ్డది. అంతే... కార్మిక చట్టాల రహిత భారతదేశమే కాదు, రైతురహిత భారతదేశం నిర్మించే పనికి కూడా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నడుం కట్టింది. వ్యవసాయరంగాన్ని బడాబాబులకు అప్పగించే చర్యలు ప్రారంభించింది. మూడు రైతువ్యతిరేక చట్టాలు చేసింది. విద్యుత్తు సవరణ బిల్లును కూడా రంగంలోకి తెచ్చింది. నూతన విద్యావిధానం పేరుతో అభివృద్ధి నిరోధక మార్పులు చేసింది. మరోవైపు ఈ చర్యలకు ప్రతిఘటన కూడా పెరుగుతున్నది. చరిత్రలో మొదటిసారి కార్మికవర్గం, రైతాంగం దేశవ్యాపిత ఐక్య పోరాటం ప్రారంభించారు. అఖిలభారత సమ్మె జరిగింది. 11 మాసాలుగా వేలాది మంది రైతులు ఢిల్లీ నగరాన్ని చుట్టు ముట్టారు. రహదారులు దిగ్బంధనం చేసారు. ప్రపంచ చరిత్రలోనే ఇదొక కొత్త తరహా పోరాటం. అయినా కేంద్ర పాలకులు మొండిగా వ్యవహరిస్తున్నారు. కరోనా కాలంలో కూడా, ప్రపంచ మార్కెట్‌లో పెట్రోలియం ధరలు తగ్గినపుడు కూడా ఇక్కడ ధరలు పెంచారు. ఇది నిత్యజీవితావసరాల ధరలన్నీ పెరగటానికి దారితీసింది. మరోవైపు ప్రజలలో అసంతృప్తిని అణచేందుకు నిరంకుశ పోకడలు మరింత బలపడుతున్నాయి. ఈ ధోరణి అన్ని రంగాలలో ప్రతిబింబిస్తున్నది. వీటికి తోడు కేంద్రంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ లాంటి శక్తులు ప్రజల మధ్య మతపరమైన విభజన సృష్టించేందుకు, జాతీయ దురభిమానాన్ని రెచ్చగొట్టి పాకిస్తాన్, చైనా వ్యతిరేకతను ఎగదోసి పబ్బంగడుపుకునే ప్రయత్నంలో ఉన్నాయి.

ఇంత జరుగుతున్నప్పటికీ కార్మికుల, రైతుల పోరాటాలకు మద్దతునిచ్చేందుకు కాంగ్రెస్ సిద్ధంగా లేదు. రైతాంగ పోరాటం 11 మాసాలుగా సాగుతున్నప్పటికీ దానికి సంఘీభావంగా నిలవడానికి కాంగ్రెస్ నాయకత్వ శ్రేణులు అంతగా ఉత్సాహం చూపడంలేదు. రాజకీయ ప్రయోజనాల మేరకు మాట్లాడటంతోనే సరిపెట్టుకుంటున్నారు. పార్లమెంటులో కార్మికచట్టాల రద్దును సమర్థించారు. టీఆర్ఎస్, వైసీపీ, టీడీపి తదితర ప్రాంతీయ పార్టీలు కూడా పార్లమెంటు లో కార్మికచట్టాల రద్దునూ, రైతు వ్యతిరేక చట్టాలను వ్యతిరేకించలేదు. ఇవన్నీ బూర్జువా పార్టీల స్వభావాన్ని వ్యక్తం చేస్తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా ప్రజా పోరాటాల విషయంలో అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నాయి.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను కూడా ఈ సందర్భంగా పరిశీలించవచ్చు. భూ ప్రక్షాళన పేరుతోనూ, ధరణి వెబ్‌సైట్ పేరుతోనూ రాష్ట్ర ప్రభుత్వం భూస్వాముల, ధనికరైతుల ప్రయోజనాలు కాపాడింది. భూ రికార్డులలో అనుభవదారుల వివరాలు తొలగించి పేదరైతుల పొట్టగొట్టింది. కౌలురైతులను గుర్తించనిరాకరించింది. పేదలకు, దళితులకిచ్చిన అస్సైన్‌మెంట్ భూములు తిరిగి స్వాధీనం చేసుకుంటున్నది. రైతుబంధు పేరుతో అత్యధిక నిధులు భూస్వాములు, ధనికరైతులకు కట్టబెడుతున్నది. ఎస్సీ, ఎస్టీలకు మూడెకరాల భూమి వాగ్దానం చేయలేదని తప్పించుకున్నది. దళితబంధు, చెరువుల్లో చేపలు వేయటం, గొర్రెల పంపకం లాంటి పథకాలతోనూ, గుడుంబ కాచే ప్రయత్నాలను అరికట్టి, కల్లు వాడకాన్ని నిరుత్సాహపరుస్తూ మద్యం వ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్నది. వీటన్నింటి ద్వారా దళితులు, వెనుకబడిన తరగతులలో క్రీమీలేయర్‌ను సంతృప్తిపర్చుతూ ఓటుబ్యాంకును భద్రపరుచుకునే ప్రయత్నంలో ఉన్నది. కార్మికశాఖను పూర్తిగా నీరుగార్చింది. రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచీ 73 షెడ్యూల్డ్ పరిశ్రమలలో కనీస వేతనాల సవరణను పక్కనబెట్టింది. ఈమధ్యనే ఐదు రంగాలలో సవరించినా, పెట్టుబడిదారుల అభ్యంతరం పేరుతో పక్కన పడేసింది.

మతోన్మాదం విషయంలో కూడా వామ పక్షాలు మాత్రమే నికరంగా పోరాడుతున్నాయి. గత సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ నాయకత్వం లౌకిక విధానాలన్న మాట ఉచ్చరించడానికే సిద్ధపడలేదు. పైగా రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలు బీజేపీ పోటీచేసే స్థానాలు వదిలి, వామపక్షాలు, ఇతర ప్రాంతీయ పార్టీల ఓటమి మీద కేంద్రీకరించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల సందర్భంగా కూడా రాహుల్‌గాంధీ బెంగాల్‌లో ప్రచారానికి విముఖత చూపారు. మరోవైపు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్రంతో లాలూచీ కుస్తీ కొనసాగిస్తున్నారు. టీడీపీ,

> ❝ ఇప్పటినుంచే ఎన్నికల వాతావరణం సృష్టించటం బూర్జువా పార్టీల అవసరం. ప్రజా ఉద్యమాల మీద కేంద్రీకరించటం కమ్యూనిస్టుల అవసరం. కష్టజీవుల అవసరం. మతోన్మాదశక్తుల మీద కూడా పోరాటం కష్టజీవుల అవసరం. ఇందుకోసం ప్రజలను కదిలించి పోరాడడానికి ఏ పార్టీ సిద్ధపడినా కదిలించవచ్చు. కానీ ఎన్నికల వాతావరణం, ఎన్నికల చర్చ బూర్జువాపార్టీలకే ప్రయోజనం. కమ్యూనిస్టుల సొంత పునాది పెరగటం కష్టజీవులకు అవసరం. అదే ఇప్పుడు కమ్యూనిస్టులకు చర్చనీయాంశం. ❞



జనసేనలు కూడా బీజేపీతో సన్నిహితంగానే వ్యవహరిస్తున్నాయి. ఈ పరిస్థితులలో దేశాన్ని రక్షించగల శక్తి వర్గపోరాటమే. దీనికి అండగా నిలబడగల శక్తి వామపక్షాలే. ఎర్రజెండా అండగా నిలిచే కార్మికవర్గ, రైతాంగ పోరాటాలు బీజేపీ, కాంగ్రెసులతో పాటు ప్రాంతీయ బూర్జువా పార్టీలకు కూడా గిట్టవు. అందుకే వామపక్షాలు ప్రజలతో మరింతగా మమేకం కావాలి. ప్రజలతో సంబంధాలు బలోపేతం చేసుకోవాలి. క్షేత్రస్థాయిలో ప్రజా పోరాటాల మీద, ప్రజా సమీకరణల మీద, సేవాకార్యక్రమాల మీద దృష్టి సారించాలి. బూర్జువా పార్టీలు వామపక్షాల మీద ఒలకబోసే ప్రేమకు అర్థాలు వేరు. ఎర్రజెండా ప్రజాపునాది బలంగా ఉన్నపుడు, ప్రతిష్ట పెరిగినపుడు దగ్గరవుతాయి. వామపక్షాల ప్రజాపునాదిని, ప్రతిష్టను తమ గెలుపు కోసం వాడుకుంటాయి. తమ అవినీతినీ, అప్రతిష్టనూ వామపక్షాలకు అంటిస్తాయి. వామపక్షాల పునాది చెదిరి, ప్రతిష్ట పలుచనైనపుడు, వీరితో బూర్జువాపార్టీలకు ఉపయోగం ఏముంటుంది? ఎందుకు ఖాతరు చేస్తారు? అంతేకాదు, గ్రామాలు, బస్తీలలో ప్రజలతో తలలో నాల్కగా కమ్యూనిస్టులు పనిచేస్తున్న 80వ దశకం వరకూ ఎర్రజెండా కార్యకర్తలను హత్యలు చేసేందుకు కాంగ్రెస్ ఏ మాత్రం వెనుకాడలేదు. బూర్జువాపార్టీలతో సావాసం మొదలై, గ్రామీణ ధనికవర్గాలతో పోరాటాల పదును తగ్గటంతో ఇప్పుడు దాడుల స్థానంలో నమస్కారాలు వస్తున్నాయి. కార్మికవర్గ పార్టీ శ్రేణులు ఈ మాయలో పడకూడదు. అంతమాత్రాన వీరందరినీ శాశ్వత శత్రువులుగా భావించనవసరం లేదు. కానీ ఎర్రజెండా సొంత ప్రజాపునాదినీ, ప్రజలలో ప్రతిష్టనూ పెంచుకోవటం కీలకం. బూర్జువా వర్గంలో అంతర్గత ఘర్షణలను వాడుకోగల్గిన స్థాయిలో వామపక్షాలు సొంత పునాదిని పెంచుకోవాలి. సీట్లు పంచుకోగల్గినంత పునాది మాత్రమే అయితే అది బూర్జువా పార్టీలకే ఉపయోగపడుతుందని తేలిపోయింది కదా! ఉద్యమాలకు గుర్తింపు రావల్సింది ప్రజలలో తప్ప ప్రభుత్వం దగ్గర కాదు. ప్రజా ఉద్యమం బలపడితే పాలకులు దిగిరాక తప్పదు. ప్రజాపునాది బలపడితే ప్రజాప్రతినిధులు ఎవరో భిక్ష వేయాల్సిన అవసరం లేదు. కార్పొరేట్ మీడియా గుర్తింపు కోసం భ్రమలు అవసరం లేదు. మీడియా విస్మరించజాలని స్థాయిలో ప్రజా పోరాటాలు నిర్మించటం, సేవాతత్పరత ప్రదర్శించటమే మార్గం.

తెలుగు రాష్ట్రాలలో ప్రస్తుతం కమ్యూనిస్టు పార్టీల మహాసభల సందర్భంగా చర్చించవల్సిన అంశాలు ఇలాంటివే. బీజేపీ నాయకత్వం పదాధికారుల సమావేశాలు నిర్వహించింది. టీఆర్ఎస్ నాయకత్వం ద్విదశాబ్ది ఉత్సవాలు జరిపింది. ఇవన్నీ అధికారం కోసం. ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకోవటం కోసం. కమ్యూనిస్టులు మహాసభలలో ప్రస్తుతం చర్చించేది అధికారం ఎజెండాతో కాదు. అలాంటపుడు ఎవరికి ఓటేయాలో తేల్చుకోడానికా? అదికూడా కాదు. ఎవరికి ఓటేసినా గెలిచేది బూర్జువా పార్టీలే. బలపడేదీ బూర్జువా పార్టీలే. వామపక్షాల బలం పెంచుకునే మార్గం అన్వేషించటమే కమ్యూనిస్టు పార్టీ మహాసభలకు ప్రధాన ఎజెండా కావాలి. పార్లమెంటులోనో, అసెంబ్లీలోనో బలం పెంచుకోవటం గురించి కాదు, ప్రజాబలం పెంచుకోవటం గురించి చర్చించాలి. ప్రజాబలం పెరిగితే చట్టసభల్లో స్థానాలు రాకుండా ఎవరూ ఆపలేరు. యాభైయవ దశకంలో ఆంధ్ర ప్రాంతంలోగానీ, తెలంగాణ ప్రాంతంలోగానీ కమ్యూనిస్టులు గెలిచిన శాసనసభ స్థానాలే ఇందుకు నిదర్శనం.

ఎవరికి ఓటేయాలో, బీజేపీని ఎట్లా ఓడించాలో ఎన్నికల సమయంలో నిర్ణయించుకోవచ్చు. ఇప్పటినుంచే ఎన్నికల వాతావరణం సృష్టించటం బూర్జువా పార్టీల అవసరం. ప్రజా ఉద్యమాల మీద కేంద్రీకరించటం కమ్యూనిస్టుల అవసరం. కష్టజీవుల అవసరం. మతోన్మాదశక్తుల మీద కూడా పోరాటం కష్టజీవుల అవసరం. ఇందుకోసం ప్రజలను కదిలించి పోరాడడానికి ఏ పార్టీ సిద్ధపడినా కదిలించవచ్చు. కానీ ఎన్నికల వాతావరణం, ఎన్నికల చర్చ బూర్జువాపార్టీలకే ప్రయోజనం. కమ్యూనిస్టుల సొంత పునాది పెరగటం కష్టజీవులకు అవసరం. అదే ఇప్పుడు కమ్యూనిస్టులకు చర్చనీయాంశం.

❃

సర్వే

# వృద్ధి కిందికి దిగడం లేదని తేల్చిన కుటుంబ సర్వేలు

**టికె రాజలక్ష్మి**



రచయిత సీనియర్ జర్నలిస్టు, రచయిత

గత సెప్టెంబర్ మాసంలో రెండు ప్రధాన గణాంకాలు వెలువడ్డాయి. ఒకటి, జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ ఎస్ ఓ) గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ జరిపిన సర్వే నివేదిక; రెండు, ఎనిమిదవ అఖిల భారత అప్పులు–పెట్టుబడుల సర్వే (ఏ ఐ ఏ డి ఎస్). భారతదేశంలో గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ కుటుంబాల పరిస్థితులు భూమి, పశు సంపద గణాంకాల నివేదిక. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో కొట్టొచ్చినట్టు కనిపించే సామాజిక, ఆర్థిక వ్యత్యాసాలను, కింది తరగతుల ప్రజలు అప్పుల ఊబిలో కూరుకు పోతుండడాన్ని, కొద్దిమంది అధీనంలో ఆస్తులు పోగుపడుతుండడాన్ని ఈ రెండు సర్వేలు తెలియచేస్తున్నాయి.

నేషనల్ శాంపిల్ సర్వే (ఎన్ ఎస్ ఎస్) 77వ రౌండ్‌లో భాగంగా ఏఐఏడిఎస్ జరిగింది. ఇది 2019 జనవరి నుండి డిసెంబర్ మధ్య కాలంలో నిర్వహించబడింది. అంటే మహమ్మారి రావడానికి ఏడాది ముందన్నమాట. ఈ సర్వేలో 5,940 గ్రామాలలోని 69,455 గ్రామీణ కుటుంబాలను, పట్టణాలలో 3,995 బ్లాకుల్లో, 47,003 కుటుంబాలను పరిశీలించారు. 77వ రౌండ్లో మరిన్ని ఆర్థిక సూచికలను, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సూచించే సూచికలను, ఉదాహరణకి కుటుంబాల బ్యాంక్ డిపాజిట్లు, క్రెడిట్, డెబిట్ కార్డులు కలిగి ఉండడం, ప్రతి కుటుంబం గత 365 రోజులలో ఉపయోగిస్తున్న ఈ–వాలెట్‌ల వివరాలు, స్థలాలు, భూములు కలిగి ఉండడం, ప్రభుత్వ బీమా, సాధారణ బీమా, వివిధ పెన్షన్ స్కీములకు కడుతున్న చందాలు, కుటుంబంలో మహిళల పేరు మీద ఉన్న భూమి, నెలలో సరాసరి పెడుతున్న ఖర్చుల వివరాలు కూడా సేకరించారు.

ఏఐఏడిఃఎస్ నివేదిక నిడివి 2,000 పేజీలు ఉంది. ఇందులో 99.4 శాతం గ్రామీణ కుటుంబాలు, 97.5 శాతం పట్టణ కుటుంబాలు భౌతిక రూపంలో ఆస్తులు కలిగి ఉన్నట్లు పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాలలో 94.7 శాతం, గ్రామీణ ప్రాంతాలలో 85.4 శాతం మంది భౌతికమైన ఆస్తులు కలిగి ఉన్నట్టు తెలియచేస్తున్నది.

భారతదేశంలో గ్రామీణ ప్రాంతంలో ఉన్న వయోజనులు 84.4 శాతం, పట్టణ ప్రాంతాలలో ఉన్న వయోజనులు 85.2 శాతం తమ నిధులను బ్యాంకులలో దాచుకున్నారని, అలా దాచుకున్న వారిలో మహిళలకన్నా పురుషులే ఎక్కువ సంఖ్యలో ఉన్నారని ఆర్థిక సేవల వినియోగం గురించిన సర్వే తెలియచేస్తున్నది. ఏఐఏడిఎస్ నివేదిక ప్రకారం 35 శాతం గ్రామీణ కుటుంబాలకు, 22 శాతం పట్టణాలలో నివసించే కుటుంబాలకు అప్పులు న్నాయి. 'సార్వజనీనం'గా అన్ని సామాజిక తరగతులు–షెడ్యూల్డ్ కులాలు, ఆదివాసీలు, ఇతర వెనుక బడిన తరగతులు, ఇతరులు – ఆస్తులను కలిగి ఉన్నట్టు సర్వే తెలియచేస్తున్నది.

**పాతుకుపోయిన అసమానతలు**

లోతుగా పాతుకుపోయిన అసమానతలను, మౌలికమైన ఆర్థిక సంబంధాలలో విభజనను, మొత్తంగా వ్యవస్థ నిర్మాణంలో ఉండే అసమానతలను ఈ సర్వే మరుగుపరిచింది. ప్రజలందరూ ఆస్తిపరులుగా ఉన్నారని సూచించడం ఫలితాలను తప్పుదారి పట్టించడమే. ఎందుకంటే ప్రజలందరి వద్ద ఉన్న ఆస్తులు ఒకే రకమైనవి కావు. వాటి విలువలో, రూపంలో, స్వభావంలో కూడా చాలా వ్యత్యాసాలు ఉన్నాయి. పైగా ఆస్తులు కలిగి ఉన్న వివిధ తరగతుల ప్రజల మధ్య, ఆస్తుల విలు వలలో, స్వభావాలలో కూడా చాలా తేడాలు ఉన్నాయి.

ఈ సర్వేల ప్రకారం భారతదేశంలోని పట్టణాలలో సగటున కుటుంబ ఆస్తి, రూ॥27,17,000 ఉండగా గ్రామాలలో రూ 15,92,00 ఉంది. అంటే గ్రామాలలోని వారికంటే కంటే పట్టణాలలోని వారి వద్ద 1.7 రెట్లు అధికంగా ఆస్తులున్నాయి.

తరగతుల వారీగా పరిశీలిస్తే 'ఇతరుల' సగటు కుటుంబ ఆస్తుల విలువ పట్టణాలలో రూ॥ 40,54,000 ఉండగా, గ్రామాలలో రూ॥ 26,03,000 ఉన్నది. ఇది షెడ్యూల్డ్ తరగతుల వారి సరాసరి ఆస్తులకు మూడు రెట్లు అధికంగా ఉన్నది. షెడ్యూల్డ్ కులాలలో కుటుంబాల సరాసరి ఆస్తుల విలువ గ్రామాలలో రూ॥ 8,79,000 ఉండగా, పట్టణాలలో రూ 13,15,000 ఉన్నది. షెడ్యూల్డ్ తెగల కుటుంబ ఆస్తుల విలువ గ్రామాలలో రూ॥8,84,000 ఉండగా పట్టణ ప్రాంతాలలో రూ॥ 18,90,000 ఉన్నది.

గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఇతర వెనుకబడిన తరగతుల పరిస్థితి కొంత మెరుగుగా ఉన్నది. వీరికి సగటున గ్రామీణ ప్రాంతాలలో రూ॥16,45,000, పట్టణ ప్రాంతాలలో రూ॥21,20,000 విలువైన కుటుంబ ఆస్తులు ఉన్నాయి. అయితే ఇతర వెనుక బడిన తరగతులు కూడా భారతదేశంలోని 'ఇతరుల' కన్నా చాలా వెనుకబడి ఉన్నారు.

భారతదేశంలో 'ఇతరుల' వద్ద భౌతిక రూపంలో గాని, ద్రవ్య రూపంలో గాని ఉన్న కుటుంబ సంపదల విలువ చూసినప్పుడే అసమానతలు ఏ స్థాయిలో ఉన్నాయో మనకు అర్థం అవుతుంది. ఏ ఐ ఏ డి ఎస్ అందించిన గణాంకాల ప్రకారమే గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో కూడా పైస్థాయిలో ఉన్న 10 శాతం, ఆ తరువాత ఉన్న 10 శాతం కన్నా మూడు రెట్లు అధిక సంపదలు కలిగి ఉన్నారు.

భారతదేశంలోని పట్టణ ప్రాంతంలో పైస్థాయిలో ఉన్న 10 శాతం సరాసరిన రూ॥1,50,35,000 ఆస్తులను కలిగి ఉంటే గ్రామీణ ప్రాంతంలో రూ॥81,17,000 ఆస్తులు కలిగి ఉన్నారు.

ఇందుకు బిన్నంగా ఆ తరువాతి 10 శాతం పట్టణ ప్రాంతంలో రూ॥47,41,000, గ్రామీణ ప్రాంతంలో రూ॥26,13,000 ఆస్తులను కలిగి ఉన్నారు. పైస్థాయిలో ఉన్న 10

శాతానికి, ఆ తరువాతి 80 శాతానికి మధ్య తేడా క్రమంగా పెరుగుతూ పోతున్నది. కిందికి పోతున్న కొద్దీ తేడా మరింతగా పెరుగుతున్నది. ఫలితంగా పైస్థాయిలో ఉన్న 10 శాతం గ్రామీణ ప్రాంతంలో 50.84 శాతం, పట్టణ ప్రాంతంలో 55.67శాతం ఆస్తులు కలిగి ఉన్నారు. కిందిస్థాయి 70 శాతం కుటుంబాలు గ్రామీణ ప్రాంతాలలో కేవలం 22.63 శాతం, పట్టణ ప్రాంతాలలో 17.53 శాతం ఆస్తులను మాత్రమే కలిగి ఉన్నారు.

ఆస్తులు తగ్గుతున్న కొద్దీ ఆ ఆస్తుల పై ఉన్న అప్పుల నిష్పత్తి పెరుగుతుండడం ఏఐఏడిఎస్ సర్వేలో స్పష్టంగా కనిపించే మరో అంశం. గ్రామీణ ప్రాంతంలో అన్ని తరగతుల సరాసరి అప్పులు–ఆస్తుల నిష్పత్తి 3.8 శాతంగా ఉంది. కానీ కింది 10 శాతం ప్రజలలో ఈ నిష్పత్తి 39.1శాతంగా ఉంది. పైస్థాయిలో ఉన్న 10 శాతంకు 2.8 శాతంగా ఉంది. భారతదేశంలో పట్టణ ప్రాంతంలో ఆస్తులు, అప్పుల నిష్పత్తి సరాసరి 4.4 శాతం ఉండగా, కింది 10 శాతం వారి అప్పు ఆస్తుల కంటే అయిదున్నర రెట్లు అధికంగా ఉంది. అంటే తక్కువ ఆస్తులు ఉన్నవారు అప్పులు తీర్చడానికి తమ ఆస్తులు కోల్పోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

### సరాసరి అప్పు

అత్యధిక ఆస్తులు కలిగిన వారి అప్పుల స్థాయి అధికంగా ఉన్నప్పటికీ, అప్పులు–ఆస్తుల కథ ఈ విధంగా ఉంది. భారతదేశంలో పట్టణ ప్రాంతాలలో సరాసరి కుటుంబ అప్పులు (రూ॥1,20,336) గ్రామీణ ప్రాంతాలలో కన్నా (రూ॥59,748) ఎక్కువగా ఉన్నది. సామాజిక తరగతుల వారీగా చూస్తే గ్రామాలు, పట్టణాలలో కూడా కుటుంబ అప్పులు 'ఇతరుల'లో అత్యధికంగా ఉన్నాయి. షెడ్యూల్డ్ తరగతులలో అందరికన్నా తక్కువగా ఉన్నాయి.

ఏఐఏడిఎస్ గణాంకాల ప్రకారం అధిక మొత్తంలో ఆస్తులు కలిగిన వారు సంస్థాగత రుణాలు (ప్రభుత్వ బ్యాంకులు, ఇతర ప్రభుత్వ ఆర్థికసంస్థలు) ఎక్కువగా తెచ్చుకున్నారు. ఇతర విధాలైన అప్పులు తక్కువగా తీసుకుంటున్నారు. అంటే భారతదేశంలో అతి తక్కువ మందిగా ఉన్న స్థితిమంతుల (స్థిర చరాస్తులున్నవారు) అధీనంలో ఆస్తులు ఎక్కువగా ఉండడమే కాక ఆస్తులు సంపాదించుకోవటం కోసం తక్కువ వడ్డీకి రుణాలు పొందుతున్నారు. అంటే వారికి రెండు వైపులా ప్రయోజనకరంగా ఉందన్న మాట.

### సొంత భూమి

ఆస్తుల పొందిక తెలుసుకున్నప్పుడే

> **❝ గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక కుటుంబాలకు (42 శాతం) స్వంతభూమి లేదు. అత్యల్ప సంఖ్యలో ఉన్న కొన్ని కుటుంబాలకే ఎక్కువ భూమి ఉంది. భూమి కలిగిన వారి అధీనంలో కూడా భూమి చాలా పరిమితంగా ఉంది. 70.4 శాతం వ్యవసాయ కుటుంబాలు, 98.9 శాతం వ్యవసాయేతర కుటుంబాలు రెండున్నర ఎకరాల కన్నా తక్కువ భూమిని కలిగి ఉన్నాయి. కేవలం 0.4 శాతం వ్యవసాయ కుటుంబాలు 25 ఎకరాల కన్నా ఎక్కువ భూమిని కలిగి ఉన్నాయి. ❞**

వృద్ధి పైనుండి కిందికి ప్రవహిస్తుందన్న సిద్ధాంతం ఒట్టి బూటకం




అసమానతల స్థాయి బాగా అర్థం అవుతుంది. ఏఐఏడిఎస్ గణాంకాల ప్రకారం, కుటుంబాల ఆస్తులలో అత్యధిక భాగం భూమి, భవనాల రూపంలో ఉంది. గ్రామీణ ప్రాంతంలోని కుటుంబాల ఆస్తుల విలువలో 69.2 శాతం, పట్టణాలలో 49.4 శాతం భూమి రూపంలో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతంలో 22.3 శాతం, పట్టణాలలో 37.5 శాతం భవనాల రూపంలో ఉంది. అంటే ఈ రెండు రకాల ఆస్తులే (భూమి, భవనాలు) గ్రామీణ ప్రాంతాలలో 91.5 శాతం, పట్టణ ప్రాంతాలలో 86.9 శాతంగా ఉన్నాయి. మిగిలినది ద్రవ్య సంపదలు, యంత్రాలు, పరికరాల రూపంలో ఉన్నాయి.

భవనాలు ఆస్తులుగా గలవారిలో ఎక్కువ భాగం వాటిలోనే నివాసముంటున్నారు. భూమి విషయానికి వస్తే గ్రామాలలో 80 శాతం కుటుంబాలకు, పట్టణాలలో 30 శాతం కుటుంబాలకు దాదాపు భూమి లేదు. మరో 50 శాతానికి చాలా తక్కువ భూమి ఉంది.

పట్టణాలలో నివసించే పైస్థాయిలో ఉన్న 10శాతం కుటుంబాలకు ఆ తరువాతి 10శాతం కుటుంబాల కంటే సరాసరిన మూడు రెట్లు అధికంగా భూమి ఉంది. ఇంకా ఆశ్చర్యకరమైన విషయమేమంటే పట్టణాలలో పైస్థాయిలో ఉన్న 10 శాతం అధీనంలో గ్రామీణ భారతదేశంలోని అత్యధిక భూమి ఉంది. సరాసరిన గ్రామీణ ప్రాంతాలలోని 29.2 శాతం భూమి ఈ కుటుంబాల అధీనంలో ఉంది. గ్రామీణ ప్రాంతంలో నివసించే 80 శాతం కుటుంబాల అధీనంలో ఉండే భూమి కంటే ఇది చాలా ఎక్కువ.

గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ ఆస్తులు ఉన్నవారు భూమి కలిగి ఉండడం సాధారణమైన విషయం. దాదాపు అన్ని కుటుంబాలకు భూమి ఉంది. గ్రామీణప్రాంతంలో ఉండే భూమిలో అత్యధిక భాగం వ్యవసాయ భూమే. భూమి కలిగి ఉండడం అంటే వ్యవసాయ భూమిపై యాజమాన్యం కాదు.

### పరిస్థితుల అంచనా సర్వే వివరాలు

భారతదేశంలో గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ కుటుంబాల పరిస్థితుల అంచనా, భూమి, పశుసంపదల గణాంకాల నివేదిక 2019 ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక

**"పట్టణ ప్రాంతంలో కన్నా గ్రామీణ ప్రాంతంలోనే అప్పల భారం ఎక్కువగా ఉంది. అది కూడా వ్యవసాయం చేస్తున్న కుటుంబాల అప్పులు 40.3 శాతం ఉండగా వ్యవసాయేతర కుటుంబాల అప్పులు 28.2 శాతం ఉన్నాయి. వ్యవసాయం చేసే కుటుంబాల అప్పులలో 55.7 శాతం వ్యవసాయం కోసం చేసినవే."**

కుటుంబాలకు (42 శాతం) స్వంతభూమి లేదు. అత్యల్ప సంఖ్యలో ఉన్న కొన్ని కుటుంబాలకే ఎక్కువ భూమి ఉంది. భూమి కలిగిన వారి అధీనంలో కూడా భూమి చాలా పరిమితంగా ఉంది. 70.4 శాతం వ్యవసాయ కుటుంబాలు, 98.9 శాతం వ్యవసాయేతర కుటుంబాలు రెండున్నర ఎకరాల కన్నా తక్కువ భూమిని కలిగి ఉన్నాయి. కేవలం 0.4 శాతం వ్యవసాయ కుటుంబాలు 25 ఎకరాల కన్నా ఎక్కువ భూమిని కలిగి ఉన్నాయి. 25 ఎకరాల కన్నా ఎక్కువ భూమికల వ్యవసాయేతర కుటుంబాలు లేనేలేవు. తక్కువ మొత్తంలో భూమి ఉన్నవారు 83.7 శాతం ఉన్నారు. అంటే గ్రామీణ ప్రాంతాలలో సొంత భూమి గల వ్యవసాయ, వ్యవసాయేతర కుటుంబాలు చాలా తక్కువగా ఉన్నాయి.

స్వాతంత్రం వచ్చి ఇన్నేళ్లు గడిచినా సామాజిక తరగతుల వారీగా చూసుకుంటే భూమిహక్కుల విషయంలో పెద్దగా మార్పులేమీ జరగలేదు. ఇతర వెనుకబడిన కులాలకి ఒక మోస్తరుగా భూ బదలాయింపు జరిగింది. మొత్తం భూమిలో షెడ్యూల్డ్ తరగతులు – గిరిజనులు 14.1 శాతం, షెడ్యూల్డ్ కులాలు 10.2 శాతం, ఇతర వెనుకబడిన కులాలు 47.2 శాతం భూమి కలిగి ఉండగా, 'ఇతరులు' 28.5 శాతం భూమి కలిగి ఉన్నారు.

ఆదాయాలను సమకూర్చగల సంపదలు దాదాపుగా పై కులాల చేతిలో కేంద్రీకరించబడి ఉన్నాయి. చారిత్రకంగా, సామాజికంగా అవే అధిపత్యకులాలుగా ఉన్నాయి. సంపద సృష్టించని ఆస్తులు, అంటే నివసించేందుకు స్వంతంగా ఒక ఇల్లు ఉండడాన్ని చూపి, సంపద పంపిణీలో ఉన్నవాస్తవ పరిస్థితి మరుగు పరిచారు. వాస్తవంగా ఉన్నదాని కంటే సంపద పంపిణీ మరింత సమర్థవంతంగా జరుగుతున్నట్టు చూపించారు. సంపదల పంపిణీలో కేవలం అసమానతలను చూపిన ఏఐడిఐఎస్ గణాంకాలు వాస్తవ పరిస్థితిని మార్చి చూపాయి. భారతదేశంలో కొద్ది మంది ప్రజలు అత్యధిక శాతం ఆస్తులకు యజమానులు కాగా అత్యధికులు ఏ రకమైన ఆస్తిపాస్తులు సంపాదించుకోలేని పరిస్థితులలోకి నెట్టబడ్డారు.

వృత్తుల వారీగా ఏఐడిఐఎస్ గణాంకాలను పరిశీలిస్తే, గ్రామీణ భారతదేశంలో 57 శాతం వ్యవసాయ వృత్తి చేయనివారు, 43 శాతం వ్యవసాయం వృత్తిగా ఉన్న కుటుంబాలు ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో 74 శాతం స్వయం ఉపాధి పొందేవారు ఉన్నారు. 26 శాతం మాత్రమే కూలిచేసేవారు, ఉద్యోగాలు చేసి జీతాలు పొందేవారు, కాజువల్ కార్మికులు, ఇతరులు ఉన్నారు. వ్యవసాయం చేయని వారికన్నా (రూ॥ 7,07,000) వ్యవసాయం చేసే వారికి (రూ॥22,07,000) ఎక్కువ ఆస్తులపై యాజమాన్యం ఉంది. స్వయం ఉపాధి పొందుతున్న వారికి (రూ॥41,51,000) ఇతరుల కన్నా (రూ॥22,11,000) ఎక్కువ ఆస్తులపై యాజమాన్యం ఉంది.

### గ్రామీణ రుణగ్రస్తత

ఏఐడి ఐఎస్ గణాంకాలు గ్రామీణ, పట్టణ రుణగ్రస్తతను కూడా సూచించాయి. పట్టణ ప్రాంతంలో కన్నా గ్రామీణ ప్రాంతంలోనే అప్పల భారం ఎక్కువగా ఉంది. అది కూడా వ్యవసాయం చేస్తున్న కుటుంబాల అప్పులు 40.3 శాతం ఉండగా వ్యవసాయేతర కుటుంబాల అప్పులు 28.2 శాతం ఉన్నాయి. వ్యవసాయం చేసే కుటుంబాల అప్పులలో 55.7 శాతం వ్యవసాయం కోసం చేసినవే.

అందువలన ఆదాయాలు సృష్టించే సంపదలు అతి తక్కువగా ఉండి, అత్యధిక రుణభారం కలిగి ఉండడం ఈ నాటి వ్యవసాయ కుటుంబాలలో సర్వసాధారణమైన విషయంగా మారింది. స్వయం ఉపాధి పొందుతున్న వారి పరిస్థితి కూడా వేతనాలు సంపాదిస్తున్న కుటుంబాల కంటే భిన్నంగా లేదు. ఎస్ఏఎస్ నివేదిక ప్రకారం వ్యవసాయం, వృత్తిదారుల కుటుంబాల సరాసరి ఆదాయాలు ఒకే విధంగా ఉన్నాయి. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే కూడా దీనినే ధృవ పరుస్తున్నది.

ఎన్ఏఎస్ గణాంకాల ప్రకారం వ్యవసాయ కుటుంబాల సరాసరి ఆదాయం కేవలం రూ॥10,218 మాత్రమే. 90 శాతం కుటుంబాలు దీనికి అటు ఇటుగానే ఆదాయాలు కలిగి ఉన్నాయి. పంటల ఉత్పత్తి నుండి నికర ఆదాయాలు రూ॥3,798 కోట్లు కాగా వేతనాల నుండి రూ॥4,063 కోట్లు, భూమిని కౌలుకి ఇవ్వడం వలన రూ॥ 134 కోట్లు, పశువుల పెంపకం వలన రూ॥1,582 కోట్లు, వ్యవసాయేతర వ్యాపారాల ద్వారా రూ॥ 641 కోట్ల ఆదాయాలు పొందుతున్నారని ఎస్ఏఎస్ తెలియచేస్తున్నది

2017-18, 2018-19 సంవత్సరాలలో స్వయం ఉపాధి కార్మికుల ఆదాయాలు సరాసరిన రూ॥ 10,000/– నుండి రూ॥ 12,000 ఉండేవని పిఎల్ఎఫ్ఎస్ గణాంకాలు తెలియచేస్తున్నాయి. అందువలన భారతదేశంలో అత్యధికులు ఆస్తులు లేనివారిగానే గుర్తించ బడతారు.

భారతదేశంలో సంపదల పంపిణిలో అసమానతలు ఆదాయాలలో అసమానతలుగా మారుతున్నాయి. ఈ రెండు రకాల భారత దేశాల మధ్య దూరం నానాటికి పెరుగుతున్నదంటే ప్రభుత్వం దీనిని తగ్గించడానికి ఏ విధమైన చర్యలు తీసుకోవటం లేదని, పెరగడానికి తన వంతు పాత్ర నిర్వహిస్తున్నదని స్పష్టమౌతున్నది.

2019 ఎన్నికలలో విజయం సాధించిన తరువాత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భారతదేశంలో నిజమైన విభజన లేనే లేదు, కేవలం పేదరికం నుండి బయట పడాలను కుంటున్న వారికి, పేదరికం నుండి తమను ఎవరైనా పడేస్తారా అని ఎదురు చూసేవారికి మధ్య మాత్రమే బేధం ఉందని అన్నారు. సృష్టిస్తున్న సంపద పైకి చేరితే అది కిందికి జాలు వారుతుందని, దిగువస్థాయిలోని ప్రజల ఆదాయాలు పెరగటానికి దారి తీస్తుందనేది భావనే ఒక ఊహ మాత్రమే. సరళీకరణ విధానాలు అమలుజరుగుతున్న గత 30 సంవత్సరాల కాలంలో ఇది ఏనాడూ వాస్తవరూపం దాల్చలేదు. కేవలం సంపద కేంద్రీకరణ పెరగడాన్ని సమర్థించుకునేందుకు, దిగువస్థాయిలోని ప్రజలను మభ్యపెట్టటానికి మాత్రమే ఉపయోగపడింది.

**(అనువాదం: కె ఉషారాణి)**

# అభిప్రాయం

## ఆలోచింపజేసిన వ్యాసం

మార్క్సిస్టు పత్రిక ఎడిటర్ గారికి నమస్కారము, అక్టోబర్ నెల మార్క్సిస్టులో "నెల్లూరు నగర కమిటీల అనుభవాల గురించి కామ్రేడ్ మధుగారి వ్యాసం, మన పార్టీ కార్యకర్తలందరినీ ఆలోచింప చేసేదిగానూ, ఉపయోగపడేదిగానూ ఉన్నది. కామ్రేడ్ మధుగారికి అభినందనలు.

మన చుట్టూ ఉన్న వర్గేతర పార్లమెంటరీ రాజకీయాలు భ్రష్టుపడుతున్నాయి. నిజమైన రాజకీయాలు ప్రజల జీవితాలను, సమస్యలను పరిష్కరించి బాగుచేయడానికే ఉన్నాయనే వాస్తవాన్ని ప్రక్కదారి పట్టిస్తున్నాయి. డబ్బే సర్వస్వమనే వాతావరణాన్ని కల్పిస్తున్నాయి. మన రాష్ట్రంలో నడుస్తున్న అధికార, ప్రతిపక్ష తిట్ల రాజకీయాలు చాలా మంది ప్రజల అసహ్యానికి గురి అవుతున్నాయి. ప్రజల సమస్యలు చర్చకు రావడం లేదు.

ఈ నేపథ్యంలో వామపక్షాల, సెక్యూలర్ ప్రజాతంత్ర పార్టీల పాత్ర చాలా ఉన్నది. పార్లమెంటరీ భ్రమల నుంచి ప్రజలను మేల్కొలుపుతూ, వర్గ రాజకీయాలవైపు ప్రజలను ఆకర్షించే ప్రయత్నాలను వామపక్షాలు ఇంకా ఉధృతంగా చేపట్ట వలసి ఉన్నది. కామ్రేడ్ యం.బి గారు ఒక సందర్భంలో చెప్పినట్లు రాజకీయాలు లెక్కలలో అల్‌జీబ్రా కంటే సంక్లిష్టమైనవి. అంత తేలికగా అర్థంకావు. అందువలన వర్గ రాజకీయాలను మరింతగా సరళతరం చేసి, తేలిక భాషలో బోధించే ప్రయత్నాలకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. మార్క్స్, ఏంగెల్స్, లెనిన్ రచనలు, ముఖ్యంగా "మార్క్సిజానికి మూడు మూలాధారాలు", 'ఏమి చేయాలి', "సామ్రాజ్యవాద రూపమైన ప్రపంచీకరణ, తదితర అంశాలపై వ్యాసాలు, క్షేత్రస్థాయి కార్యకర్తలకు అర్థమయ్యే విధంగా స్టడీ సర్కిల్స్‌లో వర్తమాన సమస్యలతో పాటు చర్చలు జరపడానికి ప్రణాళికా బద్ధంగా కృషి జరగాలి. నెల్లూరు కమిటీల స్టడీ సర్కిల్స్ అనుభవాలు అందరికీ ఉపయోగపడతాయి.

అభినందనలతో
**మహమ్మద్ అక్బర్**
గుంటూరు.

# 75 సంవత్సరాల స్వాతంత్ర్యం: పరిణామాలు

**(11వ పేజీ తరువాయి)**

ఉత్పత్తి సంబంధాలు, ఆర్థిక దోపిడికి, హిందు త్వ ఆధిపత్యం బలపడటానికి వ్యతిరేకంగా పౌర సమాజంలో జరుగుతున్న పోరాటాలతో కలిసి, రాజకీయ కార్యకలాపాల ద్వారా నూతన సంస్కృతిని సృష్టించి, హిందుత్వకు వ్యతిరేకంగా సమాజంపై ఆధిపత్యం సాధించాలి. కార్మికవర్గం, రైతులు, మహిళలు, దళితులు, ఆదివాసులు, యువత, విద్యార్థులు, తదితరులు వర్గదోపిడీకి వ్యతిరేకంగా చేస్తున్న మౌలిక పోరాటాలను బలపరచటం ఆధారంగా ప్రత్యామ్నాయ ఆధిపత్యం సాధించాలి. ఈ పునాదిపై ఆధారపడి మన విప్లవ లక్ష్యమైన సోషలిజం వైపు సాగిపోవటం కోసం జనతా ప్రజాస్వామ్యాన్ని సాధించటం ద్వారా ముందుకుసాగాలి.

ఈ పోరాటాల బలంతో చారిత్రాత్మకమైన స్వాతంత్ర్య పోరాటంలో కలిసి వచ్చిన తరగతుల ప్రజానీకాన్ని కలుపుకొని, మరింత విశాలమైన ఐక్యతను నిర్మించటం ద్వారా రేపు మరింత గొప్పదేశంగా మార్చటం కోసం నేటి భారతదేశాన్ని కాపాడుకోవాలి. 75వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకొనే సందర్భంలో భారతదేశం 'ఘనమైన హిందు నాగరికత' గా హిందుత్వ శక్తులు ప్రచారం చేస్తున్న మధ్యయుగాల చీకటి, వెనుకబాటు తనంలోకి పోతుందా లేక భవిష్యత్ దృక్పథంతో కూడిన, ప్రపంచాన్ని ప్రభావితం చేసే ఆధునిక భారతదేశంగా మారుస్తామా అన్నది మన ముందున్న సవాల్.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

# ఆగ్జిలరీల ఏర్పాటు, నిర్వహణ: తెలంగాణా అనుభవాలు

( 14వ పేజీ తరువాయి)

గ్రామాల ప్రజలు గమనించడానికి ఉపయోగపడుతున్నాయి. మనం చేసే ఈ కృషివలన పాలకపార్టీల గ్రామ నాయకులు, ప్రజలకు జవాబు చెప్పాల్సిన పరిణామాలకు దారితీస్తున్నాయి. గ్రామలలో భావ ఘర్షణ ప్రారంభమవుతున్నది. దీనితోపాటు కార్యక్రమాలు జరిగే గ్రామాల సంఖ్య కూడా పెరుగుతున్నది. ఉదాహరణకు అక్టోబర్ నెలలో ఖమ్మం జిల్లాలో మధిర నియోజకవర్గంలో 163 గ్రామాలుంటే 68 గ్రామాలలో ఆగ్జిలరీ గ్రూపులు, పార్టీ గ్రూపులు కలిసి ఒకేరోజు లఖీంపూర్ ఘటనకు నిరసనగా దిష్టిబొమ్మల దగ్ధం, కొవ్వొత్తుల ప్రదర్శనలు లాంటివి జరిగాయి. వైరా నియోజకవర్గంలో 66 గ్రామాలలో జరిగాయి. పాలేరు నియోజకవర్గంలో 62 గ్రామాలలో జరిగాయి. దాదాపు అన్ని గ్రామాలలో జరిగే కార్యక్రమాలను వాట్సాప్ గ్రూపులలో, ఫేస్‌బుక్‌ల్లో పోస్టు చేస్తున్నారు. మేడే, మే19 పియస్ వర్ధంతి లాంటి కార్యక్రమాలు తప్ప గతంలో ఒకేరోజు ప్రజాసమస్యలపై గ్రామస్థాయి లో ఇంత పెద్ద సంఖ్యలో జరుగలేదు.

ఇక ఆగ్జిలరీ గ్రూపు ఆర్గనైజర్లుగా ఉన్నది పూర్తికాలం కార్యకర్తలే కాబట్టి, మన నెలవారీ సమీక్షల వల్ల మనం నిర్ణయించుకొన్నట్లు వీరి పని ఉన్నదా లేదా అని పరిశీలించబడుతున్నది. వీరిని కూడా కేటగిరీ చేసి ఆయా కమిటీలలో రిపోర్టులు పెట్టే భాద్యత ఆగ్జిలరీ స్టేట్ ఇన్-ఛార్జిదవుతున్నది. దీనివలన ఆ కేడర్, ఈ కేడర్ అప్రమత్తంగా పరిశీలనలోనూ, పనిలోనూ ఉంటున్నారు.

ఆగ్జిలరీ గ్రూపులకు సంబంధించి జరుగుతున్న కృషిని ఎప్పటి కప్పుడు రాష్ట్ర సెక్రటేరియట్, రాష్ట్ర కమిటి, జిల్లా పరిధిలోని విషయాలను జిల్లా కమిటీలలో చర్చించడం జరుగుతున్నది.

మార్క్సిస్టు, నవతెలంగాణా, ప్రజా సమస్యలపై కార్యక్రమాలు, రాజకీయ చర్చలు, స్టడీ సర్కిల్స్, సోషల్ మీడియా, ఇలా బహు ముఖంగా ఈ కృషి సాగుతున్నది. పూర్తికాలం కార్యకర్తల పని కూడా నెలవారీ సమీక్ష జరుగుతున్నది. మొత్తం కమిటీలు ఈ కృషిని ఇప్పుడు పార్టీ శాఖలపై కూడా పెట్టాలని రాష్ట్ర కమిటి నిర్ణయించింది. అప్పుడు మాత్రమే శాఖలను సర్వసన్నద్ధం చేయగలమనే అభిప్రాయం వచ్చింది. మరో సందర్భంలో ఆ అనుభవాలను కూడా పంచుకొందాము. ❇

నివేదిక

# 'దేశ ద్రోహి' నామ సంవత్సరం

## భారత దేశంలోని నేరాలపై ఎన్‌సిఆర్‌బి 2020 నివేదిక

**దివ్య త్రివేది**

**2020** లో భారతదేశంలో జరిగిన నేరాలు అని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్ సి ఆర్ బి) విడుదల చేసిన జాబితా లో "దేశ వ్యతిరేక నేరాల" లో ఒక్కసారిగా గణనీయమైన పెరుగుదల కనిపించింది. కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా ఆగస్టులో, లక్నో లో మాట్లాడుతూ ఆదిత్యనాధ్ ప్రభుత్వం శాంతి భద్రతల విషయంలో ఉత్తర ప్రదేశ్ ని "ప్రధమ స్థానం" లోకి తీసుకువెళ్లిందని ప్రశంసించారు. కానీ ఒక నెల తరవాత "భారత దేశంలో నేరాలు 2020" అనే శీర్షికతో వచ్చిన ఎన్‌సిఆర్ బి నివేదిక వేరే కధ చెబుతోంది. ఉత్తర ప్రదేశ్ లో 2020లో భారతీయ శిక్షా స్మృతి (ఐపిసి) క్రింద నమోదు అయిన నేరాలు 3,55,110కి పెరిగాయి, ఇవి 2019 లో 3,53,131 గా 2018 లో 2,42,802 గా ఉన్నాయి. ప్రత్యేక, స్థానిక చట్టాల (ఎస్‌ఎల్‌ఎల్) కింద నమోదయిన నేరాలు 2020లో 3,02,815కి పెరగగా 2019లో 2,75,447 గా, 2018లో 2,42,802 గా ఉన్నాయి.

నిజానికి దేశం మొత్తం మీద అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో ఐపిసి, ఎస్‌ఎల్‌ఎల్ క్రింద 2020లో నమోదయిన మొత్తం నేరాలు 66,01,158. 2019లో నమోదయిన నేరాలు 51,56,158 కంటే ఎక్కువ. అలానే 2018లో నమోదయిన 50,74,635 నేరాలతో పోలిస్తే 28 శాతం పెరుగుదల కనిపిస్తోంది. అదే విధంగా నేరాల రేటు లక్ష జనాభాకి 2019 లో 385.5 కాగా 2020లో 487.8కి పెరిగింది.

ఈ పెరుగుదలను అంతకు మునుపెన్నడూ ఎరుగని రీతిలో మార్చ్ 25 నుండి మే 31, 2020 వరకు సాగిన లాక్ డౌన్ సందర్భం బట్టి అర్ధం చేసుకోవాలి. ఈ సమయంలో కదలికల పై పూర్తి ఆంక్షలు ఉన్నాయి. లాక్ డౌన్ ఎత్తి వేసిన తరువాత కూడా దేశంలో పలుచోట్ల సంవత్సరం అంతా పాక్షికంగా లేదా పూర్తిగా లాక్ డౌన్ కొనసాగింది. ఈ నేరాల రేటు పెరుగుదలకు కారణం కోవిడ్-19 నిబంధనల ఉల్లంఘన వల్ల నమోదు అయిన నేరాలు అని ఎన్‌సిఆర్ బి పేర్కొంది. మొత్తం మీద "సంప్రదాయ నేరాలు" అయిన స్త్రీలు, పిల్లలు, వృద్ధులపై జరిగే నేరాలు, దొంగతనాలు, దోపిడీలు మొదలైన కేసులు రెండు లక్షల వరకు తగ్గాయి అని అంది.

సరే, అలాగే అనుకుందాం. ఒక సంవత్సరంలో ఉత్తర ప్రదేశ్‌లో జరిగిన అత్యధిక హత్యలు 3,779. కిడ్నాప్‌లు 12,913 నమోదు కాగా ఇవే నేరాలపై జాతీయ సగటు రేటులో మాత్రం తరుగుదల కనిపిస్తోంది. పిల్లలపై జరిగే నేరాలలో కూడా తగ్గుదల కనబడుతున్నప్పటికీ అదే సమయంలో బాలలు చేసిన నేరాలు 23 శాతం పెరిగాయి. దీనికి కారణం లాక్ డౌన్ వల్ల విద్య, ఉపాధి అవకాశాలు లేకపోవటం అని పేర్కొంది.

ఉత్తరప్రదేశ్ లో "దేశ వ్యతిరేక నేరాలు" శీర్షిక క్రింద నేరాల పెరుగుదల కొట్టచ్చినట్టు కనబడింది. ఎన్‌సిఆర్ బి ప్రకారం ప్రజల శాంతి భద్రతలకు, దేశ సమగ్రతకు భంగం కలిగించే ఏ చర్య అయినా దేశ వ్యతిరేక నేరం అవుతుంది. ఇందులో భాగంగా రాజ్య ఉనికికి భంగం కలిగించే నేర పూరిత కార్యకలాపాలు, ముఖ్యంగా దేశ ద్రోహం, ప్రభుత్వం పై పురికొల్పటం, తిరుగుబాటు ఉన్నాయి.

చట్ట విరుద్ధ కార్య కలాపాల నివారణ చట్టం(ఉపా), అధికార రహస్యాల చట్టం, ప్రజా ఆస్తి విధ్వంస నివారణ చట్టాలు ఐపిసి ఆరవ అధ్యాయంలో నియమాల ప్రకారం ఆరోపించ తగిన నేరాలు, వివిధ సెక్షన్లు 121, 121ఎ, 122, 123, 124 ఎ ల క్రింద ఉన్నాయి. వీటిలో ప్రధానమైనవి రాజ ద్రోహం, యుద్ధం చేయటం (పురికొల్పటం, చేయటానికి ప్రయత్నించటం, నిజమైన యుద్ధం చేయటం), ఉన్నత అధికారులపై దాడి, జైలు నుండి తప్పించుకోడం మొదలగునవి. ఐ పి సి సెక్షన్ 153ఎ క్రింద మతం, జాతి, జన్మ స్థలం, నివాసం, భాష ఆధారంగా వివిధ సమూహాల మధ్య ద్వేష పూరిత చర్యలు ప్రేరేపించటం/ప్రచారం చేయటం, ఐక్యతకు అంతరాయం కలిగించే చర్యలు వస్తాయి. దేశ సమగ్రతకి భంగం కలిగించే నిందలు, అభిప్రాయాలు అన్నీ మాటల, సలహాల, అభ్యర్ధనలు లేదా ప్రచారం ద్వారా జరిగేవి సెక్షన్153బి క్రిందకి వస్తాయి.

"దేశ వ్యతిరేక నేరం" క్రింద దేశంలో 2020లో నమోదు అయిన 5,613 కేసులలో అతి పెద్ద భాగం 80.6 శాతం (4,524 కేసులు) ప్రజా ఆస్తి విధ్వంస చట్టం క్రిందవి. 14.2 శాతం (796 కేసులు ) ఉపా క్రింద నమోదు అయ్యాయి. ఉత్తరప్రేదేశ్‌లో తొంభై ఐదు శాతానికి పైగా కేసులు ప్రజా ఆస్తి విద్వంస చట్టం క్రిందవి, వీటిలో చాలా వరకు కేసులు పౌరసత్వ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనల సమయంలో నమోదు చేయబడినవి. ఉత్తరప్రదేశ్‌లో ఉపా క్రింద దేశంలోనే అత్యధికంగా 72 కేసులు నమోదు అయ్యాయి. ఈ ఒక్క రాష్ట్రంలోనే నిరంతర ఆందోళనలు ఏవీ లేకుండానే అత్యధిక కేసులు నమోదు అయ్యాయి.

ఉత్తర ప్రదేశ్‌లో ఆదిత్యనాధ్ ముఖ్యమంత్రి అయినప్పటి నుండి అనేక మంది నాయకులు నర్మగర్భ వ్యాఖ్యలతో మత రాజకీయాలు నడిపారు. 2020లో కార్మిక శాఖా మంత్రి "దేశ ద్రోహులు కుక్క చావు చస్తారు" అన్నారు. ఒక కళాశాలలో జరిగిన నిరసనలో దేశ వ్యతిరేక నినాదాలు చేసారని ఆరోపించి చాలా మంది విద్యార్థులపై రాజద్రోహం కేసులు నమోదుచేశారు. ఇలాంటి కేసులు కూడా "దేశ వ్యతిరేక నేరాల" జాబితా లోకి వచ్చాయి. హత్రాస్ లో దళిత అమ్మాయి పై జరిగిన


అత్యాచారం, హత్య గురించి రిపోర్ట్ చేయ టానికి ప్రయత్నించిన సిద్దిఖీ కప్పన్‌తో సహా పాత్రికేయులను అరెస్టు చేసారు.

ఉపా చట్టం క్రింద అత్యధికంగా కేసులు నమోదు చేసిన ఇతర రాష్ట్రాలు జమ్మూ, కాశ్మీర్ 287, మణిపూర్ 169, ఝార్ఖండ్ 86, అస్సాం 76.

"దేశ వ్యతిరేక నేరాల" క్రింద కేసుల పెరుగుదల రెండింతలు నమోదు అయిన రాష్ట్రాలలో పంజాబ్ కూడా ఉంది. 2019 లో 35 కేసులు నమోదుకాగా 2020లో 70కి పెరిగింది. ఇప్పటికి 300 రోజులకు పైగా పంజాబ్, ఇతర రాష్ట్రాల రైతులు కేంద్ర ప్రభుత్వం హడావిడిగా జారీ చేసిన మూడు కొత్త వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు - 1. రైతు ఉత్పత్తుల వాణిజ్య, వ్యాపార సౌలభ్య చట్టం 2. నిత్యావసర వస్తువుల (సవరణ) చట్టం 3. రైతుల సాధికారత, రక్షణ, ధరల హామీ వ్యవసాయ సేవల ఒప్పంద చట్టం. రైతు ఉద్యమాన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం రాజ్య చట్టాలను ఆయుధాల్లా వాడుతోందని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఉద్యమ తొలిరోజుల్లోనే ఉద్యమ నాయకులపై ఖలిస్తానీయులని (సిక్కు వేర్పాటువాదులు) ముద్ర వేసి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ద్వారా హెచ్చరికలు జారీచేసింది. 2021 గణతంత్ర దినోత్సవ ట్రాక్టర్ ర్యాలీ రోజున రైతులు దేశానికి వ్యతిరేకంగా విద్వేషాన్ని రెచ్చగొట్టే కుట్ర పన్నుతున్నారని ఆరోపించి, వారి మీద 25కు పైగా క్రిమినల్ కేసులు నమోదు చేసింది. చాలా మంది కార్మిక హక్కు కార్యకర్తలను అరెస్టు చేసారు. యువ నిరసన కారులను భయపెట్టటానికి 23 ఏళ్ళ నౌదీప్ కౌర్‌ని కూడా అరెస్టు చేసారు. రైతుల నిరసనల గురించి రిపోర్ట్ చేసినందుకు వివిధ టెలివిజన్ ఛానెల్స్, ఆన్ లైన్ న్యూస్ పోర్టల్స్‌లో పనిచేసే అనేకమంది పాత్రికేయుల మీద ఎఫ్ఐఆర్ లు నమోదు చేసారు. సింఘు బోర్డర్ వద్ద స్వతంత్ర పాత్రికేయుడు మణిదీప్ పూనియాను బారికేడ్ల లోంచి లాక్కొచ్చి మరీ అరెస్టు చేసారు.

పోలీసులు నమోదు చేసిన కేసులనే పరిగణ లోకి తీసుకున్నట్టు ఎన్‌సిఆర్ బి తన రిపోర్ట్‌లో అంగీకరించింది. కేసులు తక్కువ రిపోర్ట్ చేయటం కూడా ఉంది. ఎందుకంటే నేరాన్ని వర్గీకరిస్తున్నప్పుడు "ప్రధాన నేరం" అనే సూత్రం క్రింద ప్రతీ

> **❝ "దేశ ద్రోహి" అనే అభియోగం లేదా "లౌకిక వాదం" అనే మాటని ఎగతాళి చేయటం అనేవి ఇటీవలే మొదలైనవి ఏమీ కాదు. భారతీయ జనతా పార్టీ యేతర ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడు కూడా ఇవి ప్రాచుర్యంలో ఉండేవి. కానీ ఇటువంటి అభియోగాలు ప్రస్తుత అధికారంలో పై పైకి ఎగబాకాయి. "దేశ ద్రోహి", "దేశ వ్యతిరేకి" అనే పదాలు ప్రత్యేకంగా ముస్లింలనూ, ప్రభుత్వ విమర్శకులనూ, రాజకీయ ప్రత్యర్థులనూ లక్ష్యంగా చేసుకున్నాయి. ❞**




నేర సంఘటన ఒక్క నేరం క్రిందే నమోదవుతుంది. ఒకటి కంటే ఎక్కువ అపరాధాలు ఒకే ఎఫ్ఐఆర్ లో నమోదు చేసినపుడు, అన్నింటికంటే ఘోరమైన నేరాన్నే లెక్క లోనికి తీసుకుంటారు.

### మహమ్మారి సమయలో తగ్గిన సంప్రదాయ నేరాలు

మహమ్మారి సమయలో సంప్రదాయ నేరాలు తగ్గి పోయినా పోలీసుల చేత నమోదు చేయబడిన మత పరమైన అల్లర్ల కేసులు మాత్రం పెరిగిపోయాయి. ఇవి దేశం మొత్తం మీద 2020లో 857 కేసులు కాగా 2019లో 438. 2020లో నమోదు చేయబడిన కేసుల్లో చాలా భాగం ఈశాన్య ఢిల్లీలో ఫిబ్రవరిలో జరిగిన అల్లర్లకు సంబంధించినవి. వీటిలో ఏకంగా 520 కేసులు ఢిల్లీ పోలీసులు మాత్రమే నమోదు చేసినవి ఉన్నాయి. కుల పరమైన అల్లర్లు ఇంచుమించు యాభై శాతం, వ్యవసాయ అల్లర్లు 38 శాతం, ఆందోళనలు / మోర్చాలు (ఉద్యమాలు) సమయంలో అల్లర్లకు సంబంధించినవి 33 శాతం పెరిగాయి. వీటిలో 95 శాతం (1,798) కేరళలో నమోదయ్యాయి. పోలీసు సిబ్బంది మీద దాడులు 2019లో 1,054 నుండి 2020లో 616 కు తగ్గాయి, అంటే ఇంచుమించు 40 శాతం పడిపోయాయి. "సమూహాల మధ్య ద్వేష ప్రచారం" కి సంబంధించినవి దేశం మొత్తం మీద 2020లో 1,804 కేసులు కాగా 2019 లో 1,058 ఉన్నాయి. అత్యధిక కేసులు తమిళనాడులో (303) నమోదు కాగా, ఉత్తరప్రదేశ్ (243), తెలంగాణ (151), అస్సాం (147) గా ఉన్నాయి.

దేశ వ్యతిరేక నేరాలలో ఈ హఠాత్ పెరుగుదల, ఎంతోమంది విద్యార్థులను, విద్యావేత్తలనే కాకుండా చివరికి హాస్య వ్యాఖ్యాతలపైన కూడా నేరాలు మోపడం అనేది అర్థం చేసుకోటానికి ఇది ఏ సామాజిక, రాజకీయ పరిణామాల విస్తరణో పరిశీలించాలి. "దేశ ద్రోహి" అనే అభియోగం లేదా "లౌకిక వాదం" అనే మాటని ఎగతాళి చేయటం అనేవి ఇటీవలే మొదలైనవి ఏమీ కాదు. భారతీయ జనతా పార్టీ యేతర ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడు కూడా ఇవి ప్రాచుర్యంలో ఉండేవి. కానీ ఇటువంటి అభియోగాలు ప్రస్తుత అధికారంలో పై పైకి ఎగబాకాయి. "దేశ ద్రోహి", "దేశ వ్యతిరేకి" అనే పదాలు ప్రత్యేకంగా ముస్లింలనూ, ప్రభుత్వ విమర్శకులనూ, రాజకీయ ప్రత్యర్థులనూ లక్ష్యంగా చేసుకున్నాయి.

> మహమ్మారి వల్ల వచ్చిన లాక్ డౌన్‌తో సంబంధం లేకుండా 2020లో ఎస్‌సిఎస్‌టి ల మీద నేరాలు పెరిగాయి. షెడ్యూలు కులాల మీద జరిగిన నేరాలు 2019 లో 45,935 గా ఉంటె 2020లో (50,291). అంటే ఈ నేరాల రేటు 9.4 శాతానికి పెరిగింది. ఉత్తర ప్రదేశ్ లో అత్యధికంగా ఎస్‌సిలపై దారుణాలు 12,714, (25.2 శాతం) నమోదయ్యాయి.

ఇటువంటి పదాలు సామాజిక మాధ్యమాల్లో ప్రజల్ని వేధించటానికి, ట్రోల్ చేయటానికి చాలా ఉదారంగా వాడతారు. "దేశ వ్యతిరేకి" అని భావించ బడిన వ్యక్తులపై పోలీసుల పిర్యాదులు, ఎఫ్ఐఆర్ నమోదులు జరిగితే ఆ పరిణామాలు మరీ ఘోరంగా ఉంటాయి. మామూలు మాటల్లో "దేశ వ్యతిరేకి" అన్న పదం రాజ్యానికి వ్యతిరేకంగా, రాజ్యం మీద తిరుగుబాటుకు పురికొల్పేవిగా ఉన్నాయి అని ఆరోపించబడిన వ్యాఖ్యలు చేసే వ్యక్తులను సూచించటానికి వాడతారు. అధికారిక పరి భాషలో ఈ పదం దానిని దేశ వ్యతిరేక నేరంగా వ్యవహరించే వేరే వేరే ఐపిసి సెక్షన్‌ల ద్వారా పరోక్షంగా ప్రభుత్వ ఆమోదం పొందుతుంది.

వాక్ స్వాతంత్రాన్ని స్తంభింప చేసేందుకు వాడబడుతున్న రాజ ద్రోహ నేరం అనేది వలస పాలకుల కాలంనుంచి వచ్చిన మరొక ఆయుధం. 2020లో మణిపూర్, అస్సాం, కర్ణాటక, ఉత్తరప్రదేశ్‌లలో అత్యధిక రాజద్రోహం కేసులు నమోదయ్యాయి. మణిపూర్‌లో 15, అస్సాంలో 12, కర్ణాటకలో ఎనిమిది, ఉత్తరప్రదేశ్‌లో ఏడు గా నమోదుయ్యాయి. కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఢిల్లీలో ఐదు కేసులు నమోదయ్యాయి. అస్సాంలో "రాజ్య ద్రోహ నేరాల" క్రింద 2019 లో 447 కేసులు నమోదు కాగా, 2020 లో 333 తో మొత్తం మీద కేసులలో ఒక తగ్గుదల ఉంది. మణిపూర్‌లో కూడా 2019 లో 315 కేసులు నమోదు కాగా 2020 లో 191 గా ఉన్నాయి. మహారాష్ట్ర లో గరిష్టంగా అధికార రహస్యాల చట్టం కింద పది కేసులు కాగా, రాజస్థాన్ లో ఆరు నమోదయ్యాయి.

మహమ్మారి వల్ల వచ్చిన లాక్ డౌన్‌తో సంబంధం లేకుండా 2020లో ఎస్‌సిఎస్‌టి ల మీద నేరాలు పెరిగాయి. షెడ్యూలు కులాల మీద జరిగిన నేరాలు 2019 లో 45,935 గా ఉంటె 2020లో (50,291). అంటే ఈ నేరాల రేటు 9.4 శాతానికి పెరిగింది. ఉత్తర ప్రదేశ్ లో అత్యధికంగా ఎస్‌సిలపై దారుణాలు 12,714 , (25.2 శాతం) నమోదయ్యాయి. బీహార్‌లో 14.6 శాతం (7,368), రాజస్థాన్‌లో 13. 9 శాతం (7017), మధ్య ప్రదేశ్ లో 13.7 శాతం (6899), మహారాష్ట్ర లో 5.1 శాతం (2,569). ఎస్ సి ల పై దారుణాలలో 72. 5 శాతం ఈ ఐదు రాష్ట్రాలలో నమోదయ్యాయి. ఇటీవలే ఢిల్లీ, మధ్య ప్రదేశ్‌లోని ఛత్తర్ పూర్, ఉత్తర ప్రదేశ్ లోని భిజ్నుపూర్‌లో వీరిపై జరిగిన దారుణాలు ప్రాథమిక స్థాయిలో వాస్తవికతను ప్రతిబింబిస్తుంది.

అదేవిధంగా ఎస్ టి ల మీద దారుణాలు 2020 (8,272) 8.4 శాతం పెరిగాయి 2019 (7,570) కంటే.

మధ్య ప్రదేశ్‌లో అత్యధికంగా ఎస్‌టి లపై 2,401 దారుణాలు 29.02 శాతం, రాజస్థాన్‌లో 22.7 శాతం (1,878 కేసులు), మహారాష్ట్రలో 8.01 శాతం (663), ఒడిశాలో 7.54 శాతం (624), తెలంగాణ లో 6.9 శాతం (573) నమోదయ్యాయి.

ఎస్‌సి స్త్రీ లపై జరిగిన దారుణాలలో నమోదైన మొత్తం కేసులలో 6.70 శాతం (3,372 ) అత్యాచారం కేసులు. అత్యాచారం, అత్యాచార యత్నం, స్త్రీ గౌరవం భంగం కలిగేలా దాడి మొదలగునవి 12.6 శాతం(6,835). అదే విధంగా ఎస్‌టి స్త్రీలపై అత్యాచారాలు మొత్తం నమోదైన కేసుల్లో 13.7 శాతం (1,137 కేసులు). అన్నీ కలిపి అత్యాచారం, అత్యాచార యత్నం, స్త్రీ గౌరవం భంగం కలిగేలా దాడి మొదలగునవి 24.7 శాతం (2,047) ఉన్నాయి.

ఎస్‌సి లపై జరిగిన దారుణాలలో హత్యలు (855), హత్యాయత్నం (199), తీవ్రంగా గాయపర్చటం (1,587) నమోదుకాబడిన కేసులు. అదేవిధంగా ఎస్‌టి లపై జరిగిన దారుణాలులో హత్యలు (172), హత్యాయత్నం (144), తీవ్రంగా గాయ పర్చటం (125) నమోదుకాబడిన కేసులు.

ముందు సంవత్సరం కేసులతో కలుపుకుని 2020 సంవత్సరాంతానికి ఎస్‌సి లపై జరిగిన దారుణాలు మొత్తం 68,456 కేసులు దర్యాప్తు కోసం పెండింగ్‌లో ఉన్నాయి. అలాంటివే ఎస్‌టి ల పెండింగ్ కేసులు 11,200. ఎస్‌సి అట్రాసిటీ కేసులు 48,560ని పోలీసులు పరిష్కరించగా, ఎస్‌టి ఎట్రాసిటీ కేసులు 7,840 ని పరిష్కరించారు. ఎట్రాసిటీ కేసుల్లో చార్జీ షీట్ దాఖలు చేసిన శాతం ఎస్‌సి లవి 80.6 శాతం, ఎస్‌టి లవి 82.7 శాతంగా ఉన్నాయి.

నేషనల్ కొలిషన్ అండ్ స్ట్రెంగ్థెనింగ్ ఆఫ్ ఎస్‌సి, ఎస్‌టి (పిఒఎ) చట్టం (ఎన్‌సిఎస్‌పిఎ) అనే వేదికలో ఐదు వందలకు పైగా దళిత, ఆదివాసీ పౌర సమాజ సంస్థలు, సంఘాలు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ఎన్‌సిఎస్‌పిఎ ప్రకారం మహమ్మారి సమయంలో కూడా దేశం అంతటా దళితులపై, ఆదివాసీలపై పెరిగిపోతున్న దారుణాల వల్ల తెలిసేదేంటంటే దళితులు, ఆదివాసీలు ఇప్పటికీ హత్యలు, మూకుమ్మడి హత్యలు, సాంఘిక బహిష్కరణ, ఆర్థిక బహిష్కరణ, మూకుమ్మడి దహనాలు, అత్యాచారం, మూకుమ్మడి అత్యాచారం లాంటి అమానుషమైన దారుణాలకు బలిఅవుతూనే ఉన్నారు. ఎన్‌సి ఆర్ బి నివేదిక విడుదల తరువాత ఎన్‌సిఎస్‌పిఎ ఒక ప్రకటనలో చాల వరకు కేసులు నివేదించబడటం లేదు అని తెలిపింది. "ఎస్.సి, ఎస్.టి వేధింపుల నిరోధక చట్టం 2015 సవరణలు చేసి 2016లో ఆ సవరణలు అమలులోకి వచ్చి దళిత, ఆదివాసీ బాధితులకు త్వరితగతిన న్యాయం అందుబాటులో ఉంటుందని ఆశ కల్పించింది. కానీ, అనుభవం చెప్పినదేమిటంటే, ఐదు సంవత్సరాల తరువాత కూడా ఎస్.సి, ఎస్.టి పిఒఎ కేవలం పేపర్ మీద ఉంది కానీ సరి అయిన పద్ధతిలో అమలులోకి రాలేదు. అసలు భయం లేకుండా ధైర్యంగా నేరాలు చేస్తున్న తీరు ఈ పరిస్థితిని స్పష్టంగా చూపిస్తోంది. అధ్వాన్నంగా ఉన్న న్యాయం, పాలనే తప్పు చేసి తప్పించుకునే అవకాశం ఇవ్వటంతో ఇవి అపరాధులకు ప్రోత్సాహం ఇస్తున్నాయి" అని ఆ ప్రకటన తెలియచేసింది.

**(అనువాదం: కె. పుష్పవల్లి)**

సమకాలీనం

# అస్సాంలో విభజించి పాలిస్తున్న బిజెపి

**తీస్తా సెతల్వాద్**



**రచయిత సిటిజన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్ సంస్థ కార్యదర్శి**

అది అస్సాంలోని దర్రాంగ్ జిల్లా, సిపాఝార్ రెవెన్యూ సర్కిల్‌లోని ధాల్‌పూర్ గ్రామం. సెప్టెంబర్ 22 రాత్రి 10 గంటల సమయం. గత 40 సంవత్సరాలుగా అక్కడ సాగుచేస్తున్న రైతులకు వారి భూమిని ఖాళీ చేయాల్సిందిగా వాట్స్‌యాప్ ద్వారా నోటీసులు అందాయి. ఆ మరునాడు అధికార గణం, భారీ సాయుధ పోలీసు బలగాలతో కలిసి ఫొటోగ్రాఫర్ విజయ్ బానియా గ్రామంలోకి ప్రవేశించాడు. పోలీసు కాల్పులలో చనిపోయిన 28 ఏళ్ల మేనాల్ హక్ మృతదేహం పైకెక్కి పైశాచిక ఆనందంతో చిందులు వేశాడు. అస్సాంలో నెలకొన్న వర్తమాన హింస, ద్వేషాలకు ఈ తాజా దుర్ఘటన అద్దం పడుతున్నది.

ఒక తరగతి ప్రజలు లక్ష్యంగా సాగుతున్న ఈ విధమైన విద్వేషపూరిత దాడులు అస్సాంలో కొత్త కాదు. రాజకీయ ప్రేరితమైన ఈ దాడులు ఆ రాష్ట్రమంతటా విస్తరించాయి. ముస్లింలను 'మియాన్' లేదా 'ఆలీ' అని, బీహారీని 'కూలీ' అని, బెంగాలీని 'బొంగాల్' అని, నేపాలీని 'చట్టి ముక్కోడు' అంటూ జాతి పరమైన ఈసడింపులతో సంబోధించటం ఇక్కడ కొందరికి అలవాటుగా మారింది. సమాజంలో హేతుబద్ధంగా వ్యవహరించే పౌరులు ఆ విధమైన ఛీత్కారపు పిలుపులను వ్యతిరేకిస్తున్నారు. ఈ సందర్భంగా ముస్లింలను ఒంటరి చేయాలన్న రాజకీయ ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

అక్కడి పరిస్థితులను మతోన్మాదం వైపు మళ్లించేందుకు పకడ్బందిగా పథకం రూపొందించటం, భావజాల దాడిలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ముందున్నాడు. దర్రాంగ్‌లోని శివాలయం భూముల నుండి బెంగాలీ మాట్లాడే ముస్లింలను ఖాళీ చేయించేందుకు ముఖ్యమంత్రి, అతని బిజెపి సహచరులు పలు కట్టు కథలు అల్లారు. జాతీయ పౌరసత్వ రిజిష్టరు(యన్ఆర్‌సి) అంతిమ జాబితా నుండి వీలైనంత మంది ముస్లింలను తొలగించటమే వారి ధ్యేయంగా మారింది.

నిరసనలు తెల్పుతున్న ప్రజా సమూహాలను అదుపు చేసేందుకు " ప్రామాణిక నిర్వహణా విధానం"(యస్ఒపి) చట్టాలను ఉల్లంఘించి, జనాన్ని ఇళ్ల నుండి తరిమేశారు. కొందరిని తుపాకులతో కాల్చి దారుణంగా హతమార్చారు. సెప్టెంబరు 20న ప్రారంభమైన 'తొలగింపు'ల్లో తమ సామాను సర్దుకొని గౌరవప్రదంగా ఇళ్ల నుండి బైటపడేందుకు అవసరమైన ముందస్తు నోటీసులు కూడా ఇవ్వలేదు. అర్ధరాత్రి 'వాట్స్ యాప్ మెసేజ్'లు పంపిన జిల్లా అధికారులు ఉదయాన్నే 'కూల్చివేత దళాల'ను పంపారు. కుటుంబాలను ఖాళీ చేయించేందుకు సాయుధ పోలీసు బలగాలు కూడా వారి వెంట తరలి వచ్చాయి.

ఈ దారుణ మారణకాండ పట్ల దేశ, విదేశాల్లో నిరసనలు వెల్లువెత్తినప్పటికీ ముఖ్యమంత్రికి కించిత్తు పశ్చాత్తాపం కూడా కలుగలేదు. అంతేకాదు. ప్రతి బాధిత కుటుంబానికీ, అదీ అర్హతగల కుటుంబానికి పునరావాస ప్యాకేజిలో భాగంగా ఆరు బీఘా( ఒక బిఘా 14,400 చదరపు అడుగులు)ల భూమి కేటాయిస్తామని ప్రకటించారు. తద్వారా 'చొరబాటుదారులు', 'స్వదేశీయులు'గా ముద్రవేసి బాధితులలో చీలికల సృష్టికి పూనుకున్నారు.

### నెల్లీ ఊచకోత

అస్సామీ భాషలో జాతుల మధ్య తేడాలకు సంబంధించిన కొన్ని పదాలను వ్యతిరేకిస్తూ, 1970 దశకంలో అస్సాంలో ఒక రాజకీయ వుద్యమం బయలుదేరింది. స్వాతంత్ర్యానంతరం అస్సాంలోని నెల్లీలో రాజ్యం పురికొల్పిన మారణహోమం గురించి దేశంలో ఎక్కువ మందికి తెలియకపోవచ్చు. ఆ సమాజంలోని ఆధిపత్య తరగతుల విద్యార్థుల సమీకరణలతో 1970 దశకం చివరిలో ఆ వుద్యమం ప్రారంభమైంది. క్రమంగా 'బైటవారి'పట్ల వ్యతిరేకతతో క్రూరమైన హింసాత్మక వుద్యమంగా మారింది.

'బైటవారు' అని ముద్రబడిన వారిలో కూడా అత్యధికులు గత మూడు తరాలుగా శ్రమజీవులు, వ్యవసాయదారులు. ఆక్కడ వ్యవసాయాన్ని అభివృద్ధి చేసేందుకు నాటి బ్రిటీష్ పాలకులు వీరిని అస్సాంకు తరలించారు. నేటి ఆధునిక అస్సాం గడ్డలో వీరికి లోతైన మూలాలున్నాయి. ఈ కాలంలోనే దేశంలో అత్యవసర పరిస్థితి ముగిసింది. ఆర్‌యస్‌యస్ నేపథ్యమున్న జనసంఘ్ ఒక గౌరవప్రదమైన రాజకీయ శక్తిగా ఆవిర్భవించింది. ఆ ప్రాంతంలో ఆర్‌యస్‌యస్ తన ఉనికిని, సిద్ధాంత ప్రభావాన్ని విస్తరించుకోసాగింది. ఆ నేపథ్యంలో ' బైటివారు' 'విదేశీయులు'గాను, ఆతర్వాత 'చట్ట వ్యతిరేక వలసదారులు'గాను, ప్రస్తుతం 'చొరబాటు దారులు'గా మారిపోవటంలో ఆశ్చర్యం లేదు.

1983 ఫిబ్రవరి 18. అస్సాం శాసన సభకు ఎన్నికలు సమీపిస్తున్న తరుణం. " నకిలీ ఓటర్ల లిస్టులు" అన్న ఆరోపణలతో అక్కడి ఆధిపత్య తరగతులు ఆ ఎన్నికలను వ్యతిరేకించాయి. ఉన్మాదపూరిత వుద్రిక్తతలను పతాక స్థాయికి చేర్చారు. 6 గంటల వ్యవధిలో నెల్లీ, సమీపంలోని 14 గ్రామాల్లో కనీసం 2,200ల మంది బెంగాలీ మాట్లాడే ముస్లింలను వూచకోత కోశారు. అనధికార అంచనాల ప్రకారం మృతుల సంఖ్య మూడు రెట్లు అధికంగా వుంది.

ఈ హత్యాకాండపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం తివారీ కమీషన్‌ను నియమించింది. 1984లో ఆ కమిషన్ తన నివేదికను అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యమంత్రి హితేశ్వర్

> **“ అస్సాం జనాభాలో కనీసం మూడోవంతు అనేక దశాబ్దాలుగా ‘పౌరసత్వ పరీక్షల’ భారంతో మగ్గుతున్నారు. ఈశాన్య భారతంలోని 7 రాష్ట్రాల్లో గిరిజన క్రైస్తవులు ఎక్కువగా లేని రెండింటిలో అస్సాం ఒకటి. ఆందోళనకరమైన అంతర్గత సంఘర్షణలు, ఒక సామాజిక తరగతి లక్ష్యంగా సాగుతున్న హింసాకాండలతో అనేక దశాబ్దాలుగా ఆ ప్రాంతం రగిలిపోతున్నది. ఈ విధమైన హింసాకాండ ప్రత్యేకంగా ‘బెంగాలీ మాట్లాడే ముస్లిం శ్రామికుల’కు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడింది. ”**

సైకియాకు సమర్పించింది. ఆ రిపోర్టును ఇంత వరకూ బహిరంగపరచ లేదు. హత్యాకాండ వార్తలను ప్రభుత్వ అధీనంలోని ‘ఆల్ ఇండియా రేడియో’ కప్పిపెట్టింది. కాని బ్రిటీష్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్ (బిబిసి), వాయిస్ ఆఫ్ అమెరికా బెంగాలీ విభాగం ప్రకటనల ద్వారా అస్సాం ప్రజలతో పాటు భారతీయులందరూ పై దుర్ఘటన వార్తలు తెలుసుకున్నారు. ఆ తర్వాత లెక్కించేందుకు వరుసల్లో పండబెట్టిన పసిపిల్లల మృతదేహాల ఫొటోలను పత్రికల్లో చూశారు. మృతుల కుటుంబాలకు నామ మాత్రంగా రు.5,000ల వంతున పారితోషికం చెల్లించారు. ‘ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్’కు, కేంద్ర ప్రభుత్వానికి మధ్య ఒప్పందం కుదిరిన తర్వాత ఏర్పడిన ‘అస్సాం గణపరిషత్’ ప్రభుత్వం 688 లో 310 కేసులను ఉపసంహరించుకుంది. ఆ విధంగా బాధితులకు న్యాయం జరుగలేదు.

### ముప్పేట దాడి

అనేక దశాబ్దాలుగా అస్సాంలోని జాతుల మధ్య కొనసాగుతున్న అంతర్గత పోరాటాలు, హింసాకాండ తరచూ అల్ప సంఖ్యాక జాతులకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడేవి. 1993లో బోడో ఒప్పందం జరిగింది. బోడోల జనాభా అధికంగావున్న ప్రాంతాలపై ఆ తెగకు స్వయం ప్రతిపత్తి అధికారాలు కట్టబెట్టారు. ఆ కాలంలో ఈ ఒప్పందాన్ని అనేక మంది అభ్యుదయ వాదులు వ్యతిరేకించారు. ఆ ఒప్పందం జరిగాక అదే సంవత్సరం బెంగాలీ ముస్లింలపై దాడులు చేసి, వారి ఇళ్లను తగులబెట్టి, నివాస ప్రాంతాల నుండి తరిమేశారు. అపుడు మాత్రమే బోడో ఒప్పందంపై అభ్యుదయ వాదుల అభిప్రాయాలు సరైనవిగా రుజువయ్యాయి. మూడు సంవత్సరాల తర్వాత సంతాల్, ముండా తెగల ఆదివాసులు కూడ అదే విధమైన దాడులకు గురయ్యారు. రెండు శతాబ్దాల క్రితం టీ తోటల్లో పనిచేసేందుకు బ్రిటీష్‌వారిచే ఈ ప్రాంతానికి తరలించబడిన కార్మికుల వారసులు వారు. అనేక సంవత్సరాల తర్వాత కూడా తమ స్వగృహాలకు వెళ్లేందుకు భయపడుతూ, వారిలో అనేక మంది ‘నిర్వాసితుల క్యాంపుల్లో’నే కునారిల్లుతున్నారు. .గౌహతిలోని బీహార్, జార్ఖండ్ వలస కార్మికులపైన కూడా పలుమార్లు దాడులు జరిగాయి. ఆ విధంగా అస్సాంలోని బెంగాలీ ముస్లింలపై పదేపదే దాడులు జరగటం సాధారణ దృశంగా మారింది.

‘నెల్లీ ’ వూచకోతలతో మూడు దశాబ్దాల క్రితం అస్సాం వుద్యమానికి విరామం లభించింది. ఈ సెప్టెంబరు 23న రాజ్యం అండతో దర్రాంగ్‌లో సాగిన పాశవికమైన బలవంతపు తొలగింపులకు కూడా విరామం దొరుకుతుందా? అధికార నేతల ఇష్టాలు, అభిరుచులకు అనుగుణంగానే బలవంతపు తొలగింపుల పర్వం కొనసాగుతుందా ? అస్సాం జనాభాలో 54 శాతం రాష్ట్రంలో అంతర్గతంగా వలసలు పోయినట్లు 2011 జనాభా లెక్కల సమాచారం తెల్పుతున్నది. “ వలసలకు పర్యావరణ పర్యవసానాల ”ను కారణంగా చూపుతూ సదరు సమాచారాన్ని 2001 వరకూ కేంద్ర ప్రభుత్వం నమోదు చేసింది.

వరద బీభత్సాలు, బతుకుదెరువుకు భద్రతలేమి, భూమి కోతలే అంతర్గత వలసలకు ప్రాధమిక కారణాలని ఆ ప్రాంతంలో పనిచేస్తున్న విద్యావంతులు భావిస్తున్నారు. 1951 నుండి అస్సాంలోని మొత్తం భూమి కోతల్లో నదీ తీరపు కోతలే 7–8శాతం వుంటాయని అధ్యయనాలు తెల్పుతున్నాయి. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ జీవనోపాధి పరిరక్షణలపై నిర్వహించిన అధ్యయనాలు కూడా పై నిర్ధారణలతో ఏకీభవిస్తున్నాయి.

అస్సాం తరచూ వరదల తాకిడికి దెబ్బ తింటున్నది. నదీ తీరాల కోత వలన సుమారు 2,034 గ్రామాలు అతాకుతలమౌతున్నట్లు 2011–12 ‘అస్సాం ఆర్థిక సర్వే రిపోర్టు’ తెల్పుతున్నది. తద్వారా 25 లక్షలకుపైగా ప్రజలు నెలవులు కోల్పోయినట్లు కొన్ని స్వతంత్ర అధ్యయనాలు తెలుపుతున్నాయి. వారిలో అత్యధికులు ఇసుక తిన్నెలపై నివాసముంటున్నారు. వ్యవసాయదారులుగాను, దినసరి వేతన కూలీలుగాను జీవిస్తున్నారు. అలాంటి వారు భూమి పట్టాలను సమర్పించగలరని ఆశించలేము. నది లోతట్టు ప్రాంతాలను స్థానికంగా “చార్” అని పిలుస్తారు. ఈ కారణాల వలన అత్యధిక ప్రజల జీవన పరిస్థితులు దుర్భరమౌతున్నాయి. వారికి పౌరసత్వం నిరాకరించబడుతున్నది. అలాంటి వారు ‘రాజ్యం పట్టించుకోని’ నిస్సహాయులుగా మిగిలిపోతున్నారు.

అక్కడ నెలకొన్న వేర్పాటువాదం, అవాంఛనీయమైన రాజకీయ పరిస్థితుల్లో వత్తిడికి తట్టుకోలేక అనేకమంది తమ నెలవులు వదిలేస్తున్నారు. బతుకుదెరువు కోసం వలస బాట పట్టడం అనివార్యమౌతున్నది. అలాంటి నిర్భాగ్యులను అక్రమ వలసదారులుగా ముద్ర వేస్తున్నారు. ఏ హక్కులకూ నోచుకోక “సామాజిక భద్రతా వలయం” నుండి బైటకు నెట్టివేయబడి నిస్సహాయులుగా మారుతున్నారు. ఒకసారి రాజకీయ హక్కులను కోల్పోయాక వరదలు, భూమి కోతలతో జీవనాధారాన్ని కోల్పోయినవారు నష్టపరిహారం, పునరావాసం పొందటం కోసం ప్రభుత్వాన్ని డిమాండు చేసే పరిస్థితి ఉండటం లేదు.

అస్సాం జనాభాలో కనీసం మూడవ వంతు అనేక దశాబ్దాలుగా ‘పౌరసత్వ పరీక్షల’ భారంతో మగ్గుతున్నారు. ఈశాన్య భారతంలోని 7 రాష్ట్రాల్లో గిరిజన క్రైస్తవులు ఎక్కువగా లేని రెండింటిలో అస్సాం ఒకటి. ఆందోళనకరమైన అంతర్గత సంఘర్షణలు, ఒక సామాజిక తరగతి లక్ష్యంగా సాగుతున్న హింసాకాండలతో అనేక దశాబ్దాలుగా ఆ ప్రాంతం రగిలిపోతున్నది. ఈ విధమైన హింసాకాండ ప్రత్యేకంగా ‘బెంగాలీ మాట్లాడే ముస్లిం శ్రామికుల’కు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడింది. వారిపై చాలా కాలంగా బహిరంగంగా ద్వేషాన్ని రెచ్చగొడుతున్నారు. గౌరవ హీనంగా చూస్తున్నారు. అదే భాష మాట్లాడుతున్న హిందువులను కూడా అంతగా ఇష్టపడటం లేదు.

### వలసల చరిత్ర

పంజాబ్, బెంగాల్ మాదిరిగానే అస్సాం కూడా 1947 తర్వాత విభజించబడింది. నాటి రిఫరెండం తార్వాత అస్సాంలోని ‘సిల్హెట్’ జిల్లా తూర్పు పాకిస్థాన్‌కు బదిలీ చేయబడింది.

అంతకు ముందు బ్రిటీష్ కాలంలో రెండు శతాబ్దాలుగా బెంగాల్ నుండి అస్సాంకు 'భూ దాహం'తో వలసలు పెచ్చరిల్లాయి. అనంతరం 1947లోను, మరలా మొదట తూర్పు పాకిస్థాన్‌గాను, తర్వాత 1971లో 'బంగ్లాదేశ్'గా ఏర్పడిన ప్రాంతం నుండి అస్సాంకు తాజాగా వలసలు జరిగాయి. మొత్తం మీద 19వ శతాబ్దం మధ్యకాలంలోనే విస్తారమైన బెంగాల్ ప్రావిన్స్ నుండి వర్తమాన కాలపు అస్సాంకు వలసలు ప్రారంభమయ్యాయి.

బ్రిటీష్ కాలంలో తూర్పు బెంగాల్‌లోని అనేక జిల్లాల్లో వ్యవసాయం పరిమితిని దాటింది. వేరొకవైపున బ్రహ్మపుత్ర నదీ లోయలో సేద్యంచేయని భూములు విస్తారంగా వుండేవి. ఆ భూముల్లో వ్యవసాయం చేసేందుకు బెంగాలీ ముస్లింల వలసలను బ్రిటీష్ పాలకులు ప్రోత్సహించారు. ఆ కాలంలో అస్సాం ప్రాంతం బెంగాల్ ప్రావిన్స్‌లో భాగంగా వుండేది. 1836 నుండి 1872 వరకూ నాటి వలసవాద ప్రభుత్వం తన పాలనా సౌలభ్యం కోసం బెంగాలీ భాషను 'అస్సాం రాష్ట్ర భాష'గా నిర్ణయించి అమలు చేసింది. కానీ అనంతరకాలంలో తమపై " సాంస్కృతిక ఆధిపత్యం" చెలాయిస్తున్నారన్న నిందారోపణలను బెంగాలీలు భరించవలసివచ్చింది. ఆ భావావేశాలు చల్లారలేదు. అవి ఇప్పటికీ సున్నితమైన అంశాలుగానే మిగిలాయి.

1905లో బెంగాల్ విభజన తర్వాత కూడా అస్సాంలోకి భారీ స్థాయిలో 5 లక్షలకు మించి వలసలు కొనసాగినట్లు జనగణన సూపరింటెండెంట్ నమోదుచేశారు. 1900–1930 మధ్య కాలంలో కనీసం 10 లక్షల మంది బెంగాలీ రైతులు వలసవచ్చి కొత్త భూమిని సాగుచేసినట్లు ' ఛేంజింగ్ ఫేస్ ఆఫ్ బెంగాల్' గ్రంథంలో రచయిత, సామాజిక శాస్త్రవేత్త రాధాకమల్ ముఖర్జీ పేర్కొన్నారు.

పై వలసదారుల్లో అత్యధికులు ముస్లింలు. చాలా కష్టించి పనిచేసేవారు. గతంలో సాగుకు నోచని భూములను వ్యవసాయ యోగ్యంగా మార్చారు. బెంగాలీ ముస్లిం వలసదారుల భూ ఆక్రమణలను అరికట్టేందుకు కామరూప్ మరియు నౌగాంగ్ జిల్లాల్లో బ్రిటీష్ ప్రభుత్వం "లైన్ సిస్టమ్"ను ప్రవేశపెట్టింది. అదే ప్రభుత్వం 1928లో నౌగాంగ్ జిల్లాలో వలసదారులు ప్రవేశించి విస్తారమైన ప్రాంతాల్లో స్థిరపడేందుకు అనుమతిస్తూ " కాలోనియల్ స్కీం"ను ప్రవేశపెట్టింది. పైన తెల్పిన అంశాలన్నీ స్వాతంత్ర్యానికి ముందు కాలపు వలసలకు సంకేతాలుగా నిలుస్తున్నాయి.

> **" మోడీ ప్రభుత్వం 27 లక్షల మందికి ఆధార్ కార్డులను తిరస్కరించింది. ఫలితంగా వారి రోజువారీ మనుగడ పీడ కలగా మారింది. వీటితోపాటు ఒక సారి 1.13లక్షలు, మరోసారి 1.17 లక్షల మంది అస్సాం వాసులను 'అనుమానాస్పద ఓటర్లు'( డి - ఓటర్లు)గా ముద్రవేశారు. వారినే భారత ఎన్నికల కమీషన్ దిగువస్థాయి అధికారులు, అస్సాం సరిహద్దు పోలీసులు 'విదేశీయులు'గా ప్రకటించారు. "**

దేశ విభజన అనంతర రాజకీయాలు దేశంలోని తూర్పు, పశ్చిమ ప్రాంతాలను కుదిపేశాయి. అస్సాం కూడా ఈ ప్రభావానికి లోనయింది. అంతకు అనేక సంవత్సరాలకు ముందు నుండే అస్సాంలో వలసదారుల పట్ల విద్వేషాలు గూడుకట్టుకోసాగాయి. భారత తొలి రాష్ట్రపతిగా పనిచేసిన బాబూ రాజేంద్రప్రసాద్ 1926లో ఎగువ అస్సాంలో పర్యటించారు. నాటి అక్కడి పరిస్థితులపై తన ఆత్మకథలో ఇలా పేర్కొన్నారు: " మైమెన్‌సింగ్(విభజన అనంతర తూర్పు పాకిస్థాన్)నుంచి నౌగాంగ్‌కు తరలి వచ్చిన వలసదారుల పట్ల స్థానికుల్లో తీవ్రమైన వ్యతిరేకత వుంది. వలసదారులు ముస్లింలు కావటమే అందుకు కారణం. అక్కడి బీహారీ వలసదారుల పట్ల అంతటి వ్యతిరేకత లేదు." బైట నుండి భారీస్థాయిలో ప్రజలు అక్కడికి చేరటంతో స్థానికుల్లో అభద్రతా భావం పెరిగింది. సంకుచితవాదం ప్రబలింది. భారత ఉపఖండంలో నెలకొన్న మతోన్మాద ప్రభావానికి అస్సాం మినహాయింపు కాదు.

**పౌరసత్వం లేని స్థితి**

అస్సాం జనాభాలో గణనీయమైన సంఖ్య 'పౌరసత్వం లేనిస్థితి'కి చేరి ఇప్పటికీ అల్లాడుతున్నారు. రాజ్యాంగానికి , చట్టానికి వ్యతిరేకమైన బలవంతపు తొలగింపులను అక్కడి ప్రభుత్వం నిర్విరామంగా కొనసాగిస్తున్నది. ఆ చర్యలతో సుమారు 1.3 కోట్ల మంది అస్సాం పౌరులు తమ నివాసాలను, ఉపాధులను కోల్పోయారు. 2018లో కేంద్ర ప్రభుత్వం నియమించిన 'బ్రహ్మ కమిటీ నివేదిక', '2019 అస్సాం భూ విధానం' ప్రభుత్వ గణాంకాల్లోలేని గతకాలపు భూ వినియోగాలు, అస్సాంలో కొనసాగుతున్న బలవంతపు తొలగింపులకు పునాదిగా నిలుస్తు న్నాయి. " ఉగ్రవాద ప్రేరిత, చట్టవ్యతిరేకులైన బంగ్లాదేశీయుల వరద" తమను ముంచేస్తున్నదన్న భయం, ఉన్మాదం అక్కడ రగుల్కొంటున్నాయి.

2018 జాతీయ పౌరసత్వ రిజిస్టరు (యన్ఆర్‌సి) నుండి 1.2 కోట్లమంది అస్సాం ప్రజలు మినహాయించబడినారు. కానీ ఫిర్యాదులు, అభ్యంతరాల పరిశీలన అనంతరం 2019 అంతిమ యన్ఆర్‌సిలో ఆ సంఖ్య 19 లక్షలకు తగ్గిపోయింది. వారు కూడా తిరిగి పౌరసత్వ జాబితాలో చేరటానికి మార్గాలను అన్వేషిస్తున్నారు. అదిసాధ్యం కాకపోతే తమ తొలగింపును చట్టబద్ధంగా సవాలు చేయాల్సిన స్థితి వారికి ఎదురౌతుంది.

దానికి ముందే మోడీ ప్రభుత్వం 27 లక్షల మందికి ఆధార్ కార్డులను తిరస్కరించింది. ఫలితంగా వారి రోజువారీ మనుగడ పీడకలగా మారింది. వీటితోపాటు ఒక సారి 1.13లక్షలు,


## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

> **ఇక్కడ స్థానికులెవరు, స్థానికేతరులు ఎవరన్న సమస్య జటిల మైనది మాత్రమే కాక వివాదాస్పదమైనది. ప్రత్యేకించి అస్సాం ప్రజల్లో నెలకొన్న వైవిధ్యాలు, అక్కడికి పలు దఫాలుగా సాగిన వలసలతో ఈ సమస్య అత్యంత వివాదాస్పదంగా మారింది. నేటి అస్సాంలోని కొన్ని ప్రాంతాలు గతంలో విభిన్న సంస్కృతుల ప్రజల కు నెలవైన 'ప్రావిన్స్'ల్లోని భాగాలే. అక్కడి విస్తారమైన ప్రాంతాల్లో మాట్లాడే బెంగాలీ భాష కూడా అనేక ప్రాంతీయ మాండలికాలు, భాషాంతరీకరణలతో విచిత్రమైన పరిస్థితుల్లో వుంది.**

మరోసారి 1.17 లక్షల మంది అస్సాం వాసులను 'అనుమానాస్పద ఓటర్లు'( డి – ఓటర్లు)గా ముద్రవేశారు. వారినే భారత ఎన్నికల కమీషన్ దిగువస్థాయి అధికారులు, అస్సాం సరిహద్దు పోలీసులు 'విదేశీయులు'గా ప్రకటించారు.

అస్సాం జనసంఖ్య 3.4 కోట్లుగా అంచనా వేయబడింది. రాష్ట్ర ప్రభుత్వ విధానంలో భాగంగా జనాభాలో గణనీయమైన భాగం కుటుంబాల పౌరసత్వం రద్దయింది. అది వారి అదివారి మెడపై కత్తిలా వేలాడుతున్నది. యన్ఆర్సి జాబితా నుండి తొలగించబడింది కొద్దిమందే. కానీ తర్వాత ఆ సంఖ్యను పెంచారు. అనేక లక్షల మంది 'చట్ట వ్యతిరేక వలసదారులు'న్నట్లు ప్రచారం చేసినప్పటికీ తక్కువ సంఖ్యలోనే ఉన్నట్లు ఎన్ఆర్సిలో తేలటంతో అధికారంలో ఉన్నవారు నిరాశ చెందారు. స్థానికులు కానివారిని, భూమికి హక్కుదారులు కానివారిని వివాదాస్పద పద్ధతిలో నిర్ధారించటానికి పూనుకోవటంతో మూక హత్యాకాండ కానప్పటికీ భారీస్థాయిలో భూముల నుండి తొలగించటానికి దారి తీయవచ్చు.

బెంగాలీ మాట్లాడే ముస్లింలు, హిందువులను లక్ష్యంగా చేసుకోవటం, వారిని అస్సాం నుండి తరిమేయటం కోసమేనని స్పష్టమౌతున్నది. ఈ బలవంతపు తొలగింపులు జాతిని శుద్ధిచేయటం కోసమా?

సెప్టెంబరు 23న దర్రాంగ్ జిల్లాలోని ధాల్పూర్లో బలవంతపు తొలగింపులు జరిగాయి. నాటి ప్రజా ప్రతిఘటనను అణచేందుకు జరిపిన పోలీస్ కాల్పుల్లో ఇరువురు చనిపోయారు. వారిలో ఒకరు 12 ఏళ్ల బాలుడు. ఇలాంటి బలవంతపు తొలగింపులు ఎన్ని జరిగాయో పరిశీలించాలి. అక్కడ ఖాళీ చేయించింది ఎవరిని ? ఎన్ని కుటుంబాలు రోడ్డు పాలయ్యాయి? వారిలో ఎందరికి పునరావాసం లభించింది? ఈ భూముల్లో 'గోర్‌కుటి' పేర ఒక వ్యవసాయ ఆధారిత ప్రాజక్టు నిర్మించాలన్నది ప్రభుత్వ వుద్దేశ్యమని తెలుస్తున్నది.

### భూ విధానం

అస్సాం ఒప్పందం ఫలితంగా యన్ఆర్సి గణాంకాల సేకరణ పొరపాటు పద్ధతిలో జరిగిందా? అందుకు న్యాయ వ్యవస్థ ఉదాసీనత, అధికార యంత్రాంగం అవినీతి, బాధ్యతారాహిత్యాలు దోహదపడ్డాయా? అస్సాం ప్రభుత్వం, పోలీస్, అధికార యంత్రాంగం తమ స్వంత ప్రజలను అణచివేసే సాధనాలుగా 2018 బ్రహ్మ కమిటి నివేదిక, 2019 భూ విధానం ఉపయోగపడుతున్నాయి.

1989 అస్సాం భూ విధానం స్థానంలో, ఆ రాష్ట్ర ప్రభుత్వం 2019 అక్టోబరులో నూతన భూ విధాన చట్టాన్ని రూపొందించింది. నూతన చట్టం ద్వారా మూడు బీఘాల (43,200 చ.అ.) వ్యవసాయ భూమి, గృహ నిర్మాణానికి మరో అర బీఘా స్థలం స్థానికులకు కేటాయిస్తారు. "స్థానికులు" పదానికి స్పష్టమైన నిర్వచనం ఇవ్వకుండా తప్పించుకున్నారు.

ఇక్కడ స్థానికులెవరు, స్థానికేతరులు ఎవరన్న సమస్య జటిలమైనది మాత్రమే కాక వివాదాస్పదమైనది. ప్రత్యేకించి అస్సాం ప్రజల్లో నెలకొన్న వైవిధ్యాలు, అక్కడికి పలు దఫాలుగా సాగిన వలసలతో ఈ సమస్య అత్యంత వివాదాస్పదంగా మారింది. నేటి అస్సాంలోని కొన్ని ప్రాంతాలు, ప్రధానంగా గతంలో విభిన్న సంస్కృతుల ప్రజలకు నెలవైన ' ప్రావిన్స్'ల్లోని భాగాలే. అక్కడి విస్తారమైన ప్రాంతాల్లో మాట్లాడే బెంగాలీ భాష కూడా అనేక ప్రాంతీయ మాండలికాలు, భాషాంతరీకరణలతో విచిత్రమైన పరిస్థితుల్లో వుంది. ఈ మార్పులు కలకత్తాలోని 'ఉన్నత తరగతి ప్రజలకు అర్థం కావు. ఈ చారిత్రక పునాదిపై 2014, 2016 అనంతర పరిస్థితులను అర్థం చేసుకోవాలి. నేడు ఆర్‌యస్‌యస్ అడుగుజాడల్లో నడుస్తున్న క్రూరమైన ఆధిపత్యవాద రాజకీయ శక్తి ఈ సంక్లిష్ట రాజకీయ పరిస్థితిని మరింత విషమంగా మార్చే ప్రమాదం పొంచివుంది. ఈ నేపథ్యంలో బ్రహ్మ కమిటి నివేదికను, 2019 భూ విధానాన్ని పరిశీలిద్దాం.

### బ్రహ్మ కమిటి నివేదిక

అస్సాం రాష్ట్రంలో భూ పాలసీని పరిశీలించి, స్థానిక ప్రజల భూమి హక్కుల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలను సిఫార్సుచేసే లక్ష్యంతో ఏడుగురు సభ్యులతో బ్రహ్మ కమిటిని నియమించారు. కేవలం అస్సాంలో అమల్లో వున్న 'భూ పాలసీ'లో చేయవలసిన మార్పులు చేర్పులను సూచించటమే ఆ కమిటి బాధ్యత. అక్కడ స్థానికులెవరు? స్థానికేతరులు ఎవరు?.. ఈ నిర్వచనాల జోలికి వెళ్లటం ఈ కమిటి పరిధిలో లేదు. కానీ ఈ కమిటి తన పరిధిని అతిక్రమించి, పొంతనలేని వివాదాస్పదమైన నిర్వచనాలను తన నివేదికలో పొందుపరచింది. 1951 జనగణన రిపోర్టు, రాజ్యాంగ నియమావళి నిర్వచనాలను కమిటి తిరస్కరించింది. వీరి స్వంత నిర్వచనం ప్రకారం స్థానికులంటే "అనేక తరాలుగా అస్సాం రాష్ట్రంలో నివశించి వుండాలి. అస్సాం మూలాలున్న ఏదో ఒక సనాతన తెగకు లేదా సనాతన జాతి, వంశానికి చెందినవారై వుండాలి."

పై నిర్వచనాలు రాష్ట్ర ప్రభుత్వ హెూం మరియు రెవెన్యూ విభాగాల అభిప్రాయాలకు భిన్నంగాను, వివాదాస్పదంగాను మారాయి. 1951 జనగణన రిపోర్టు నిర్వచనం ఇలా వుంది: " ఎవరైనా అస్సాం రాష్ట్రానికి చెంది వుండాలి. రాష్ట్రంలో వినియోగించే ఏదైనా భాషను అక్కడి మాండలికంలో మాట్లాడగల్గాలి. అలాంటి వారిని స్థానికులుగా పిలువవచ్చు."

పై నిర్వచనాన్ని అనుసరించి అస్సాంలోని భూమిలేని శాశ్విత నివాసి ఎవరికైనా భూమి కల్గివుండే హక్కు సంక్రమిస్తుంది. స్థానికులు, స్థానికేతరుల సమస్యపై రాజ్యాంగం నిర్వచించలేదు. అయితే ప్రత్యేక తెగలు నివసించే ప్రాంతాలను, భూములను కాపాడేందుకు రాజ్యాంగంలోని 5, 6, 9 సెక్షన్‌లలో కొన్ని ప్రత్యేక నియమావళులు ఉన్నాయి.

బ్రహ్మ కమిటి రిపోర్టు పలు అతిశయోక్తులతో నిండివుంది. ప్రతి స్వదేశీయుని జాతి, భాష, సాంస్కృతికపరమైన అస్థిత్వాలను కాపాడేందుకు వారిని గుర్తించాలని రిపోర్టు తెల్పుతున్నది. వారి సంస్కృతి, భాష, అస్థిత్వాలు ఈ గడ్డపైన నివశిస్తున్న ఇతరుల కంటే భిన్నమైనవిగా ఆ కమిటి నమ్ముతున్నది.

భారత్‌లోని ఇతర రాష్ట్రాలకు చెందినవారు తమ మాతృభాషలు మాట్లాడుతున్నా లేదా తమ మూల సంస్కృతిని కొనసాగిస్తున్నా అలాంటి వారు అస్సాంలో 'స్వదేశీయులు'గా గుర్తించ బడరు. "ఆక్రమణల ద్వారా ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకున్నవారు, తమ స్వాధీనంలో ఉన్నాయి కాబట్టి వాటిపై యాజమాన్య హక్కులు పొందలేరు." (క్లాజు 1.14)

ఈ సమస్య సంక్లిష్టమైనదే కాదు. చట్ట విరుద్ధమైనది కూడా. సాగుదారుల భూ యాజమాన్యం, అధీనం, సాగు హక్కులపైన అనేక వివరణలు వస్తున్నాయి. వాటిని పరిశీలిస్తే, తెగల అధీనంలోని సాగు భూములన్నీ ఉమ్మడి భూములేనని ప్రచారం చేస్తున్నారు. సాధారణంగా అలాంటి భూములను తన స్వంత భూములుగానే ప్రభుత్వం పరిగణిస్తుందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

వ్యవసాయ భూముల బదిలీ హక్కు కేవలం అస్సాం రాష్ట్రంలోని 'స్వదేశీయుల'కు మాత్రమే పరిమితం చేయబడింది. అది కూడా "స్వదేశీ ప్రజలకు భూమి హక్కుల పరిరక్షణను ఖరారు చేయాలి" అని కమిటి పేర్కొంది. అస్సాం ప్రభుత్వ హోం డిపార్టుమెంటు ఈ నిర్ధారణను వ్యతిరేకించటం ప్రాధాన్యత గల అంశం. కులం, తెగ, మత విశ్వాసాలతో నిమిత్తం లేకుండా స్వదేశీయులను గుర్తించేందుకు 1951 యన్‌ఆర్‌సిని ప్రాతిపదికగా తీసుకోవాలని 2017-18లో హోం డిపార్టుమెంటు సూచించింది. కాని "స్వదేశీయుల"ను గుర్తించేందుకు బ్రహ్మ కమిటీ సూచనలే అధికారులకు సాధనంగా మారాయి. అనేక దశాబ్దాలుగా వేధింపులకు గురవుతున్న నిర్దిష్టమైన ప్రజలను లక్ష్యంగా చేసుకునే పై అస్త్రాలను ప్రయోగిస్తున్నారు.

**'చార్' ప్రాంతాల్లోని ముస్లింలపై దాడులు**

184 పేజీల బ్రహ్మ కమిటీ రిపోర్టు ఇలా చెబుతున్నది: "కొత్త, పాత చార్‌లు అన్నింటా ఆక్రమించబడిన భూమి అంతా దేశదిమ్మరులైన చట్ట వ్యతిరేక 'బంగ్లాదేశ్ వలసదారు'ల ఆక్రమణలో వుంది. చార్‌ల పరిధిని దాటి కూడా వారి ఆక్రమణలు విస్తరించాయి. అలాంటి ఆ క్రమణలను ఖాళీచేయించాలి. ఖాళీ చేయించబడ్డ భూములను 'స్వదేశీయులకే కేటాయించాలి. లేకుంటే పర్యావరణ పరిరక్షణ కోసం పడావుగా వుంచాలి"

రిపోర్టులో ప్రమాదకరం, చట్ట వ్యతిరేకమైన వేరొక అంశం కూడా ఉంది. "పెద్ద సంఖ్యలో వున్న చట్టవ్యతిరేక బంగ్లాదేశ్ వలసదారులను దేశం నుండి బహిష్కరించటం కోసం ముందుగా నిర్బంధ శిబిరాలకు తరలించాలి. సేద్యంకోసం ఖాళీ భూములను భూమిలేని 'స్వదేశీయుల'కు పంచాలి. మరోసారి భూ దురాక్రమణలు జరుగకుండా నిరోధించేందుకు, శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా వారికి సైనిక రక్షణ కల్పించాలి." (పేజి 73, క్లాజు 1.11)

> **"అస్సామీ ముస్లింలతో పాటు బెంగాలీ హిందువులు కూడా "స్వదేశీయుల" నిర్వచనం పరిధి నుండి నెట్టేయబడినారు. నేడు వారందరి పరిస్థితి దుర్భరంగా మారింది. అస్సాం రాష్ట్రంలోని పచ్చిక బయళ్లలో, గిరిజన ప్రాంతాల్లో నెలకొల్పిన శరణార్థుల కాలనీల్లో నివశిస్తున్న సుమారు 65 లక్షల మంది బెంగాలీ హిందువులను కూడా బహిష్కరించటానికి సన్నద్ధమయ్యారు."**



**జాతీయ పౌరసత్వ రిజిస్టర్‌లో తమ పేర్లు ఉన్నాయో లేదో ఆందోళనతో చూసుకుంటున్న అస్సాం పౌరులు**

బ్రహ్మ కమిటి తన పరిధిని అతిక్రమించటమే కాదు. ప్రస్తుత పాలనా వ్యవస్థ చేపట్టిన "స్థానిక ప్రజలను ఇళ్ల నుండి తరిమివేయటం", "ఓటు హక్కును రద్దుచేయటం"వంటి చట్ట విరుద్ధ చర్యలను కూడా సమర్థిస్తున్నది. చార్ ప్రాంతంలో నివశిస్తున్న 35 లక్షల మందిలో 95 శాతం ముస్లింలే .వారి భూములు తరచూ నదీ ప్రవాహాల్లో మునకకు గురౌతున్నందున వారివద్ద భూమి పట్టాలు లేవు.

ప్రభుత్వ భూములు, తాత్కాలిక పట్టా భూములు, పచ్చిక బయళ్లపై ఆధారపడి నదీ తీరాలకు దూరంగా మరో 35 లక్షల మంది ముస్లింలు జీవిస్తున్నారు. అక్కడి ప్రజలు సన్నకారు రైతులుగా, మత్స్యకారులుగా చాలీచాలని ఆదాయాలతో బతుకులీడుస్తున్నారు.

అస్సామీ ముస్లింలతో పాటు బెంగాలీ హిందువులు కూడా "స్వదేశీయుల" నిర్వచనం పరిధి నుండి నెట్టేయబడినారు. నేడు వారందరి పరిస్థితి దుర్భరంగా మారింది. అస్సాం రాష్ట్రంలోని పచ్చిక బయళ్లలో, గిరిజన ప్రాంతాల్లో నెలకొల్పిన శరణార్థుల కాలనీల్లో నివశిస్తున్న సుమారు 65 లక్షల మంది బెంగాలీ హిందువులను కూడా బహిష్కరించటానికి సన్నద్ధమయ్యారు.

అస్సాంలో వరుసగా రెండు సార్లు బిజెపి ప్రభుత్వాలు ఏర్పడినాయి. ఆ ప్రభుత్వాలు లోపభూయిష్టమైన బ్రహ్మ కమిటి సిఫార్సులను అడ్డంపెట్టుకుని అనేక తరాలుగా బెంగాలీ మాట్లాడే ప్రజలు దున్ని సాగుచేసుకున్న వ్యవసాయ భూములను బలవంతంగా స్వాధీనం చేసుకుంటున్నాయి. అనేక ప్రాంతాల్లో రాజ్‌భొంగ్సి, ఇతర గిరిజన

> **" రాజ్యం యొక్క 21వ శతాబ్దపు భిన్నమైన అవతారాన్ని ప్రస్తుతం మనం చూస్తున్నాం. మొదట అనాగరికమైన తన శక్తులన్నింటినీ తన లక్ష్యమైన ఒక సామాజిక తరగతిపై ఎక్కుబెడుతుంది. ఆ ప్రజలపై క్రూరమైన హత్యాకాండ సాగిస్తుంది. తర్వాత వారి ఓటు హక్కును రద్దు చేస్తుంది. అంతిమంగా వారిని పౌరసత్వ జాబితా నుండి మినహాయిస్తుంది. "**

తెగలు సాగుచేసుకుంటున్న భూములను కూడా లాక్కొంటున్నారు. సుమారుగా 19వ శతాబ్దం (1800లు) ఆరంభం మరియు మధ్య కాలం నుండి అస్సాం గడ్డపై నివశిస్తున్న బెంగాలీ భాష మాట్లాడే ప్రజలపై జరుగుతున్న మరో భయానక దాడిగా ఈ దురంతాన్ని అర్థం చేసుకోవాలి.

బ్రహ్మకమిటి సిఫార్సులతో పాటు, వివాదాస్పదమైన 2019 భూ విధానం అమలుతో రాష్ట్రంలోని నదీ తీర ప్రాంతాలు, పచ్చిక బయళ్లలో నివశిస్తున్న 70 లక్షల మంది అస్సామీ ముస్లింలు, 60 లక్షల మంది బెంగాలీ మాట్లాడే హిందువులు తమ ఓటు హక్కును కోల్పోతారు. ఈ విధానాలు అమలు కొనసాగితే 1.3 కోట్లమంది ప్రజలు జీవించే హక్కు, చట్టం ముందు సమానత్వ హక్కు వంటి ప్రాథమిక హక్కులను కోల్పోతారు. కులం, జాతి, భాషల ప్రాతిపదికన వివక్షాపూరితమైన అక్కడి భూ విధానం రాజ్యాంగపు 14, 15, 21 అధికరణాలకు విరుద్ధంగా వుంది.' స్వదేశీ' ప్రజల సమస్యలను పరిష్కరించే మిషతో " స్థానిక ప్రజల విశ్వాసం, సంస్కృతి' పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు నూతన ముఖ్యమంత్రి 2021 జూలైలో ప్రకటించాడు. కొందరిని కలుపుకుంటూ, మరి కొందరిని వేరుచేస్తున్న ఈ పథకంతో పరిస్థితి మరింత దిగజారింది.

రభా, బోరో, మిసింగ్, మోరాన్, మటాక్ తెగలు "సుసంపన్నమైన వారసత్వం"గల తెగలుగా ప్రస్తావించబడ్డాయి. మిగిలిన తెగలను ఆ జాబితా నుండి మినహాయించారు. తనకు ఓటేస్తే షెడ్యూల్ తెగ హోదా కల్పిస్తామని, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని, వారి భూములకు గుర్తింపునిస్తూ 2006 అటవీ హక్కుల చట్టం పరిధిలోకి తెస్తామని గత రెండు ఎన్నికల్లో చేసిన వాగ్దానాలను బిజెపి తుంగలో తొక్కింది. అస్సాం 'స్వదేశీ' ప్రజల్లోని ఒక సెక్షన్‌కు( ఏ సెక్షన్‌కో ఇంతవరకూ స్పష్టత లేదు.) రక్షణ కల్పిస్తామన్న ముసుగులో బ్రహ్మ కమిటి నివేదికను అమలుచేస్తున్నారు. ఆ కమిటీ సిఫార్సులతో పథకం ప్రకారం కొన్ని ప్రజా సమూహాలను దూరంగా నెట్టేశారు. వ్యక్తిగత నమ్మకాలు, ఏ వ్యక్తి ఏ తెగలో జన్మించాడు, ఏ తెగలో వున్నాడు అంశాల ఆధారంగా అమలు చేయటంతో అది అనేక కుటుంబాలకు అపార నష్టం కల్గిస్తున్నది.

ఈ విధానం రాజ్యాంగ ఉల్లంఘన మాత్రమే కాదు. న్యాయశాస్త్ర పరిధిలోని ప్రాథమిక హక్కులను కూడా అతిక్రమిస్తున్నది. నవతేజ్ జోహార్, యూనియన్ ఆఫ్ ఇండియాకు మధ్య నడచిన వివాదం తీర్పు పేరా 27లో సుప్రీంకోర్టు ఇలా చెప్పింది :" చట్టం ముందు అందరూ సమానులే, చట్టపరమైన రక్షణలు అందరికీ సమానమే వంటి విలువలకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 అపారమైన ప్రాధాన్యతనిస్తున్నది. దాన్ని నామమాత్రపు ప్రక్రియ స్థాయికి కుదించేందుకు ప్రయత్నిస్తున్నారు. రాజ్యపు ఏకపక్ష చర్యల నుండి కాపాడే " సమానత్వం విలువల" రక్షణ కవచాన్ని ప్రజలు కోల్పోతున్నారు. మానవాళి మనుగడకు, వ్యక్తులందరి పట్ల న్యాయమైన పద్ధతిలో వ్యవహరించటాన్ని గ్యారంటీ చేయాలని ఆర్టికల్ 14 నిర్దేశిస్తున్నది."

అస్సాంలో పథకం ప్రకారం బెదరగొట్ట బడిన ఒక సెక్షన్ ప్రజలను కాపాడేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ విలువలను, వాటి సంపద్వంతమైన సారాంశాన్ని విస్మరిస్తున్నారు. ' వర్తమాన రాజ్యం' విధానాలను అడ్డం పెట్టుకుని ఈ దుశ్చర్యలకు పాల్పడటం సరి కాదు. రాజ్యం యొక్క 21వ శతాబ్దపు భిన్నమైన అవతారాన్ని ప్రస్తుతం మనం చూస్తున్నాం. మొదట అనాగరికమైన తన శక్తులన్నింటినీ తన లక్ష్యమైన ఒక సామాజిక తరగతిపై ఎక్కు బెడుతుంది. ఆ ప్రజలపై క్రూరమైన హత్యాకాండ సాగిస్తుంది. తర్వాత వారి ఓటు హక్కును రద్దు చేస్తుంది. అంతిమంగా వారిని పౌరసత్వ జాబితా నుండి మినహాయిస్తుంది.

**(స్వేచ్ఛానువాదం:వై సిద్ధయ్య)**

## 'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

# అభివృద్ధి పన్నుకు వ్యతిరేకంగా పంజాబ్ రైతాంగ పోరాటం

(2వ పేజీ తరువాయి)

ప్రకటించిన ధరలు కాగితాలకే పరిమితమ య్యాయి. కమ్యూనిస్టు పార్టీ, కిసాన్‌సభ ఉద్యమం ప్రారంభించడానికి ముందు జనతా ఆహార కమిటీలను ఏర్పాటు చేయడానికి చొరవ తీసుకున్నాయి. ఈ ఉద్యమంలో వేలాదిమంది వ్యవసాయ కార్మికులు, పట్టణ పేదలు, కార్మి కులు, మధ్య తరగతి వారు కూడా పాల్గొన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, అభివృద్ధి పన్నుకు వ్యతిరేకంగా రైతాంగం చేస్తున్న పోరాటానికి వ్యవసాయ కార్మికులు, పట్టణ మధ్యతరగతి ప్రజలు, కార్మి కులు తమ సానుభూతిని అందించేటట్టు చేశాయి.

రైతులకు అభివృద్ధి పన్ను నోటీసులు అందగానే 1959 జనవరి 21న మొట్ట మొదటి సారిగా ఆ పన్నుకి వ్యతిరేకంగా నాలుగు జిల్లాలో ఉద్యమం ప్రారంభించారు. ఉద్యమం రెండు వారాలలోనే మరో నాలుగు జిల్లాలకు వ్యాపించింది. ఆ తరువాత పన్నుభారం పడిన 9 జిల్లాలకూ విస్తరించింది. కొద్ది రోజులలోనే రాష్ట్రమంతటి దృష్టిని ఈ ఉద్యమం ఆకర్షిం చింది. గ్రామ ప్రజలందరూ సత్యాగ్రహులను ఆహ్వానించడానికి బయలుదేరారు. సత్యాగ్ర హులు జాతాలుగా గ్రామగ్రామం తిరుగుతుం డగా వేలాది మంది వారితో కలిసి పాల్గొన్నారు. రైతాంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పాటలుగా రాసి వాటిని యువతీ యువకులు పాడడం, సాహసోపేతమైన పోరాటాలను కీర్తించడం మొదలవడంతో ఒక కొత్త సాంస్కృతిక పునరుజ్జీవం ప్రారంభమైంది.

ఉద్యమం మొదలైనప్పటి నుండి పేద, మధ్యతరగతి రైతాంగం పాల్గొన్నారు. ఆ తరువాతి కాలంలో ధనిక రైతులు చేరారు. వ్యవసాయ కార్మికులకు అభివృద్ధి పన్నుతో ఎటువంటి ప్రత్యక్ష సంబంధం లేకపోయినా రైతాంగానికి మద్దతుగా జైళ్ళకు వెళ్ళటానికి ముందుకొచ్చారు. ఆహార భద్రత ఉద్యమానికి, వేతనాలు పెంచాలని, భూమి పంచాలన్న డిమాండ్లకు కిసాన్‌సభ ఇచ్చిన మద్దతు కూడా ఉద్యమం ఊపందుకోడానికి ఉపయోగపడింది. పన్నులు వేయవలసిన ఉద్యోగులే చాలా చోట్ల డిమాండ్ నోటీసులను చించేశారు. ఉద్యమ కాలంలో మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులూ రెండు నెలల వరకు గ్రామాలలోకి అడుగు పెట్టలేకపోయారు.

కిసాన్‌సభ నేతృత్వంలోని ఈ ఉద్యమానికి గ్రామాలలో ఉన్న అన్ని పార్టీల నుండి మద్దతు లభించింది. ఫిబ్రవరి చివరికి వచ్చేసరికి అభివృద్ధి పన్ను వ్యతిరేక ఉద్యమంతో రాష్ట్ర మంతా అట్టుడికిపోయింది. ఉద్యమం ప్రజలం దరి దృష్టిని ఆకర్షించింది.

లక్షలాది మంది రైతులు అనేక రకాలుగా ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. ప్రదర్శనలు, గ్రామాలలో జరిగిన ప్రభాత భేరీలలో పాల్గొ న్నారు. సత్యాగ్రహులకు సన్మానాలు చేశారు. సత్యాగ్రహులపై పన్నులు వేయడానికి వ్యతిరేకంగా పోరాడారు. ఇంటింటికి తిరిగి పోరాటాన్ని గురించి వివరించారు. ప్రభుత్వ అణచివేత విధానాలను ఎక్కడికక్కడ ఎండగ ట్టారు. ప్రభుత్వం పూర్తిగా ఆత్మరక్షణలో పడిపోయింది. రైతాంగంలో విభజన తెచ్చే ప్రయత్నాలు చేసింది.

రాయితీలు, వాగ్దానాలతో ఉద్యమాన్ని బలహీనపరచడం కుదరకపోవడంతో ప్రభు త్వం తీవ్రమైన అణచివేతకు దిగింది. కిసాన్ సభ, కమ్యూనిస్టు పార్టి కార్యకర్తలందరికి అరెస్టు వారెంట్లు జారీచేసింది; కానీ ప్రభుత్వం వారిని అదుపులోకి తీసుకోలేకపోయింది. దీనితో కోపంతో ఊగిపోయిన ప్రభుత్వం మెషిన్ గన్స్‌తో కూడిన పోలీసులను గ్రామాలలోకి దించింది. ప్రజల రాకపోకలపై ఆంక్షలు విధించింది. గ్రామాలను దోచుకుంది. సత్యాగ్రహులపై వేసిన జరిమానాలు కట్టలేదన్న నెపంతో గ్రామీణుల సామానులు వేలం వేసింది. రైతులు, సత్యాగ్రహులను పోలీసు స్టేషన్లకు ఈడ్చుకెళ్లారు. పోలీసులు వారిని నిర్దాక్షిణ్యంగా చావబాదారు. ప్రభుత్వాధికారులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నారు. పాలక పార్టీ చేతిలో అధికారులు, న్యాయమూర్తులు కీలుబొమ్మలుగా మారారు. ఏ చర్యలకూ రాతపూర్వక ఆదేశాలు లేవు. లాఠీదెబ్బలు, టియర్ గ్యాస్, కాల్పులు, దోపిడీలు సర్వసాధారణంగా మారాయి. వందలాది మంది స్త్రీ, పురుషులపై తప్పుడు కేసులు బనాయించి అదుపులోకి తీసుకున్నారు. జలంధర్ జిల్లాలో ఈ అణచివేత పరాకాష్టకి చేరింది. మహిళలు ఈ సవాలును స్వీకరించి, గ్రామాలను పోలీసులు చుట్టుముట్టగానే ఎదురు నిలిచి పోరాడారు. పోలీసుల దమనకాండను అసమాన ధైర్యసాహసాలతో ఎదుర్కొన్నారు. చాలామంది కిసాన్‌సభ, కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలను పరారైన వారిగా ప్రకటించి, వారి ఆస్తులను జప్తు చేశారు.

కిసాన్‌సభ ఆఫీస్ పనిచేయడం అసాధ్య మైంది. ఉద్యోగస్తులందరినీ అదుపులోకి తీసుకున్నందువలన, కమ్యూనిస్టు పార్టి పత్రిక' నావన్ జమానా 'ప్రచురణను బలవంతంగా నిలిపివేయవలసిన పరిస్థితి ఏర్పడింది. ప్రజల మానసిక స్థితి ఎలా ఉందంటే, పత్రిక ఆగిపో యిన రెండు రోజుల్లోనే అందులో పనిచేయ డానికి చాలామంది ముందుకొచ్చారు. పత్రిక తిరిగి ప్రారంభానికి తమవంతు తోడ్పాటును అందించారు.

ప్రభుత్వ అణచివేత ప్రజలలో ఎంతటి ఆగ్రహాన్ని రేపిందంటే, ప్రభుత్వం ఇంకెంత మాత్రం అణచివేతను కొనసాగించలేకపోయింది. పరిపాలన స్థంభించిపోయింది. ఉద్యమం ముందు ప్రభుత్వం తలొగ్గవలసి వచ్చింది. అభివృద్ధి పన్ను తగ్గింపు, కిసాన్‌సభ ఇతర డిమాండ్లను ముఖ్యమంత్రి అంగీకరించటంతో 1959 మార్చి 22న పోరాటాన్ని నిలిపివేశారు.

పోరాట కాలమంతటిలో 19,000 మంది వాలంటీర్లు సత్యాగ్రహం చేయడానికి ముందుకొచ్చి, జిల్లా కోర్టుల పనికి ఆటంకం కలిగించారు; 10,000 మంది జైలు కెళ్లారు. 3,000 మంది పోలీసుల చేతిలో చావుదెబ్బలు తిన్నారు. వందలాది మందిని పోలీసులు చిత్రహింసలకు గురిచేశారు. ముగ్గురు మహిళల తో సహా ఎనిమిది మంది కామ్రేడ్లు పోలీసు కాల్పులలో అమరులయ్యారు. పోలీసుల చిత్ర హింసలు భరించలేక ఒకరు ప్రాణత్యాగం చేశారు. మరో ఇద్దరు జైలులో చనిపోయారు. ఆఖరికి ఉద్యమం నిలిపివేస్తున్న రోజు కూడా సత్యాగ్రహం చేయడానికి 250 మంది సత్యాగ్రహులు చండీఘర్ చేరుకున్నారు; వేర్వేరు జిల్లా నుండి 3,000 మంది జిల్లా కోర్టులకు చేరుకుని ధర్నాలో పాల్గొన్నారు.

ఈ ఉద్యమ ప్రభావం రాజస్థాన్, బీహార్ రాష్ట్రాలపై కూడా పడింది. ఎక్కడో మారుమూల ప్రాంతాలలో తప్ప, ప్రభుత్వం ఎక్కడా అభివృద్ధి పన్ను వసూలు చేయలేకపోయింది. ఈ ఉద్యమం హిందూ, సిక్కు వ్యవసాయ కూలీలు, రైతాంగం మధ్య ఐక్యతను పెంచి మతతత్వవాదులను చావుదెబ్బ కొట్టింది. పంజాబ్‌లోని ప్రజలు, ప్రస్తుతం హర్యానాగా చలామణి అవుతున్న ప్రాంత ప్రజల మధ్య సయోధ్యను పెంచి, గ్రామీణ, పట్టణ ప్రజల మధ్య చిచ్చు పెట్టాలనుకునే వారికి తగిన గుణపాఠం నేర్పింది. తాము చేస్తున్న డిమాం డ్లకు ప్రజలందరి మద్దతును రైతాంగం పొందింది. ఈ నాటి పంజాబ్, హర్యానా ప్రజల మధ్య ఐక్యతని పెంచింది. ఈ ఉద్యమం వలన కమ్యూనిస్టు పార్టీ, కిసాన్‌సభ కొత్త ప్రాంతాలకు విస్తరించాయి. కాంగ్రెస్ పార్టీ, దాని రాజకీయ విధానాలను వ్యతిరేకించే దృఢమైన ప్రతిపక్ష శక్తిగా ఎదిగాయి.

(అనువాదం: కె ఉషారాణి)

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-11-2021 (36 pages) Postal Regd. No D/VJ/172/2021-23

# ప్రకృతి మనిషి యొక్క నిర్జీవ దేహం

## - కారల్ మార్క్స్



ప్రపంచ ప్రజలందరినీ కరోనా వైరస్ హడలుగొడుతున్నది. ఇది మానవజాతికి ఎంత నష్టాన్ని కలుగజేస్తుందో అంచనాలు వేయడం కూడా కష్టంగా ఉంది. ఇటువంటి మహా విపత్తును అర్థం చేసుకోడానికి మనకు జీవావరణ శాస్త్రం (Ecology) ఉపయోగపడుతుంది. జీవావరణ శాస్త్రం గురించి అనేకమంది శాస్త్రవేత్తలు విలువైన సమాచారాన్ని అంచించారు. ఈ అంశంపై కారల్ మార్క్స్ ప్రకృతి, మానవుల సంబంధాన్ని ఒక నూతన దృక్పథంతో 19 వ శతాబ్దంలోనే తన సిద్ధాంతాన్ని అందించారు. దీన్ని స్థూలంగా పరిశీలిద్దాము.

1842 లో లైబిగ్ అనే జీవ శాస్త్రవేత్త "కర్బన రసాయన శాస్త్రం, మానవశరీర ధర్మశాస్త్రం, వ్యాధినిర్ణయశాస్త్రాల్లో దాని అనువర్తితాలు" (ORGANIC CHEMISTRY AND ITS APPLICATIONS IN PHYSIOLOGY AND PATHOLOGY) అనే పుస్తకాన్ని ప్రచురించాడు. కారల్ మార్క్స్ దీన్ని అధ్యయనం చేసి సమాజానికి, ప్రకృతికి ఉండే పేగుబంధాన్ని వివరించారు. ప్రకృతి అనేది మనిషి యొక్క నిర్జీవ దేహం (Naturel is mans inorganic body) అని చెప్పాడు. అంటే ప్రకృతిలో మనిషి ఒక భాగం. మనిషి ప్రకృతితో అనేక విధాలుగా సంబంధాలు కలిగి ఉంటాడని అర్థం.

మారుతున్న ప్రకృతికి అనుగుణంగా మనిషి తన జీవన విధానాన్ని మార్చుకోవాలి. అంతేగాని సొంత లాభాల కోసం, పెట్టుబడి అభివృద్ధి కోసం జీవావరణాన్ని విధ్వంసం చేయరాదు. ఆ విధంగా చేస్తే ప్రతి పది సంవత్సరాలకు సగటున ఒక విపత్తును ప్రపంచం ఎదుర్కొంటుంది. ఇప్పుడు దాదాపు 100 సంవత్సరాల తరువాత ఒక మహా విపత్తును (Pandemic) ఎదుర్కొంటున్నాము. పెట్టుబడి ఒకవైపు శ్రమ శక్తిని దోపిడీ చేస్తూనే మరో వైపు ప్రకృతి వనరులను నాశనం చేస్తుంది. ఆ విధంగా ప్రకృతికి ఉండే భరించగలిగిన శక్తిని విచ్ఛిన్నం చేస్తుంది. అలా జరిగినపుడు సమాజానికీ ప్రకృతికీ మధ్య ఉండే సమతుల్యత దెబ్బతింటుంది. దీని వలన అతి వృష్టి, అనావృష్టి, భూ తాపము... వంటివి సంభవిస్తున్నాయి.

జీవ క్రియ అంటే ఒక జీవిలో పదార్థం శక్తిగా మారే ఈ ప్రక్రియ. ఇది ప్రతి కణంలో జరుగుతుంది. శక్తిగా మారే ఈ ప్రక్రియ ఆగిపోతే ఆ జీవి మరణిస్తుంది. జీవావరణంలో కూడా పదార్థం శక్తిగా రూపాంతరం చెందుతుంది. ఇంకా పెద్ద స్థాయిలో ఉదాహరణకు జీవావరణంలో భూమి, నీరు, గాలి, అనేక మార్పులకు లోనవుతుంటాయి. అందువల్లే వర్షాలు, తుఫానులు, పిడుగులు వంటి దృగ్విషయాలు జరుగుతుంటాయి. మరల మరల జరిగే ఈ ప్రకృతి పరిణామాల ఆధారంగా కారల్ మార్క్స్ పెట్టుబడి దారి వ్యవస్థలో మానవులకు ప్రకృతికీ మధ్య ఒక పెద్ద అగాధం ఎలా పెరుగుతుందో వివరించాడు. ముఖ్యంగా పెట్టుబడి దారీ వ్యవసాయ రంగంలో జీవ ప్రక్రియలో ఏర్పడే చీలిక (Metabolic rift) మూలంగా సంభవించే విపత్తుల గురించి వివరించాడు. అంతేకాదు Metabolic rift అనేది ఒక సంఘటన కాదు. అది ఒక చారిత్రక క్రమంగా కొనసాగుతుంది. ఇంకా అనేక రూపాలుగా విస్తరిస్తుంది. అది ప్రాథమిక ఉత్పత్తి దారులను తమ ఉత్పత్తి సాధనాల నుండి దూరం చేస్తుంది. గ్రామానికీ–పట్టణానికీ, ఉత్పత్తికీ–వినిమయానికి మధ్య దూరం పెంచుతుంది. సామ్రాజ్యవాద దేశాల స్థితికీ, దోపిడికీ గురయ్యే దేశాలకీ మధ్య దూరాన్ని మరింతగా పెంచుతుంది. దీనకంతటికీ ముఖ్య కారణం అంతులేని సంపదను పోగు చేసుకునే ఒక రాజకీయ ఆర్థిక ప్రక్రియ అని ఆయన వివరించాడు.

**- మహమ్మద్ అక్బర్**, గుంటూరు

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120** పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు..........................................

వీధి.........................................................

గ్రామం.....................................................

మండలం లేదా పట్టణం.............................

జిల్లా.........................................................

e m a i l : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977.
Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.16, No.6. Published on November 1, 2021